**PAGES MISSING WITHIN THE BOOK ONLY**

Damage Book

UNIVERSAL
LIBRARY
OU_204525
UNIVERSAL
LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. [illegible] Accession No [illegible]

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below.

ఏదివ్యపూరుషు లీ శాద్వలాంకూర
శేఖరమ్ముల లిఖించిరో యివెల్ల !
ఈవాయువీచిలో నేయప్సరస్సమా
జము నింపిరో గీతిసముదయంబు !
ఏదివ్యశిల్పు లీ రోదసీకుహారాన
వ్రాసిరో దివ్యశిల్పంబు లిన్ని !
ఈవథాంతరమునం దే పురాణమునీంద్ర
సంతతులో ప్రశంసలు పొనర్తు,
ఎటఁగనినఁ బూర్వపల్లవనృపచరితలె
వ్రాయఁబడి, పాడఁబడి, గీయఁబడి, యువన్య
సింపఁబడి శ్రోత్రపేయమై చెన్నుదాల్చె
నీయతీంద్రియశక్తి నా కెట్లు లబ్బె !

ఈపొలా లెంత చే వెక్కించుకొన్నవో !
గుండెవ్రయ్యు సముద్రగుప్త డడలె,
ఈనేలపావిత్ర్య మెంత కుంభించెనో !
చిత్రరథస్వామి సేవలు కొనె,
ఇట పల్లవులరాచయెలనాగ లేవ్రత
మ్ములు చేసిరో ! లచ్చి నిలుకడపడె,
ఈకాశ్యపీఖండ మేశరజ్జ్యోత్స్నలో
పులకించెనో ! కీర్తి తెలుపులూరె,

ఇట నెచట త్రవ్వినను బంగరేనఁట, యది
యెంత శ్రీయో, యదెంత రాజ్యేందిరయో, ప
దానతనఖాగ్రపాతనిర్యన్నిధాన
మైన యీచోట నుపభోగ్యమయ్యె నేడు !

ఈపొదలం జరించుచు నహీనమహా
మహిమానుభావమౌ నేపురవీథులందో
చరియించుచునుంటి నటంచుఁ, పారతంత్ర్యా
పతితుండ నయ్యును పురామహదాంధ్రమునన్
స్వతంత్రుఁడౌ నేపురుషుండనో యనుచు నీభ్రమ
సత్యముగా తలంచుదున్ !

ఏపల్లవనృపాలు డెత్తిన బావుటా
చాళుక్యనృపుల రాజ్యంబునందు,
ఏ దేశికవిత పాలించిన కవిరాజు
నన్నయ్య వ్యాకరణంబునందు,
ఏయులిఁ జెక్కునే ర్పేలు మహాశిల్పి
గోదావరీనదీ ఘోషయందు,
ఏతొంటి తెలుగుల యెక్కువాచారమ్ము
బలవన్నృపుల ప్రాభవమ్మునందు
నమసిపోయెనో ఉన్నతసామజంబు
కొలను జొరబడి తమ్మితూడులను పెరికి

కానుకనై ధరాధిపులకాళ్ళకడం
బొరలాడి వాడిపోలేను, ధరాపరాగపటలీ
మలినమ్మగు ద్వారతోరణస్థానమునం
దురింబడగజాలను, దోసిటిపేరి ఘోరకారా
నరకమ్మునం దుసురు రాల్పగలేను
నిమేషరక్తికై.

తేనెలకోసమై కొదమతేటులదాటు లోనర్చు
నృత్యగీతానునయమ్ముగాని, మలయానిలుకౌగిట
బుల్లరించు సౌఖ్యానుభవమ్ముగాని,
తరుణారుణరాగకదుష్ణచుంబన శ్రీ
నవకమ్ముగాని, పరితృప్తి యొసంగదు
నాకొకింతయున్.

నీచవదాన్యవృత్తిమననేరని శూరత
మాతృదేశసేవాచరణమ్మునం
దసువు లర్పణనేసినవారిపార్థివశ్రీ
చెలువారుచోట, తదసృగ్రుచులన్ వికసించి,
వాసనల్ వీచుచు రాలిపోవగవలెం
దదుదాత్తసమాధిమృత్తికన్ !

వేదుల

## పృథివీ ప్రశంస

ఓ విశాలావనీ!
శోభాతిపావనీ!
ఆరంభపుణ్యక్షణముల నీశుఁడు విసరిన నాఁటి
నీయాదిసౌభాగ్య మెటుల వెల్గెనో ? భవదీయశాటి
యాకుపచ్చనియాకులో!
పండువెల్తురు రేకులో!
నిన్ను ప్రశ్నింపఁగాఁజాల, నీనాఁటి ప్రొద్దుటిపూఁట
గంభీరమై ప్రవహించె నీదుసౌందర్యంపుపాట,
ఓ విశాలావనీ !
శోభాతిపావనీ !

కాంతికల్లోలినీ!
వైభవశాలినీ!
నీతాసతీవేణి నడఁగి వాడిపోవనిపూవుఁ బోలి,
దినదినాపూర్వమై పొడుచు, తావకీనవిభాత కేళి
ప్రాభాతగానమ్ములా,
నీ యస్తమానమ్ములా,
ఏవి సుందరతరమ్ములోకో ? మెట్టి గీతాపరిమళము
ఆనందవీధి నాడించు నీహృదయసరోజదళము?
కాంతికల్లోలినీ !
వైభవశాలినీ !

ధవళయశోవతీ !
స్నిగ్ధతేజోవతీ !
పాఱెడుకాల్వలచెంత వీచెడుగాడ్పుల వినుచు,
నీ యుదాత్తలలాటరేఖ పులకలునూప కన్గొనుచు,
త్వత్కాయమానమ్ములై
శ్యామాయమానమ్ములై
దవ్వులనున్న వెదుళ్ళు కలిసి కంఠములెత్తి పాడ
తల్లి, నీయొడిలోన నడగి యల్లరిలేక విన్నాఁడ !
ధవళయశోవతీ !
స్నిగ్ధతేజోవతీ !

హే నవమోహినీ !
హే దయావాహినీ !
చూడ సుందరములై యడరు నాశృంఖలమ్ములఁ ద్రెంచి,
నా మేలివాకిళ్ళ దాఁటి, విందు నీ మధురవిపంచి,
బంగారుతోరమ్ములన్,
నా రత్నహారమ్ములన్
గైకొని, నా కిమ్ము జనని నీ మృత్తికారేణుకణము,
శాద్వలశ్యామలవీథి వికసించు పచ్చప్రాంగణము!
హే నవమోహినీ !
హే దయావాహినీ !

అబ్బూరి

## భవిష్యద్దర్శనము

సంధె ముత్తైదువసరిగవలిపంబు
వరివెన్నుపాపలు పట్టి లాగంగ,
వాత్సల్యమునఁ బైకి వంగెనో యనఁగ
జెంగావినిగ్గులు చేలపై నలమె;

ఈ రామణీయక మీక్షించి యింటఁ
గాలు నిలువక యూరికడపట నున్న
పొలమున విహరింపఁబోతి నొంటరిగ,
చిన్నతిన్నగ వీచు తెమ్మెరలవలన
వెన్నులు బంగారువీచులై రేఁగెఁ!

గాంతియు గానంబుఁ గలసి యనూహ్య
మగు నింద్రియవిషయమై కానిపించె;
అచ్చోట నానంద మనుభవించుచును
నొక్కింత కూర్చుండియుంటి నిశ్చలత;

అంతలోఁ గెంజాయ లంతరింపంగఁ
గప్పెను బ్రకృతి నక్షత్రసంఖచిత
కోమలతిమిరావగుంఠనాంబరము;
గాలి వీచుట మానెఁ, గదల వాకులును;

అమ్మపే రెదనాడి యలసి కనుమోడ్చు
పసికూనలటు సరోవరమధ్యమందు
నిశ్చలశాంతిమై నిదురించు నలలు;
గాంభీర్యమును దాల్చె గగనతలంబు;

సగము జాగ్రదవస్థ, సగము స్వప్నమున
భావించుచును నెట్టుపైనఁ గూర్చుంటి;
సత్యమో, భ్రాంతియో, స్వప్నంబొ కాని
యింద్రజాలము వోలె నెదుటఁ గన్పట్టె!

నది సత్యమైయున్న నాశ్చర్యకరము!
అది కలయేయైన నానందమయము!

*　　　*　　　*

మావితోఁటను బర్ణమండపమందు
జనరంజకంబైన సభ యొండు జరిగె
మొగిలిరేకులు, తమ్మిపూఁదోరణంబు,
లందంబు నెత్తావి నర్పించుచుండె;

రారాజు క్రొంబచ్చతాగద్దె డిగ్గి
యందఱితో బాటు యవనిఁ గూర్చుండెఁ;
బనిపాటు లేనట్టి బంటుసిపాయి
త్రుప్పుపట్టినకత్తి తుంటిపై రాయఁ
దన పూర్వజయములఁ దలపోయుచుండె;
బురదచిట్టలుపడ్డ పుట్టములఁ గాఁపు
వర్తించె నృపపరివారంబుఁ గలసి;

కూలి నాలి యొనర్చి కుడుచు నిరుపేద
యజమానిసరిబంతి నాసీనుఁ డయ్యె;
సకలమానవజాతిసంతతులు కుల
వర్ణ భేదంబులఁ బాటింపఁబోక
యొక్క కడుపునఁ బుట్టి, యొకచన్నుఁ బాలు
ద్రావినరీతి, సౌందర్యంబు గలిగి
యన్యోన్యసాహాయ్య మర్థించువారు!

స్ఫటికపాత్రంబున శాంత్యాసవంబు
ధర్మదేవత తెచ్చి తనిపె నందఱిని!
ఏకకుటుంబమై యీప్రపంచంబు,
స్వర్గంబు భూమిపై స్థాపింపఁబడియె;
అభ్యుదయాంశువు లన్ని మూలలను
నవనవోజ్జ్వలజీవనంపుదీపముల
వెలిగించుచుండె; నీ విశ్వమంతయును
మానవకల్యాణమందిరం బయ్యె!

అంతలో లౌకికయాథార్థ్యములను
భావంబు వ్రాలెను బక్షివిధాన,
బొగ్గు కంబములట్లు పొడకట్టుచుండెఁ
దత్ప్రాంతములనున్న తాళవృక్షములు,
చిమ్మచీఁకటి నోంటిఁ జిక్కుకొనియుంటి!

రామిరెడ్డి

## ఆ తి థ్య ము

ఆఁగు, మాఁగుము తెరువరీ, ఆ
యానఖేదము నవనయింపుము,
మా గృహాంగణకుసుమసముదయ
మధువు లియ్యవిగో!

నీరజా ప్తనిశాతకిరణో
న్మీలితములై పరిమళించెడు
వారిరుహములఁ గుమ్మరిలిన తు
షార మియ్యదియే!

మావిపూగుచ్ఛముల ననశ్ర
న్త్తమధుపచయమ్ము లాడఁగఁ
బ్రోవువడిన పరాగమ్మృదుల వి
భూతి యియ్యదిగో!

తూరుపున సిందూరరాగము
దాలుక, తొయ్యలు లేరి తెచ్చిన
పారిజాత ప్రసవమాలా
బహుళ మియ్యదియే!

ఆఁగు, మాఁగుము తెరువరీ, ఆ
యాసఖేదము నపనయింపుము,
మా గృహాంగణకుసుమనముదయ
మధువు లియ్యావిగో!

సుబ్బయ్య

## సాధుగీతి

లతాంతార్ద్రరాగమ్ములన్ బాడు తేఁటుల్
వసంతమ్ముకాంతిప్రవాహమ్ములందున్
నిసర్గాప్తశోభావినీతిన్ బ్రియమ్మై
కను ల్గుట్టు చందాన కాన్పించుఁ బూవుల్
కనుంగొన్నచో, వేఁడికన్నీళ్లురాలున్,
అలంకారముల్లేని ఆపూలముగ్ధో
క్తులన్ లీనమైపోయెదో సాధుగీతీ!

కవిప్రేమ పుష్పింపగాఁజేయు కృష్ణా
స్రవంతీతరంగాంతరంగంబులందున్
హతస్వాంతమై, దీనమై, తీరభూమిన్
వెత ల్విప్పి వాపోవవీక్షించు కన్యా

మణిశోకమూర్తిశ్రమ ల్గన్న రాగా
రుణప్తైన చింతాఝురుల్ వారు నార్తన్!
అలంకారముల్లేని ఆకన్నకీతా
ర్థులన్ లీనమైపోయెదో సాధుగీతీ!

అబ్బూరి

## ఎవరు?

ఎవరో వారో, ఈ నిశీథి
నెగసి, నీడవోలె నిలిచి
పిలుతు రెవరో, మూగకనులు
మోయలేని చూపులతో
ఎవరో వారో!
ఎవరో వారో!
ఇవుడా వను బలుకరింతురు!
మ్రోయలేని నీరవగళ
మున జలించు కోరికతో
ఇవుడా వను బలుకరింతురు!

ఎవరని ఈరేయి నిదుర
హృదయ మదర, వేయి జేయి
చాయలాడ పెనుచీకటి

సైగలతో నాకన్నుల
రక్తముఠల లాగికొందురు!

ఎవరో, నాహృదయనాళ
మేలా తునియలుగా నా
నిర్జీవపుజీవితమ్ము
నిట వదలుదురా!
ఎవరోవారో!
ఎవరోవారో!
ఇపుడా నను పలుకరింతురు?

కృష్ణశాస్త్రి

## పె న్ని ధి

ప్రేమ పెన్నిధి, గాని యింటను
నేర్ప రీకళ, ఒజ్జ లెవ్వరు
లేరు, శాస్త్రము లిందుగూరిచి
తాల్చె మౌనము, నేను నేర్చితి
భాగ్యవశమున కవులకృప గని;
హృదయ మెల్లను నించినాడను
ప్రేమ యను రతనాల,
సొమ్ము !
తొడవులుగ నవి మేన దాల్చుట
యెటుల నంటివో,
తాల్చి తదె, నా
కంట చూడుము ! సతులసౌ రను
కమలవనముకు పతులప్రేమయె
వేవెలుగు !
ప్రేమ కలుగక బ్రతుకు
చీకటి!

గురజాడ

## ప్రేమ తత్త్వము

ఎద మెత్తనౌటకై
సొద గుందరా, అంత
మదిగల అహమ్మెల్ల
వదలి పోవునురా!

వల పెరుంగక బ్రతికి
కులికి మురిసేకంటె,
వలచి విఫలమ్మొంది
విలపింప మేలురా!

చెలివలపులేని నీ
కలిమి కాల్పనె! వినుము,
వలపుతీగనె జీవ
ఫలము కాయునురా!

ప్రేమకంటే ఎక్కు
వేముందిరా, ఎల్ల
కామ్యపదవులకన్న
ప్రేమె యెక్కువరా!

ప్రేమించు సుఖముకై!
ప్రేమించు ముక్తికై!
ప్రేమించు ప్రేమకై!
ఏ మింక వలెనురా?

ఎద మెత్తనౌటకై
సొద గుందరా, అంత
మదిగల అహ మెల్ల
వదలిపోవునురా!

బసవరాజు

## ప్రేమకొఱకు

చెట్టునకు మొగ్గదొడిగెడుచేష్ట గలదు
కోరకమునకు వికసించుగుణము గలదు
విరికి వలపుల వెదజల్లువిద్య గలదు,
దేనికొఱ కిది యంతయు దేనికొఱకు?
ప్రేమకొఱకుఁ బ్రేమకొఱకుఁ బ్రేమకొఱకు!

కోకిలం బూరకయు పాడుకొనుచునుండె
స్వరలహరిలోన నమృతంబు గురియుచుండె
నమృతరస మెంతొ మాధుర్య మగుచునుండె,
నెందుకొఱ కిది యంతయు నెందుకొఱకు?
ప్రేమకొఱకుఁ బ్రేమకొఱకుఁ బ్రేమకొఱకు!

హృదయపదమున నెల యుదయించు టేమి ?
కలశవారాశి మిన్నంటి తొలఁకుటేమి ?
మెఱపుఁదీగలు మిలమిల మెఱయు టేమి ?
దేనికొఱ కిది యంతయు దేనికొఱకు ?
ప్రేమకొఱకుఁ బ్రేమకొఱకుఁ బ్రేమకొఱకు !

ఇనకరంబులలో వేడి యెందుకొఱకు ?
ఇందుకిరణంబులను జల్వ యెందుకొఱకు ?
ఋతుసంతానమున మిన్ను లెందుకొఱకు ?
ప్రేమకొఱకుఁ బ్రేమకొఱకుఁ బ్రేమకొఱకు !

ఎఱుఁగఁబడకున్న యీకూర్పు లెందుకొఱకు ?
తెలియఁబడకున్న యీమార్పు లెందుకొఱకు ?
విశదపడకున్న యీనుడు ల్వేనికొఱకు ?
ప్రేమకొఱకుఁ బ్రేమకొఱకుఁ బ్రేమకొఱకు !

ఈసుఖంబును గష్టంబు నెందుకొఱకు ?
ఈభవంబును నాశంబు నెందుకొఱకు ?
ఈజగంబున నిన్నియు నెందుకొఱకు ?
ప్రేమకొఱకుఁ బ్రేమకొఱకుఁ బ్రేమకొఱకు !

వేంకట పార్వతీశ్వరులు

## సన్యాసి

మొగలిరేకుల మృదుల కపోలయుగము
కరకు టెండలవేడిమి కందువారె,
తెలిమొగిలుచాటు నెలవంక తెరగు బూని
బూదిబూసిన నీమోముమురువు కరిగె,

కన్నెపూబోణిగాటంపుగాగిలింత
నవసి వసివాడు నీమేనిచివురు నేడు
కఠినహృదయమ్ములేనియు గరగిపోవ,
కటికి రానేల గదుములు గట్టె నకట!

కావిపుట్టము కటిసీమ గట్టు భాగ్య
భోగ్యరాహిత్యమైన వైరాగ్యమునకు,
జాజిపూసౌరభమ్ములు జల్లువిరియు
జవ్వనమ్మున, కెంతటిదవ్వు గలదు?

దివ్యకుసుమాంగి యీనెలుదీసి యిచ్చు
లేదములపాకుమడుపులు కాదటంచు,
హారిణశాబమ్ములకు తృణాంకురము లిడగ
మనసుపుట్టెనె? ఎంత యమాయికుడవు!

మధురదరహాసచంద్రికాసుధ తొరంగు
కామినీస్నిగ్ధగండభాగమ్ము లాను
కప్పూరపుకమ్మతావుల కావిమోవి
బీటువడ, నీకు వైరాగ్యవృత్తి యేల?

అల్లనల్లన దరిజేరి, అలతిసిగ్గు
జాలిచూపుల క్రేగంట మేళవించి,
మధురమందస్వనంబుల మాటలాడు
ప్రణయనీబాంధవం బెట్లు బాసినావు?

సర్వము పరిత్యజింపగ జనును గాక,
పూవజవరాలిపొలయల్లబాపు నాటి
ప్రణయభావమ్ము స్మరణకు రాక గడవ
జనునె నీకు, దీర్ఘనిశీథసమయములను?

నవ్వెద వదేల? నామాట నమ్మి, నీదు
నెలతకడ కేగి, తప్పు మన్నింపు మనుము,
కరకురుద్రాక్షమాలలకంఠసీమ
కమ్మనంపగిదండలు గౌగిలింప!

కొడాలి

రంభ

మాట్లాడకుండా పూరుకున్న శుకుణ్ణి
రెచ్చకొడదా మనుకొంది

కోమలమందహాసవినిగూహాన
చారుకపోలకామినీచ్ఛాయమతి
లోకమంతటను సర్వుడు కాని, యౌకం
డపేతవాంఛామతిఁ దన్ దలంచుకొనసాగి
నదా అనుభూతిలోభిన్నయై యేమి గడించు?
లోక మెలయించిన నేమిఫలం బయ్యా
ఋషీ!

దేహమనంగ కోర్కులు జతించినగూడు,
నిరాశమన్ భ్రమోత్సాహములో నెఱుంగకయ
దాగిన రోగముగా దపోబహువ్రీహిభుజిక్రియన్
తిరుగబెట్టుసు, పెట్టునయే న్మహౌషధుల్
దోహదముల్ వ్యపేతధృతితోఁ బనిసేయువయ్యా,
తపస్వికా!

భావము లేల చంపుటకు పాల్పడె
దీప్రతిచంపువెంట హత్యావధి చేరుచున్నదికదా, మరి
మీరలు మానుషై యహింసావిధియాత్రులుంగద,

ప్రశస్తులు, వర్ణి! త్వదీయమహాతపస్స్వవధిలో
లయాంతశిఖ చిట్టెముకట్టెడు లోకముల్,
మునీ!

మానిశలాక! వెన్క నొకమారు తృతీయుఁడు
తాతతాతతో పూనినవైరి గాధిజుని
మొగ్గలకన్నులు మొగ్గలట్లు మామేనకసిగ్గులన్
చిలికి మిాగడచూపులు చూరలాడె, మిా మానుల
రెప్పక్రింది కనుమాయలగోప్యము లేదు
మాయెడన్!

తను వొకచోటనుండియు సదాగతియుక్తుడ,
వంతరాన లోచనములు మూసియున్ నిఖిలసాక్షివి,
పల్లకయున్ సమస్తభావనిలయబుద్ధి,
వీనియమభావనలో సహజస్వయంప్రకారణ
మొనగూడియున్నయదిరా
యతిలోకశిరోమణీఘృణీ!

ఒకరు డరుంధతీసతివయోవిభవం బఖిలంబు
చూరపుచ్చకయ పతివ్రతాగ్రసరచండిమ
గుత్తగొనెన్, మరొక్క డొడకు తెరచాపనీడలకడన్
బెదరెన్ చలిగాలివెచ్చ, తావకపితరుల్
మునీ! మెఱుగువచ్చినరాతివి నీవు
వారిలో!

మసలకయుందు వేమి ? యొకమారు కదల్చుము
లోనియూహ, మేల్మసకవుపాముగా మలకలై
దుసికింతలు వోవ చూడు, మానసమును దాటి
యాత్మ యనినారదె! ఆస్రమయీమనస్సు నూగిసలన
కల్గునా ? తెలివికిన్ తలదాటినదా
కృతవ్రతా!

లాంగనియల్లె నాపలుకులోపలి చక్కెరపాలు
గ్రుక్కిళుల్ మ్రింగెదువో బెడంగుకనురెప్పల
సంపెగపచ్చిరేకు లాలింగనమున్ పొనర్చుకొను
లేకనుదమ్ముల తేటికూటమిన్ పొంగిన తేనెలో
నాలికిపోయిన యీ వల
పంటునో మునీ ?

తూర్పులో తెల్లరేకలు తోచినై. ప్రక్కని రావిచెట్టు
ఆకుల్లో ప్రాతర్మందానిలాలు కిలకిలా నవ్వినై

విశ్వనాథ

## పూ ల బా స లు

పూలబాసలు తెలుసు యెంకికీ
తోట
పూలమనసులు తెలుసు యెంకికీ!

పూలమొక్కల నీటి
జాలు గని నిలుసుండి
పూ లన్ని నీపాలె
ఆలించె నంటాది,
పూలబాసలు తెలుసు యెంకికీ
తోట
పూలమనసులు తెలుసు యెంకికీ!

పూలంటు కాలంటి
ఫున్నె ముం దంటాది
వగ్గలమారీపడుసు
నగ దోడిగె నంటాది,
పూలబాసలు తెలుసు యెంకికీ
తోట
పూలమనసులు తెలుసు యెంకికీ!

తెరలెత్తి పూపడవ
పరిగెత్తుతావుంటె
దారెంట పూ లొంగి
దణ్ణమిడె నంటాది
        పూలబానలు తెలుసు యెంకికీ
                                        తోట
        పూలమనసులు తెలుసు యెంకికీ !

పూలతో వియ్యాలు
పూలల్లొ కయ్యాలు !
మానల్లె న న్నుంచి
తానె పూ వౌనేమొ !
        పూలబానలు తెలుసు యెంకికీ
                                        తోట
        పూలమనసులు తెలుసు యెంకికీ !

నండూరి

## పి లు పు

రావోయి సిన్నవాడా!
మావాడ,
రావోయి సిన్నవాడా!
పోటూపాటులఏరు
పొంగి పొర్లేసోట
రావోయి సిన్నవాడా!
మావాడ,
రావోయి సిన్నవాడా!

ఎన్నెలవెలుగుల్లోన
ఏటీనురగల్లోన
తెల్లనితెరసా  పెత్తి
తీయనిగొంతు కెత్తి!
రావోయి సిన్నవాడా!
మావాడ,
రావోయి సిన్నవాడా!

వాలూచూపుల చూస్తు
కోలేస్తు నే వుంటె
ఎండేతళుకుల సేవ
ఏటిలో వల వేతుగాని
రావోయి సిన్నవాడా!
మావాడ,
రావోయి సిన్నవాడా!

ఉబికే వాగుల్లోకి
ఉయ్యాల లూగుతు పోయి
సందరాన పుట్టేటి
సెందురూని సేరుకొందం
రావోయి సిన్నవాడా!
మావాడ,
రావోయి సిన్నవాడా!

బాపిరాజు

## కాపుపాట

ప్రేయసి ! లేచిరమ్ము, చివురించినమావుల క్రింద
శీతలచ్ఛాయలలోన యౌవనవసంత
శుభోదయ మయ్యె, నవ్వుచున్ చేయికిఁ జేయిఁ జేర్చి
పెఱచింతనలన్ మఱపించు రాగముల్ దీయుచు
వాసన ల్పరిమళించెడుచోటులయందు
బోవగన్ !

వ్రాలినసంజల న్మరలివచ్చెడుగోవుల
బాలుతీయఁగాఁదోలెడుదాక, త్రాడులును దుత్తలు
నావలఁ బెట్టి, సిగ్గులన్ బోలెడు చిన్నదాన!
యెటుచూచిన నెవ్వరు లేనిచోట నుయ్యాలల
నెక్కి యూఁగ మననయ్యెడు నీవును నేను
వేడుకన్ !

పాడుట కొప్పవేని పడవ ల్నడిపించెదు
నేటిత్రోవలే చూడఁగవద్దు, లేఁతమనసుల్
తడిసేసెడు చెట్లచాలునన్ గూడినమేను లానుకొన
కొమ్మల కాకులవోలె నొక్కమాటాడక
కూరుచుండ, మనువైనపొలమ్ముల
గట్టునీడలన్ !

అబ్బూరి

ఓ యీ!

నిన్నె కోరుదు నోయి! యితరుల
నెన్న డెరుగనిదాన నోయీ!
నాడు నే డేనాటికిని నీ
దాననే నోయీ!

మనసు నా కేకాంత మోయీ!
బ్రతుకు నాకు ప్రశాంత మోయీ!
అంద మాముదదీప మోయీ!
వలపె నే నోయీ!

సొగసుపువ్వులు సోలు ముద్దులు
వలపుపన్నీరులతుషారము
వెలుగు తేటలపసిడినవ్వులు
కాన్క నీ కోయీ!

రామచంద్ర అప్పారావు

## ప్రియుడా!

వచ్చి లాలించేటి ప్రియుడా!
నన్ను
మచ్చికల నలరించు ప్రియుడా!
హెచ్చయినప్రేమసుధ లిచ్చి
నన్ను
వగల మరపించేటి ప్రియుడా!

భవ మెంతో భారమై పరుగులెత్తేవేళ
శీర్ణమై నాగుండె శిథిలమయ్యేవేళ
కన్నుగవలో నొక్క కాంతిపుంజము దాల్చి
చిన్నినవ్వులు మోముపై చిందులాడగా
ప్రేమతో మనసిచ్చి ప్రీతితో నను దేర్చి
రమ్యమధురాలాపరసము నాపై చిల్కి
నడకలో నొకవింతనాట్య మాడుచునుండ,

పలుకులో నొకతీపి పలుకరించుచునుండ
ఇరులు నీనవ్వుతో విరిసిపోవగజేసి
మాటిమాటికి నాలో మమత పెంపొందించి
వచ్చి లాలించేటి...

విశ్వసుందరమ్మ

## అడవిపిల్ల

నిండుప్రాయమ్మునకు తోడునీడయైన
సిగ్గుసింగార మెరుగని చెలియ, నీదు
ముగుదచూపులు మాపూర్వపుణ్యమునను
అడవితొలకరిపూవులయట్లు దొరికె!

ముళ్ళపూదీవగుంపులచాళ్ళనుండి
కన్నెగాడుపు వీచిన కదలు నీదు
వెన్నెలయిగుళ్ళపయ్యెదవెలితినుండి
జవ్వనపునీడ లారిన చాలు మాకు!

సడియు చప్పుడు లేని యీయడవికోన
అలతిసెలయేటిసోనలయాలలకు లయలు
తెలియజెప్పు నీరాగాలతీయదనము
వలన పూలకారుపవళ్ళు పులకరించు!

ఈమలయపవనమ్ములు ఈమనోజ్ఞ
యామినులు నీవనుభవింప నావిరించి
తెరవ, నీకొక్కతెకు ప్రసాదించెనేమొ
వలపువలవంతలెరుగని పడుచుదనము!

వింటిబద్దల అంబులు విడుచు నీదు
సులువునేర్పులలోని నాజూకుదనము
అలరువిలుకాని కేనియు దెలియరామి
బ్రదికిపోయిరి తబిసిజవ్వనులు నిజము!

కొడాలి

## కో కి ల

ఈమావిపైనుండి
ఈవు కూ కూ యంచు,
ఆమావిపైనుండి
ఆపె కూ కూ యంచు
ఏమిబాసల జేతురే,
కోకిలా!
ఏమిబాసల జేతురే!

ప్రకృతిజన్యంబులై,
పరమరమ్యంబులౌ
భావముల, నొండొరుల
ప్రణయ మొలికెడునట్లు
పల్లవించుచునుంటిరే,
కోకిలా!
పల్లవించుచునుంటిరే?

మనుజుల కగమ్యమై
మహితశక్తిం గల్గి
పరమామృతము లొల్కు
ప్రణయవాక్కుల మీరు
బాస లాడుచు నుంటిరే,
కోకిలా!
బాస లాడుచు నుంటిరే?

పరులు విన్నను మీదు
పరువు పోవు నటంచు
పాడులోకము జూచి
భయమె లేకను వలపు
పలుకు లాడగ జెల్లునే,
కోకిలా!
పలుకు లాడగ జెల్లునే?

పరమప్రేమస్వరూ
పంబులై లోకాల
పావనంబుల జేయు
ప్రణయకవులౌ మీకు
పరు లనేవా రుందురే,
కోకిలా!
పరు లనేవా రుందురే?

చెలియయును నీవలెనె
చివురుటాకుల మెక్కి
చెవులపండువుగాఁగ
చిలుకంగ గానమ్ము
చింత నీ కేమున్నదే,
కోకిలా!
చింత నీ కేమున్నదే?

చెంత గూర్చుని మోము
చెలువు గుల్కగ వలపు
దెలుపుచుం బలుకంగ
చెలి చెంతలేని నా
చింత లెన్నడు తీరునే,
కోకిలా!
చింత లెన్నడు తీరునే?

పాడవే కోకిలా!
పాడవే యింపుగా!
ప్రాణముల్ హాయిచే
పరవశ మ్మొందగా!
పాటపాడవె తీయగా,
కోకిలా!
పాటపాడవె తీయగా!

బసవరాజు

## స్నేహరుచి

అరమరలేని మన చిరతరస్నేహరుచుల్
కురిసిన వెన్నెలలా, అరవిరిసిన మల్లియలా!

మనమున నెవ్వగలా మాసెను
ఘనమగు నెయ్యములో,
మెరపులగుంపేమో, అది
తరుగని వెలుగేమో!

దినములు నిముసములై చనియెను
తిన్నని నడకలతో,
కన్నులతళుకేమో, అది
ఎన్నికదినముల
పున్నెపుప్రోవో!

జీవితమున కంతా అది
చెలువపు నిగ్గేమో,
పరమప్రేమకు చిహ్నమైన తెలి
వెన్నెలకాంతుల
సన్నపుతళుకేమో!

విశ్వసుందరమ్మ

ఓ స ఖీ!

పదునాల్గుభువనాలు పరిసుప్తి నుండంగ
మనము మేల్కనియుంట మఱచిపోతె?
నీకంటికొలికి నొక నీటిబిందువు నిల్చి
ఖేదమో మోదమో
భేదపఱుపరాని నిశ్చలశోభ
మాననీయం బయ్యె,

చక్షుఁగలవారి కంధంపురాత్రి
మనపట్టుమాత్ర మపు డనుకోని పట్టపగ లనిపించె
దాని నీ కపుడె తెలుప నాత్మ నెంచితి;
కాని, యశ్రుకణము ముందు దుడిచి
వెనుక ముచ్చటింపఁగఁబోతి,
నీవు మంద స్మితస్విన్నవైతి,
కనులు మెఱసెను,
కప్పె గాఢాంధకార మెద;
ఓ సుముఖి! ఓ సఖి!

కవికొండల

# శుక్రవారము

ప్రేమమధుపూర్ణమైన నాహృదయపాత్ర
నీదినము నీపెదవుల కందింతు ననెడు
నాసలోఁ గన్ను విచ్చితి నమృతసరసి
బ్రాతరున్మిషితమ్మైన పద్మమట్లు,

ఆ త్రిలోకైకజననిపాదాబ్జసవిధ
భూమి మీలితనేత్రవై మోకరిల్లి
నీవు పూజాసుమమ్మ వైనావు,

హృదయ
కర్త్రికామూలమున భక్తి కందళించి
అడరు పారవశ్యమ్మున తొడిమ యూడి
నేను పూవునై పడితిని నీదుచెంత

జంటపూవులయమృతనిశ్వాససౌర
భముల రోదసి శుక్రవారము ధ్వనించె!

నాయని

*

అపుడు నిల్చితి నోయి! నా ప్రియు
రాలికాంతమనోజ్ఞరూపము
తనివిదీరగ జూచు తలపున
స్తంభసవిధమునన్

అహాహా వికసనమొందె నోయీ!
అపుడు నా కనుదోయి లక్ష్మీ
తిలకపాటల ఫాలమండల
దీప్తిజాలమునన్

నాట్యమాడిన దోయి! మామక
నయనయుగళం బపుడు లక్ష్మీ
కర్ణపూరోద్దీప్తమంజుల
గండభాగములన్

చిరము నేత్రద్వయి విహారము
చేయసాగిన దోయి! లక్ష్మీ
కలితకాంచనహారవిలస
త్కంఠదేశమునన్

గాఢరాగోద్రిక్తమతినై
కన్నుగవతో ముద్దులాడితి
కటకకంకణరుచిరలక్ష్మీ
కరసరోజములన్

ఏమి చెప్పుదు సఖుడ, నా హృద
యేశ్వరీమృదుపాదయుగళికి
సాటివచ్చునో! రావో యించుక
స్థలజలేజములే!

తన్మయంబై మామకాక్షి
ద్వయము బంగరుబొమ్మ తొడిగిన
పట్టురైకను విడువదాయెను
ప్రాణమిత్రంబా!

తెల్పనేరగదోయి! లక్ష్మీ
దేవి లోచనరోచి పల్లుల
కేవలం బానేత్రయుగళికి
క్రీతదాసుండన్!

శివశంకర శాస్త్రి

# స్నే హ బం ధ ము

ముసుగు తీయక, లోకంపుగుసగుసలకు
శిరసు వాల్చక, వలిగాలితెరలలోన
మొలకనవ్వుతో, కలలతో, వలపుబరువు
తావిపిలుపుతో నిత్యమ్ము స్వాగతమ్ము
లాలపించెడి లేతగులాబికన్నె!

నాకొరకె వేచి, వరియించి నన్నె, ఆమె
ముద్దు లిచ్చును, చుక్కలమోవికాంతి
దారిలో కౌగిలించును, తలపుశాంతి
తరలు నిశ్శబ్దరేఖలో తాండవించు
నన్ను కూడి నానీడ వెన్నాడుకొనుచు!

కంట నీర్వెట్టు, మోదాశ్రుకణము లనును
వంతకే చోటులే దను, సృష్టిచూపు,
కౌగిలింతసోలింతలో కన్ను మోడ్చు,
క్రూరహేమంతశర్వరీకుంతలముల,
లోలమఘమాసచంద్రికాలోచనముల
కురియు ముద్దిదే! యను, కన్ను లరగ మోడ్చు,

మరచి మరపించి, జాలిలో, మమతలో వి
లాసనుస్థాయి నెదపువ్వు వ్రాల్చివేయు,
నాగులాబి! నాపువ్వుకొమ్మ!!

రామచంద్ర అప్పారావు

## ప్ర ణ య శాం తి

రాలిపడియున్న దానిమ్మపూలతేకు
లొాలయుచోటుల సాంధ్యవాయువులలోన
కనబడనిభావములనువాసనలకొఱకు
వినయమున బాల్యదృష్టి నిల్పితి నొకింత,
ప్రణయవతి! ప్రేమమునకు పారమ్ము లేదు!

నీవు పాడిన కృష్ణవేణీ స్తవమ్ము
హృదయపదమున నొక సెలయేఱువోలె
చల్లనగు తుంపురులు వెదఁజల్లువేళ
పలుకరానిగీతిక కలకలమొనర్చు
ప్రణయవతి! ప్రేమశాంతికే భంగ మగునా!

అబ్బూరి

*

కొండ తిరిగీ, కోన తిరిగీ
చీరచెరగున కూరిచితిరా
గరికెపూల
కంఠమాల!

ఆవు నడిగీ, అడివి నడిచీ
పూలగిన్నెల పొందుపరిచితి
గుమ్మపాలు
కొమ్మతేనె!

చాయవెన్నెలా లోయబయలా
పచ్చికమెత్తల పానుపుపైనా
'కో' 'కో' యందు
'కో' యనరా!

నండూరి

ఆ మె క న్ను లు

ఆమెకన్నులలో ననంతాంబరంపు
నీలినీడలు కలవు;

వినిర్మలాంబు
పూరగంభీరశాంతకాసారచిత్ర
హృదయములలోని గాటంపునిదురచాయ
లందు నెడనెడ గ్రమ్ము;

సంధ్యావసాన
సమయమున నీపపాదపశాఖికాగ్ర
పత్రకుటిలమార్గములలోపల వసించు
ఇరులగుసగుసల్ వానిలో నిపుడు నపుడు
వినబడుచునుండు;

మరికొన్ని వేళలందు
వానకారుమబ్బుల మెయివన్నె వెనుక
దాగు బాష్పమ్ము లామెనేత్రములలోన
బొంచుచుండును;

ఏదియో అపూర్వమధుర
రక్తి స్ఫురియించుకాని అర్థముకాని
భావగీతమ్ము లవి...

కృష్ణశాస్త్రి

## ఆమనినిషా

జాగ్రత్త! జాగ్రత్త! మాయజగత్తని
శాస్త్రము లెల్లను విప్పెదవు;
భాగ్యము భోగము చంచలమంచును
వైరాగిధర్మముఁ జెప్పెదవు;

ఎవ్వారు విందు రీపిచ్చిబోధనము
లీమధుమాననిశీథమున?
ద్రాక్షరసాయనపాత్రిక పెదవులఁ
దవుల దలంతురె చేదనుచు?

ఓయి, యతీశ్వర, చాలిఁక బోధన
మూరక తెల్పకు నీమతము!
ఆనందభాండమునందు, హాలాహల
మయ్యయ్యో! విరసుఁడ, కలుపకుము!

ఉన్మత్తకోకిల గానము సల్పెడి
నుద్యానవాటిక మధురముగ!
పొడవాటిలొద్దుగకొమ్మల నూఁగెడిఁ
బున్నమచందురుఁ డుయ్యేలలు!

ఆమనిమత్తున చైతన్యలోకము
ఆనందపరవశమై సాగియు;
సరిచేయు మో సఖి! భగ్నవిపంచిక
సంధ్యలు పాటలఁ బుచ్చెదము!

సౌఖ్యనదీరసపూరమునం దంచ
జంటవిధంబున నీదుదము!

రా మి రె డ్డి

ము ం దు గ తి

ఎక్కవే! కొండ నెక్కవే!
నా సక్కనెంకీ! యెక్కవే!
కొండ నెక్కవే!

పక్కసూపులు మాని
పయి కెల్లిపోదాము!
ఎక్కవే! కొండ నెక్కవే
నా సక్కనెంకీ! యెక్కవే!
కొండ నెక్కవే!

ముందు నువ్వుంటే నే
కిందా నిలబడగలను,
నీనీడనే తొక్కు
కోని సులువుగ రాగల
నెక్కవే! కొండ నెక్కవే!
నా సక్కనెంకీ! యెక్కవే!
కొండ నెక్కవే!

తెల్లన్ని నీపైట
సల్లంగ యిసురోలె!
ఆగాలి నాకాలి కట్టే
బగబగ మండు
నెక్కవే! కొండ నెక్కవే!
నా సక్కనెంకీ! యెక్కవే!
కొండ నెక్కవే!

పదిమెట్లు పయికెల్లి
పల్లకుండా సూడు,
పగబట్టు పాముల్లె
పయికి సర్రున వత్తు,
నెక్కవే! కొండ నెక్కవే!
నా సక్కనెంకీ! యెక్కవే!
కొండ నెక్కవే!

నందూరి

# రా ధ

పవనపులకితచంద్రాతపప్రఫుల్ల
చారుశారదయామినీసమయమందు
వీథివీథుల మధురలో వెదకి వెదకి
చేరుకొంటి బృందావనసీమ నేఁడు,

దూరముననుండి నీ మురళీరవమ్ము
హృదయమున సోకినంత మే నెల్ల మఱచి
తిరుగుచుంటిని యమునానదీవిశాల
పులినసీమల వెఱ్ఱినై పోయి నేను !

రవికరోద్దీప్తహిమశీకరమ్ముపోలె
రమ్యపింఛము చిత్రవర్ణముల దొలుక
శిరము నూపుచు మోవిపై మురళి నూని
ఏది , మఱియొకమాఱు వాయింపవోయి !

పవనవీచికలందలి పరిమళమ్ము
మధురచంద్రాతపములోని మార్దవమ్ము
మంజుకుసుమామృతములోని మధురిమమ్ము
కలదు గోపాల, నీ వేణుగానమందు !

ప్రకృతి పులకింప యమునా స్రవంతి పొంగ
రాగవల్లిక చిగురింప, ప్రణయగీతి
పాడి నను గౌగిలించి గోపాలకృష్ణ,
ప్రేమదీరగ నొకముద్దు పెట్టుకొనుము!

వేదుల

వాల్జడ

కలకల లాడు వాలుజడకై జగ మెంత
తప స్సొనర్చెనో చెలియ, భుజాన వ్రాలి
కుచసీమ నటించుచు, ఏటిదాటుతో
తొడనునువంపులోవ బడి తూలుచు,
మల్లెల పాలనవ్వు కాంతుల శ్రుతిగా
సువాసనల దొర్లును కోటి వసంతశ్రీలతోన్!

జారినవాలుతో విరులజాలుల తావులతో,
నెడందలో నూరు విముగ్ధమోహానవయోరుచి
వెల్లువ సేసి సొక్కుచున్,
నీరధిపై స్ఫురించు రజనీకరబింబముపోలె

జాలి నన్నో రమణీ, ధరింపు మిక
నొక్కులపాయలలో గులాబిగాన్ !

జీవిత మాటగా సొగసుచిన్నెలపాటగ నవ్వి,
ఒక్కటన్ దేవి, భవచ్ఛిరోజముల నించుక
ముద్దిడనిమ్ము! చూపులన్ సేవలజేయనిమ్ము!
హృది జేరిచి సోలగనిమ్ము, దివ్యకాం
త్యావిలసుందరోజ్జ్వలరహోనిశలన్
జపియించుకొందు నే!

ఎరుగనికోర్కెల నెన్నో
స్ఫురియించుచు సొగసుదప్పి పూరించెడి నీ
తరగలవాల్జడముసుగున
నొరుగుదు లోకంపుదృష్టినుండి ప్రశాంతిన్ !

రామచంద్ర అప్పారావు

## ఆమె పాట

నునుమబ్బు లేదున్కకొనలపై సోనలా
నెలవంక చిరునవ్వు చలువపాట,
తొలిప్రొద్దు పొడుపురేకులపైడిదారుల
ఏరులా మంచుకన్నీరుపాట,
పావురాయుయ్యాలపత్తౌలయంచుల
జాలులా గాలినీలాలపాట,
విరజాజికన్నె నిద్దురకన్ను రెప్పల
కాల్వలా నెత్తావికలలపాట,
కలిసి, నీగొంతుత్రోవల, సెలలుగట్టి,
అలల నుప్పొంగి, నాహృదయాంచలముల
పారి, దాహాన బీటలువారి యెండు
ఈ బ్రతుకునిండ నిండిపోయినవి చెలియ!

ఒకవరి తీయనౌ బరువులొత్తగ
జీవిత మంత క్రుంగి, వేరొకవరి తేలి యేలో
యెటకో యెటకో జలదాల దాటి తారకల
విశాలనీలపథరాజులనెల్ల నతిక్రమించి

పోయి కలియు సోలిసోలి చదలేటి
తుషారపు స్వప్నరాసులన్.

ఈవు తేనియగాం తెత్తితేని, నీ క
పోలములు చిరునవ్వు నేత్రాలుకూడ
మరచి సర్వమ్ము, సొగసుగా శిరను ద్రిప్పు
చెందులకొ పాడినట్లుండు నేదొ యేదొ!

మరియు నేవేవొ కలలు ముంగురుల జారి,
వాలి కనుబొమ్మనునుగొమ్మవంపులందు,
దూరి చూపుల, చెక్కిళ్ల జేరి, మంద
మందహాసంపుమసకలో మాయ మాను!

కృష్ణశాస్త్రి

## నిత్య క్రీడ

ఉదయసంధ్యానవాంశువు లదుమ దద్ద
రిల్లి ఆశాంతములనుండి మెల్లమెల్ల
కుంచుకొనిపోవు నీనీడకొనలవెంట
చేరుకొందును నీ పదాంభోరుహములు!

ప్రబలమధ్యాహ్నతీక్ష్ణాతపమున కలగి
అలసిపోయిన నీ నీడ కలసిపోయి
ప్రణయభావాతి మధుర విశ్రాంతికొరకు
నీ శరీరాంచలము లంటి నిలిచియుందు !

అపరసంధ్యార్ద్రరోచుల నమృతరాగ
మంజురంజితమై సాగి మరల దెసలు
క్రమ్ముకొనిపోవు నీ నీడ కలసివెడలి
ఆయనంత దిగంతమ్ము లావరింతు !

నా య ని

## దీ ప ం

ఆరిపేయవె దీపమూ !
వెలుగులో నీమీద నిలపలేనే మనసు !
ఆరిపేయవె దీపమూ !

జిమ్ముమంటూ తోట
సీకటైపోవాలి,
సీకట్లో నూడాలి
నీకళ్ల తళతళలు !

ఆరిపేయవె దీపమూ !
వెలుగులో నీమీద నిలపలేనే మనసు !
ఆరిపేయవె దీపమూ !

తళుకుతో నీరూపు
తలుసుకొని తలుసుకొని
నీకట్లా నాకళ్లు
సిల్లులడ నూడాలి !
ఆరిపేయవె దీపమూ !
యెలుగులో నీమీద నిలపలేనే మనసు !
ఆరిపేయవె దీపమూ !

సూపులే ఆపేసి
రూపువ్వా సే మరిసి
వాక రెరుగ కింకొకరు
వారిగి నిదరోదాము !
ఆరిపేయవె దీపమూ !
యెలుగులో నీమీద నిలపలేనే మనసు !
ఆరిపేయవె దీపమూ !

నండూరి

## యాత్ర

పైరగాలితరంగాలపై నపూర్వ
పరిమళవిలాసములు వెల్లివిరియసాగె,
ఓసఖి ! చూడు మిరుగట్ల నొరసికొనుచు
పొంగుచున్న దానందప్రపూర మిపుడు;

ముంగురులపైన పూవులు ముడువవలదు,
వలదు తిలకమ్ము, కైనేత వలదు మేన,
విడిన కబరీభరము ముడివేయవలదు
కాల మిదిగాదు మన యలంకారములకు !

తరతరమ్ముల ప్రేమస్వాతంత్ర్య లరుగు
దారి బోయెడు నూతనాధ్వగుల మనల
పరిహసించెడు పాడుప్రపంచమునకై
పారవేయుము నీయలంకారభరము !

మూఢవిశ్వాసశృంఖలమ్ముల విదల్చి
వలపుకౌగిటిముడి బట్టువడితిమేని
మనశరీరసుఖస్పర్శమునకు నేటి
యణు వణువుగూడ నవజీవ మనుభవించు !

కోరికలనెల్ల మరచి నాకొరకు నీవు,
నీకొరకు నేను, తొలివేగుబోక రాలు
పూలజతవోలె ఈసుధాపూరమందు
తేలిపోదము జన్మజన్మాలయాత్ర !

వేదుల

## ర క్త వి హా ర ము

నే భయంకర కాముకుడ,
నాకరాలచితిని
కన్యకలు వెన్నవలె కరిగిపోదురు;
ఇంతవిడివిడని పూలు
నను కని, సమాధి రగులు పాట విని,
వత్తులై నలిగిపోవు;
అట్టి నను నీవు
మోహాశాపాలవలన,
పొర్లు కెరటాల నురుగు కేశాలవలన,
సొగసువలన ఆకర్షించి శాసింతువు!

అదిగో నిర్దయాలోక కాఠిన్యమూర్ఖ
ఖడ్గవిచ్ఛిన్న స్త్రీకంఠ నాళగళితరక్తలహరి!
నామురళి!
రెండు గులాబిపూలవోలె
కాల్వ కెదురీది
ఈ చంద్రికారహోనిశీథిలో, రహఃకేళిలో
కలసిపోదము!
తప్తశోణితస్నాతమ్ములైనగాని పూలు
యుగయుగాలను తావి ముంచబోవు!

రామచంద్ర అప్పారావు

## ప్రళయము

భాద్రపదమట! విమలాభ్రపథము గ్రమ్ము
నీ వినీలాంబుదోద్గతమ్మీయఖండ
వర్షధారాప్రవాహమ్ము వచ్చి వచ్చి
నాహృదయగోళమునయందు నదులు గట్టు!

జీర్ణవసనుండ నీచలి చించుకొనెదు
నాకృశీభూతదేహమ్ముపైకి పొర్లు,
నీప్రవాహవేగము నిల్వనీదు నన్ను,
ప్రళయసూచనయేమొ నాప్రణయమునకు!

అంతకంతకు దుర్వారమై ధరిత్రి
యింతయును ముంచుకొనునటే యీయకాండ
విలయజలరాశి, నానిరుపేదజీవ
కళిక తనలోన నొక యశ్రుకణము జేసి!

ఆమహోక్రూరజలరాశియం దనంత
భంగము లుదగ్రగతుల నుప్పొంగుననుము,
అచట నాప్రేమయను మఱ్ఱియాకు పఱచి
నేను పవళించెదను సుధానిభృతమూర్తి!

నాయని

*

సంచలనశీలమైన నాస్వాంత మెట్లు
నిల్పుకొన్నావు నీవయి నిశ్చలముగ?
ఎట్లు హృదయేశ్వరీ, నీ కహీనగరిమ
గలిగె నింత మహావశీకరణశక్తి?

అన్యవశవర్తిగాక యిచ్ఛానుసార
గతిని జరియించు నీమతంగజము నార
కట్టినావు భవద్గుణగణముతోడ,
ఇట్టియాధోరణత నీకు నెట్లు కలిగె!

విస్మయోద్దీపకము భవద్విజయమహిమ
దేవి, నా కించుకేనియు తెలియదాయె,
ఇంత సులువుగ నీమతిమంతు డధిక
గర్వి యెట్టులు నీపదాక్రాంతు డయ్యె!

ఎంతటిప్రభావమేలేని దీవిధాన
భవ్యదివ్యమహాస్వరూపంబు దాల్చి
దేవి, ఆత్మాభిమాని నతిస్వతంత్రు
జేసికొన్నావు దాను విచిత్ర మొదవ!

శివశంకర శాస్త్రి

## పరాజయము

బింబఫలములఁబోలు నీ పెదవు లెపుడు
ఈయధరమంటి వేడిముద్దిచ్చె, నపుడె
అంకితంబయ్యె నాహృదయంబు నీకు
నృపతిముద్రాంకితంబైన లేఖయట్లు!

సిగ్గుపొరదాటి పటుభుజాశ్లేషమందు
ఎప్పు డీసఖతనువు బంధించినావొ,
అర్పితంబయ్యె నపుడె నాయాత్మ నీకు
రణపరాజితుడైన శాత్రవుడువోలె!

నో ౧

## ఆరాధన

ఆమె నవనీతహృదయ, నాయంతరంగ
శాంతిదేవత, ఆశాపథాంతరాళ
పారిజాతమ్ము, ప్రేమజీవనవిభాత
కైశికీగీతి, నాతపఃకల్పవల్లి,
ఆమె జగదీశమకుటాగ్రసీమనుండి
యుర్విపై జారిన సుధామయూఖరేఖ,

ఆమె మూఁడులోకాలకల్యాణమునకు
అవతరించిన యొక పవిత్రానుభావ,
మూఁమె నా జన్మజన్మపుణ్యములు పండి
ప్రాప్తమైన కేళీపరిత్యాగలీల,
ఆమెపదసన్నిధానదివ్యస్థలాన
భక్తినమ్రుడనై నిలంబడినయపుడు
తలపునకువచ్చు నా పేదతనము నాకు!

* * *

'చెలియ! ఏదేవిమంగళాశీస్సుమములు
పరిమళించినవో మనశిరములందు
ఒకతపస్సిద్ధివోలె నేటికి లభించె
నిరువురిమనోరథమ్ముల కేకఫలము'!
అనిన, తారళ్యవిస్తారితాక్షియగుచు
'స్వామి, మనతోటలో నీవసంతవేళ
పూచినసుమమ్ములా దేవిపూజకొరకె!'
యనుచు, నాచేయి తనచేత నదుముకొన్న
యామెపదసన్నిధానదివ్యస్థలాన
నాకకల్లోలినీపదన్యాసమునకు
దరవినతమైన హరజటాభరమువోలె
నతుడనయ్యు మహామహోన్నతి వహింతు!

వేదుల

## ఫలశ్రుతి

అంతశ్రమపడి పావన మభ్రగంగ
ధారుణికిఁ దెచ్చినాఁడు భగీరథుండు,
అంతమథియించి కలశరత్నాకరమ్ము
అమృతభాండమ్ము పడసినా రమరవరులు!

మత్పురానేకపుణ్యాజన్మములు పండి
జాహ్నవీస్వచ్ఛవును సుధాస్వాదుమూర్తి
వైన నీ దివ్యసాన్నిధ్య మందుకొంటిఁ
బుడమికిన్ స్వర్గమున కొక్కముడి రచించి!

ఇంతకాలమ్ముగా నా కదృష్టములయి
ఎన్ని యానందధామము లీయనంత
భువనసంధుల భాసిల్లునవియు నేఁడు
మత్పదాక్రాంతములు భవన్మహిమఁ జేసి!

నాయని

*

నా విరులదోటఁ బెంచికొన్నాఁడ నొక్క
పవడపుగులాబి మొక్క నాప్రణయజీవ
నమ్ము వర్షమ్ముగా ననయమ్ముఁ గురిసి;
కొన్నినాళ్లాయె, సుకుమారకుసుమ మొకటి
నవ్వె కలకలమని నావనమ్ములోన;
అంత దానినె, నాజీవితాశయమ్ము
పూవుగా వింతగా మారిపోయినటులు
వలచికొన్నాఁడ;
నాప్రసవమ్ము నేను,
నన్ను మనసార నాప్రసూనమ్ము, కనులు
విచ్చి కాంచుచుఁ గాలము పుచ్చినాము
ఎదల నిశ్శబ్దముగఁ బల్కరించుకొనుచు,
ఎట్టు లది దాపురించెనో యేమొ యంత
నాకునందులత్రోవల నల్ల దిగియె
నొక్క క్రూరార్క కిరణమ్ము; ఉర్వి వాలి
నాగులాబి సోలి తూలి నన్ను వీడె;

అపుడు నావైపు చూచి, నాయలరులేని
శూన్యమౌ మోడువ్రాఁకును జూచి, యొక్క
కోకిలమ్ము 'కో' యనియేడ్చె గొంతునెత్తి!
మాకొఱకు దారిఁ బోయెడు మందపవనుఁ
డొకఁడు జాలిగ నొక్క నిట్టూర్పు విసరె!

కృష్ణశాస్త్రి

## అప్రాప్తమనోహరికి

ఓ నవనీతకోమలవయోరుచిరాంగి,
యనుగ్రహింపు ప్రేమానుమితాస్మదీయ
వచనావళులన్, భవదార్ద్రరాగ
సన్మానితుఁడైన యీకవికుమారునిపల్కులు
నీమనోజ్ఞ నేత్రానుగతాచ్ఛశోభనము
లందుకొనం దల లెత్తవేనియున్!

చీఁకటిదారులందువికసించిన వెన్నెలవోలె,
తీవ్రబాధాకులులైనవారలు సుధాసరసిన్
గొను స్నానమట్లు శ్యామాకృతిఁ దాల్చి
నాదుహృదయమ్మునవిల్చిన దివ్యరాజ్ఞి,
నాకై కరుణించి నీ తనువికాసము నింపుము
నామనమ్మునన్!

మోమున మోముఁ జేర్చి నిను ముద్దిడుకోరిక
లేదు, నీదువక్షోమృదుశయ్యపైని శిరసున్
గడవాలిచి వ్రేలు మల్లికాదామసువాసనా
మధురత ల్పరికింపఁగఁ గాంక్ష లేదు,
నాప్రేమకు దారిఁ జూపఁగ
వరించితి నా యలరించు నెచ్చెలీ!

మ్లానమతిన్ దృగంచలములన్ దొలకాడెడు
నీమనోజ్ఞతల్ లోన నడంగు నశ్రువులలోఁ
దడుపన్ దలపెట్టఁబోక వైజ్ఞానిక
సాధుభాషణములం దనియింపుము నన్ను,
నామదిన్ లీనవు కమ్ము, నన్గవుఁగిలింపుము
నీ కమనీయశోభచే!

అబ్బూరి

## పూర్ణిమ

ఆ యుదయాద్రినుండి యరుణారుణమా
ముఖ మెత్తి, గాఢలజ్జాయుతయా నవోఢవలె
నందడిచేయక తొంగి తొంగి లోలాయతదృష్టులన్
దశదిశాంతరముల్ పరికించి, శూన్యమైపోయిన
నాకుటీరపదమున్ గురుతింతువు
చాటుచాటునన్!

ఈవలిగాడ్పు లెంత వడకించుచునున్నను
నీ ప్రవాళ రేఖావిలసన్ముఖంబు తడిగట్టెడుసిగ్గున
సంచలించినన్, మోవగరాని ప్రేమను
విముక్త గవాక్షపథమ్ము డిగ్గి
నా క్రేవకు వత్తు వెట్లో పులకింపగ
నాతృణకీర్ణశయ్యయున్ !

పొంగులుదేరు తీయవలపుల్
హృదయంబును ముట్టడింపగా వంగి,
సుషుప్తిచే ముడువారిన నాకనుబొమ్మలన్
సుధాలింగితచుంబనమ్ముల చలింపగఁజేసి,
సుఖోదయవ్యథాభంగములన్ కలంతువు,
భవన్మృదులోచ్ఛ్వసితానిలాహతిన్ !

అనునుమబ్బు కౌగిళుల కందని
నీ లవలీమనోజ్ఞమౌ మేని సుధాద్యుతుల్
నిదురమేల్కొలుపన్ నవమాఘమాససంధ్యానిలమట్లు
నాతనులతన్ పులకింపులతో స్పృశించి,
బాధానిశితమ్ము నావువెదన్ గదియింతువు
నీయెడందతోన్ !

ఈతృణశయ్యయందె నిదురించెద నిర్భరమున్
పరస్పరాద్వైతగతాత్మవృత్తిని,
భవద్భుజవల్లుల నన్ను బందెగన్ జేతువు నీవు,

నే నవుడు నీయమృతాసవమెల్ల ద్రావుచున్
రాతిరి నొక్క స్వప్నమధురక్షణమట్లుగ
వెళ్లబుచ్చుదున్ !

వేదుల

## విరహవీథి

హేమపాత్రలఁ జందన మెండిపోయె
ద్వారములు మోయుచున్నవి హారములను
సానలం దింకె స్నానకషాయగంధ
మబల, యెవనికోసము సగమయి కృశింతు !

చెక్కు చెదరనిపాపట చిక్కుపడియె
వేణిబంధము శిథిలమై పిఱుఁదులందె,
కరఁగి చెరగిన తిలకరేఖలను దుడువ
వతివ, యెవఁ డాహరించె నీయార్ద్రహృదిని !

పాలు పొంగినగతి పొంగు ప్రణయరక్తి
నాపుకొనలేని పడుచుప్రాయంబుతోడ
నమ్మి యెవనికి నీమన మమ్మికొంటి
వువిద, యీమేఘమాస నవోదయముల !

రాయప్రోలు

## అ భి సా రి క

గాలియడుగుల నెవరికోసరము
ఓ మోహశీలా!
కదలి వచ్చితి వీ నిశీథమున?
కాలియందెలు ఘల్లుమను ననియొ
ఓ వలపురాణీ!
కేలఁ గైకొని మెల్ల నడచెదవు
పులుఁగుతుటుము తటాన కీ చనుచు
లరగూర్కి గూళులఁ
బలుక వెఱపున దెసలు గాంచెదవు!
నిలిచి యేమని యాలకించెదవు,
నీ యడుగుసడికే
యులికిపడి 'యెవ' రనుచు మఱలెదవు!
తెల్లవెన్నెల నీ దుకూలంబు
మైపూఁతనిగ్గులు
తెలియరావని యూహ సల్పెదవు,

నీవు నడచెడిబాట యెల్లెడల
వ్యాపించు గంధవుఁ
దావు లెట్టుల గప్పిపుచ్చెదవు?
ఓ ముద్దరాలా!
నీ నీహారము బయలుపఱచెదవు

రామిరెడ్డి

ఏ నా డు ?

ఏనాడు నీమోవి
లేనవ్వు పొల్చునో,
ఏ రేయి చీకట్ల
నీచేయి తుడుచునో,
ఏ ప్రొద్దుపొడుపులో
నీప్రేమ మొలుచునో,
ఆనాడు; ఆ రేయి,
ఆప్రొద్దె రేకెత్తు
నా వాడినట్టి గుం
డెలలోని పూగుత్తి!

మరిగి కష్టపుటలల్
విరిగి తుంపురలౌను,
వేగి నిశ్వాసముల్
వీగు తుత్తునియలై,

మొయిలుచాటున దాగు
మయిలకన్నీ రవుడు,
అప్పు డోచిరునవ్వా!
అప్పు డోచిగురాక !
రెప్పపాటున ముద్దు
లప్పగింతును నీకు!

గాలిలో రెప రెపల్
తేలివచ్చున దెపుడు,
ఏ తమస్సులకొసల?
ఏ యుషస్సులదెసల ?

నింగిలో చుక్కలో
తొంగిచూచుసువార్త
చెంగు చెంగున వచ్చి
మ్రింగు నాదు నిరాశ
నెప్పుడో చిరుకన్నె ?
చెప్పవా చిరుకన్నె ?
చెప్పవా, చెప్పవా,
చెప్పవా చిరుకన్నె ?

విశ్వేశ్వరరావు

## సుక్క

సుక్కెక్క డున్నాదో సూడవే చెల్లీ!
బారెడైనా కొండపైకి సాగిందేమొ!
సుక్కెక్క డున్నాదో సూడవే చెల్లీ!

తాను నిలిపిన గడువు
దాటిపోనేలేదు -
కాలు సేతులు పక్క-
కంటుకొనిపోనాయి

సుక్కెక్క డున్నాదో సూడవే చెల్లీ!
బారెడైనా కొండపైకి సాగిందేమొ!
సుక్కెక్క డున్నాదో సూడవే చెల్లీ!

సుక్కతోనే కొండ
లెక్కొత్తు నన్నాడు -
మబ్బో, మనిషో, కొండ
మలుపు పరకాయించి

సుక్కెక్క డున్నాదో సూడవే చెల్లీ!
బారెడైనా కొండపైకి సాగిందేమొ!
సుక్కెక్క డున్నాదో సూడవే చెల్లీ!

వొకటొకటిగా మెట్లు
వొదిగి దిగి రావాలి -
తోటయెలపల గలగ
లేటా యినసీవమ్మ!
సు క్కెక్క డున్నాదో సూడవే చెల్లీ!
బారెడ్డైనా కొండపైకి సాగిందేమొ!
సు క్కెక్క డున్నాదో సూడవే చెల్లీ!

నాసొగసు నన్నైన
సూసుకోనీ దమ్మ -
ఆవుమెల్లోమువ్వ
లట్టె మోగిన వేటా!
సు క్కెక్క డున్నాదో సూడవే చెల్లీ!
బారెడ్డైనా కొండపైకి సాగిందేమొ!
సు క్కెక్క డున్నాదో సూడవే చెల్లీ!

నందూరి

## పిలుపు

నిశలు పులకించెఁ గనులకు నిదుర రాదు
పైదలీ యేమిటికి నన్ను బాధపెట్ట?
ఏ పొదల దాగి పాడె దీ హృదయదళన
దారుణములైన నగ్నగీతమ్ము లెత్తి;

నా విరహగంధగీతి కన్వయముఁ జెప్ప
శిరసు లెత్తుచు నున్నవి చిరుగుఁబొదలు,
నవ్వుచున్నది కడల నందంపుసందె
కావిరంగులరంగైన మోవి విరిచి;

కొసరి యాకుంబనవుచెఱఁగులను లాగు
గంధవహుని కౌఁగిటనుండి కరుణపదము
లల్లుచున్నది శ్రుతులఁ బ్రాయంపువంశి,
నాహృదయ వేదనాలాపనములఁ గరఁగి;

వలపు పచ్చనిదని రక్తిమొలవఁ బాడి,
విరహ మరుణమని యెద తపింప విసివి,
చెలిమి నల్లనిదని నిరసింతు విపుడు,
ప్రేమ ధవళిమయని యింక వినుతు వెపుడు!

రాయప్రోలు

## ఆసురకృత్యము

ఎవ్వడే నీ గళమ్మునం దిరవుకొనగ
నేను విసరిన ప్రేమప్రసూనమాల
నడుమ నీవు చూడగ బట్టి నలిపివైచి
నీకనులయందు నెత్తురుల్ నింపినాడు ?

భావిభాగ్యోదయప్రభాభాసమాన
సుందరమ్మైన స్వాప్నికానందమందు
మైమఱచియుండ, నెవ్వడే మచ్చరించి
నాయెడదలోన చురకత్తి నాటినాడు ?

ఈనిరంతరతీవ్రబాధానివృత్త
మైన నాముగ్ధహృదయమ్ము నంతరాళ
శూన్యతలి నెవ్వడే నిలుచుండబెట్టి
ఎడతెగనిసంశయముల బంధించినాడు ?

ఈయగమ్యవాయుపథమ్ము లేగనేర్చి
మననడుమ దూతలైన యీవినయశీల
పరమపరమాణువులకు వాగ్బంధనమ్ము
నెవ్వడే కఠోరముగ శాసించినాడు ?

ఎవ్వడే రాక్షసుడు మనమీదనున్న
యవధియంతయు తానయ్యె యాక్రమించి
వికటదంష్ట్రాభయంకరవికృతవదన
విషమహాసుండ న న్నిట్లు వెక్కిరించు?

నాయని

*

నాహృదయ వనమందు ననారతమ్ము
దారుణమ్ముగ చెలరేగు దావవహ్ని
శాంతి గనదాయె వైరాగ్యసలిలధార
నెంత వర్షింప - ఇంక నే నేమి చేతు!

మరచిపోవుదు నన్నను మరపురాదు
అయ్యయో జీవితేశ్వరీ, అనవరతము
నీమహామోహినీమూర్తి నేత్రయుగళి
యెదుట నర్తించుచుండు - నే నేమి చేతు!

అనిశ భవదీయ భావనాయాసభార
వివశ మయ్యెను లక్ష్మి, యీవిరహి బుద్ధి!
దుర్లభజనానురాగదోదూయమాన
హృదయమున కేమిగతి - ఇంక నేమి చేతు!

వ్రీడ నెటులైన నొకసారి విడిచి ముగ్ధ,
తెలిపి నీప్రేమ కావు మా దీనజనుని!
ప్రాణములు పోవుచున్నవి - పలుక వేమి
యిప్పటికినైన? అకట, నే నేమి చేతు!

శివశంకర శాస్త్రి

## తాజ్ మహాల్

మామిడిచెట్టును అల్లుకొన్నదీ
మాధవీల తొకటి
యేమూరెండిటి ప్రేమసంపదా
ఇంతిం తనలేమూ!
చూడలేని పాపిష్ఠితుపానూ
ఊడబీకె లతనూ,
మోడైపోయీ మామిడిచెట్టూ
మొగము వేలవేసె!
ముచ్చటైన ఆకులు కాయలనే
వెచ్చని కన్నీళ్లోడ్చి,
పచ్చనాకులాబొమ్మరింటిలో
పం డొక్కటి రాల్చి,
మామిడిచెట్టూ మాధవిలతతో

మాయలో గలిసింది,
కామితమిచ్చేమామిడిపండూ
కవులకుమిగిలింది!

బసవరాజు

## ప్రియ నిరీక్షణము

చింతమానుకొమ్మపైన
వింతగాను గువ్వజంట
సంతోషముతోడ సరస
సల్లాపము లాడుచుండె,
వాడుటాకులన్నియు బడి
వాడల నాడుచు బోవున్,

చల్లని చిరుగాలిపాట
మెల్లగ వీనుల సోకగ;
వాకిట నిలబడి, అడుగుల
చప్పుడైనయప్పుడెల్ల
ఆత్రముతో నీవె వచ్చి
తని భ్రమపడి చూతు నాథ!

సౌదామిని

## నా టి రే యి

దారులన్నియు మాపె దశదిశలు ముంచెత్తె
నీరంధ్ర భయదాంధకారజీమూతాళి;
ప్రేయసీ, ప్రేయసీ, వెడలిపోయితివేల
ఆ యగమ్యతమస్వినీగర్భకుహరాల ?

ఆ యఘాతంపు టేకాంతమ్ములో వ్రాసి
మాయమై మెల్లగా నీయడుగునందడులు
నా యెడదత్రోవనే పడి నడచినట్లయ్యె;
నా యెడదలోననే మాయమైనట్లయ్యె !

అంత నా గొంతులో 'హా ప్రియా!' యను కేక
అంతంత దివి కేగె, అంతంత దిగిపోయె,
తారలే కనువిచ్చి తమములే శ్రుతివిచ్చి
ఆ రవము విని నన్ను గని జాలి నొందాయి !

నాటినుండియు నేను ప్రతినిశీథతమంపు
గాటుకలచాటు నొరు లే రరయలేనితరి
చూచుకొనిచూచుకొనిశూన్యహృదయములోని
'ఓచెలీ !'యని క్రుంగి క్రుంగి యేడ్తునుసుమా !

సడిలేని నడిరేయి బడిపోయినట్టి నీ
కడియాలరవళులే చిరుగాజువ్రాతలే

వ్రేలెత్తిచూపు జీవితపథమ్ములు నాకు;
కేలెత్తినడిపించు, నెల్గెత్తి న న్నిలుచు!

కృష్ణశాస్త్రి

## ఈశ్వరీ!

ఎటనో, దవ్వుదవ్వులనుండి యెగసివచ్చి
శ్రవణముల సోలయించును చావుమేళ,
మిది నిశీథి, ఆ కల్లాడ దీశ్వరీ! ప్ర
చండయామినీకింకిణీస్వనము దక్క,
నామన స్సెనె చీల్చికొన్నాను, దగధ
గాగ్ని కాంతితో దాన వెల్గారు నీ వి
నీలమోహనమూర్తి కంటికి నద్ది
నాను, తలపోసి మూర్ఛలో నణగినాను,
కనులు విచ్చి మ్రోయగలేక గాలిపరువు
విసరునకు దూలి దౌర్బల్యవివశుడనయి
లోకమూర్ఖసంతోషవిలోచనాల
కాహుతిగ రేకరేకగ నట్టి తీసి
నద్దెసల జిమ్ముకొన్నాను

నామనస్సు!

రామచంద్ర అప్పారావు

## న మి లి మిం గి న నా యెం కి

యెంకివొంటిపిల్ల లేదోయి లేదోయి!
యెంకి నావొంకింక రాదోయి రాదోయి!

మెళ్లో పూసలసేరు
తల్లో పూవులసేరు,
కళ్లెత్తితే సాలు
కనకాబిసేకాలు!

యెంకివొంటిపిల్ల లేదోయి లేదోయి!
యెంకి నావొంకింక రాదోయి రాదోయి!

సెక్కిట సిన్నిమచ్చ
సెపితే సాలదు లచ్చ!
వొక్కనవ్వే యేలు
వొజ్జిర వొయిడూరాలు!

యెంకివొంటిపిల్ల లేదోయి లేదోయి!
యెంకి నావొంకింక రాదోయి రాదోయి!

పదమూ పాడిందంటె
పాపాలు పోవాల!
కతలూ సెప్పిందంటె
కలకాల ముండాల!
యెంకివొంటిపిల్ల లేదోయి లేదోయి!
యెంకి నావొం కింక రాదోయి రాదోయి!

తోటంతా సీకట్లె
దొడ్డి సీకటిమయమె
కూటి కెళితే గుండె
గుబగుబమంటా బయిమె!
యెంకివొంటిపిల్ల లేదోయి లేదోయి!
యెంకి నావొం కింక రాదోయి రాదోయి!

రాసోరింటికైన
రంగు తెచ్చేపిల్ల!
నాసామ్మి నాగుండె
నమిలి మింగిన పిల్ల!
యెంకివొంటిపిల్ల లేదోయి లేదోయి!
యెంకి నావొం కింక రాదోయి రాదోయి!

నండూరి

*

నిన్ను దలపోయుచునె నేఁ జిదుముకొనిపోతి,
పచ్చికాయలు వట్టిపూవుల్లు రేకుల్లు,

ఫల మెంచనైతి,
లోపలి తేనెఁ గొననైతి,
అలసముద్రపుటోర తెలినురుగు కెరటాలు
ఇసుకలోఁ జిరుబుడగలెత్తించుటలు గంటి,
మునిఁగి ముత్తెపుమూటముల్లె మోయగనైతి!
నిన్ను దలపోయుచునె నేఁ జిదుముకొనిపోతి,
పచ్చికాయలు వట్టిపూవుల్లు రేకుల్లు,

కొండనెత్తపుఁజెట్టు కొమ్మపైఁ దినఁ దిన్ను
గనవచ్చు నొక చుక్క కాంతికళ నాసిస్తి
తెట్టతెన్నే పట్టు దివ్వె తెలియఁగనైతి!
నిన్ను దలపోయుచునె నేఁ జిదుముకొనిపోతి,
పచ్చికాయలు వట్టిపూవుల్లు రేకుల్లు

కవికొండల

*

చలి గడగడ వడకించెను
జగతిఁ గ్రమ్మె నంధకార
మచ్చటచట మినుకు మినుకు
మను దీపిక లోనాధా!

ఈనిసిరాతిరి నొంటిగ
నేకానని దేశాలను
గుండెదో! నిశ్శబ్దములో
విందువో, నాయార్తగీతి!

సౌదామిని

*

కలతనిదర

ఈరేయి నన్నొల్లనేరవా రాజా!
యెన్నెలలసొగసంత యేటిపాలేనటర?

ఆకాశ మేమూలొ
అణిగిపోయిన రేయి
యేటికెందురుడల్లె
పాటుసూపుల కులికె
ఈరేయి నన్నొల్లనేరవా రాజా!
యెన్నెలలసొగసంత యేటిపాలేనటర?

ఆకాశ మూవౌరన
అడిలిపోయిన రేయి
మాట తెరగనిపాప
యేటిగిలగిల నూపి
ఈ రేయి న న్నొల్ల నేరవా రాజా!
యెన్నెలలసాగనంత యేటిపాలేనటర ?

ఆకాశ మోతీరు
ఆవులించిన రేయి
మిసమిసలతో యేటి
పసలతో నను సుట్టి
ఈ రేయి న న్నొల్ల నేరవా రాజా!
యెన్నెలలసాగనంత యేటిపాలేనటర ?

యెలుతురంతా మేసి
యేరు నెమరేసింది
కలవరపు నాబతుకు
కలతనిద రయ్యింది
ఈ రేయి న న్నొల్ల నేరవా రాజా!
యెన్నెలలసాగనంత యేటిపాలేనటర ?

ఒక్క తెను నా కేల
వోపజాలనిసుకము!
ఈ రేయి న న్నొల్ల నేరవా రాజా!
యెన్నెలలసాగనంత యేటిపాలేనటర ?

నండూరి

*

ఊరకే చలియించు నీ రేయి వెన్నెలలు
విరహవీణా తరళతరళ తంత్రీగతుల,
ఏదిగంతాహ్వాన వేదనారవమేని
కలచుతొందరలతో పలుకరించునొ కాని,

వలిసెజ్జపై మల్లియలరెప్పలే వాల
వలయు నా బ్రతుకు శయ్యాశాంతిలో తేల,
హంసశరదానిలమ్ములు శర్వరీవిరహ
సురభినిశ్వాసములు సాగియించు దశదిగల్ !

కృష్ణశాస్త్రి

*

చెలియా ! పూయఁగరాని పూవు పొదఁ
బూచెం గ్రొత్తపువ్వమ్ము, మాపుల నీ రెత్తెడి ముగ్ధుఁ
డొక్కఁడు తలంపుల్ నిల్పె నా మొగ్గపైఁ,
జెలువమ్మున్ వలపున్ తదాదిగ వృథా జీర్ణించి
జీర్ణించి, శోషిలి, శాంతింపఁగనున్న
దేమిఁ గలదో చెప్పంగఁ బ్రేమావధిన్ !

మొగ్గఁగట్టిన తొలికారు మోజు సయిచి,
రేకుసాగిన మోహానఋతువుఁ గడపి,
కుసుమదశకయి యుత్కంఠగొనిన యూర్పు
తుదిఁ గృశించెడి నిట్టూర్పుతోనె యిటుల!

రాయప్రోలు

*

ఆకసమున మబ్బు దట్ట
మై క్రమ్మెను, చిటపటమను
చినుకుల తీయని పాటలు
చెవుల కింపు గూర్చుచుండె,
గున్నమావికొమ్మలందు
కోకిలపాడెడు పాటలు
వినవచ్చుచునుండె, నిల్లె
వేచియుంటి నెప్పుడు ప్రియు
డరుదెంచెడునా, నే నెపు
డాముద్దుమొగమ్ము గాంతు
నా యంచున్, నాహృదయ
మ్మాతురతన్ జెందుచుండె!

సౌదామిని

*

ఈనడికిరేయి వెన్నెలయెద చలించు
పిలు పెదో 'నాసఖా' యని వేగిరించు;
అనలమైకాల్చు నిశ్శబ్దమునె; కలంచి
పరువులెత్తించు కడల నా బ్రతుకు నిపుడు!

ఎన్నిమారులు సవరించుకొన్న చూపు
తొలగవేమో యలమునేమొ నెలమొగాన
చెదరునే బెదరి బెదరి చెలియకురులు
జాలిగా నీలమేఘనిశ్వాసములటు!

నాకొరకె చాచు సఖికంఠనాళమందు
మ్రోగక చలించి చెరవడ్డ మూగబాధ
ఎటు పిలుచు నన్ను ఆచూపుటిరుల; కనులె
పలుకనేరక విడి విడి పగులు నేమొ!

అయ్యయో! ఊర్వశీవిషాదార్ద్రమూర్తి
ఈ నిశీథాన, నాహృదయాన, నిండె,
పూర్ణిమాశుభ్రయామిని బొగ్గువోలె
ఈ యెడదవోలె కాలిపోయినది నేడు.

ప్రాణసఖి, నీనుదూరతల్పమున సుప్తి
కట కలలు రావు! కలుగదు కలవరింత,
వేగిపోదిట నీకయి వేలు కేలు
బ్రతుకుబ్రతుకెల్ల ఒక్క నేత్రముగ గాచి!

కృష్ణశాస్త్రి

## కోయిల

కోయిలా కోయిలా
కూయబోకే,
గుండెలూ బద్దలూ
చేయబోకే!
కోయిలా కోయిలా
కూయబోకే,

తీయనీరాగాలు
తీయబోకే,
తీపితో నామనసు
కోయబోకే!
కోయిలా కోయిలా
కూయబోకే,

చిట్టినీ జ్ఞాపకం
చేయబోకే,
చింతతో ప్రాణాలు
తీయబోకే!
కోయిలా కోయిలా
కూయబోకే!

బసవరాజు

## కార్తిక పూర్ణిమ

శారదదినాంతరమణీయసాంధ్యరాగ
విమలపథముల నీనాఁడు వెల్లివిరిసి
నీప్రణయరాగ మెల్లెడ నిండుకొనియె!

ఆ యెగిరివచ్చు పూర్వదిశాభిముఖము
లైనపులుఁగుల ఱెక్కలల్లార్పులందు
మధురకంఠధ్వనులయందు మాటలందు
నీబయలుదేరు సంగతియే భరించె!

ప్రావృడంభోధరముల వర్షములు మోచి
శీతలమనోహరాంగసుస్నిగ్ధమూర్తి
యుత్తరానిలుగర్భ ముబ్బూఁత లూఁచె,
నీప్రయాణభేరీకమనీయరవము!

ఈమనోజ్ఞకాౢర్తికపూర్ణిమామహోద
యావసరమునఁ బొంగి బ్రహ్మాండ మంత
యైన నాయాత్మలో భవదమృతమూర్తి
నిరుపమవిలాసవేశముల్ పొరలిపోయి,

నీవెడలుదారి కాచుకో నిశ్చయించు
కొంటి, గానుకగాఁ గన్నుఁగొలఁకులందు
దాచుకొంటి నిరంతరదహనశీల
చిరవిరహావహ్ని ప్రాణముల్ మఱుఁగుచోట
సేకరించిన యుష్ణాశ్రుశీకరములు!

నా య కి

*

అయ్యయో, యేల చూచితి వట్లు నన్ను
ఆ దినమ్మున మధురసాయాహ్నమందు
దేహళిని నిల్చి మోహినీదృష్టితోడ
పథము వెంబడి జనెడి విభ్రాంతహృదయు!

విపుల భవదీయలోచనవిగళదసిత
బహుతరకటాక్ష దృఢశరపంజరమున
మన్మనోభీష్టమూర్తి యేమాట లేక
వేగముగ వ్రాలి పడిపోయె వివశగతిని!

జర్జరితమయ్యె నకట, నాసరళచిత్త,
మిప్పటికినైన బాధ శమింపలేదు;
చిలుకకుంటివయేని నీస్నేహపూర
మతితరాల్పము సుమి జీవితాశ నాకు!

ఏమి హృదయాపహారిణీ, యింకనైన
కరుణ వహియించి వీనిని కావగదవె!
బహుళతాపముచే మతి భ్రంశమొంది
వివశమైపోయె; అయ్యయో, వెర్రినైతి!

శివశంకర శాస్త్రి

*

ఎవరులేని గవాక్షసంవృతలాన
ననుఁ బిలిచి బందమేసె సుందరి యొకర్తు
తెల్లనురపొన్నపువ్వుల సంకెళ్లతోడ,
ఇందులకు దైవ మొకఁడె యదృష్టసాక్షి;

చేతిలోఁ జేయివైచి నన్ జెప్పుమనియె
తీయనిమెలుంగుతో, నివి త్రెంప ననుచు,
త్రెంచలే నెటులో సహియించువాఁడ
సన్నగిల్లుహస్తమునుండి జాఱుదాఁక!

రాయప్రోలు

## ప్రణయినీగీతము

సందె జారె, చుట్టుపక్క
మినుకుమినుకు దీపమ్ములు
వెలుగుచుండె, దూరమ్మున
కోవెలలో హాయిగాను
మేళము వినవచ్చుచుండె,
చల్లగ వెన్నెలలు కన్న
తల్లివోలె కాయు గాని
మనసేమో మాటుమణిగె!

సౌదామిని

## పడవ పగిలిన!

ఇది పగిలిపోవుననుభయ మ్మింతవఱకు
ఈతలంపున, నానంద మిపుడు పొంగు,
పగిలిపోయిన చెక్కలపట్టు ఎడువ
కీవు పాథోనిధాన మీడించెద వని!

ఇది పగిలిపోవు ననుభయ మ్మింతవఱకు
ఈతలంపున, నిపు డుల్ల మిగురులెత్తు,
తునిగిపోయిన చెక్కలతో పయోధి
గర్భమున రత్నరథ మీవు కట్టెద వని!

ఇది పగిలిపోవు ననుభయ మ్మింతవఱకు
ఈతలంపున, నిపు డాత్మ కింత శాంతి,
విరిగిపోయిన చెక్కల దరికిఁ జేర్చి
నీచితికి కాష్ఠములుగ మన్నించెద వని!

నా య ని

*

శ్రవణములు సోకినంత, దుస్పృహావిషాద
కర్దమక్షాళనము చేయఁగలిగినట్టి
త్వన్మధురనామధేయామృతమ్మె గాని
ఇతర మేమియు చెవి జేరనీయనొల్ల,

దివ్యగంగాతరంగిణీతీర్థమట్లు
భాషితావిలమార్జనపటిమ గల్గి
మధురమధురమ్మైన తావకకథలె గాని
ఇతరమును జిహ్వావెంట రానీయనొల్ల,

చిత్తసద్ధ్వాంతరాశిసంస్థితవిషాద
గాఢతమసంబు హరియింపగల్గినట్టి
భవ్యభవదీయరూపదీపంబుకన్న
ఇతరమును దృష్టిసరణి రానీయనోల్ల,

చారునిర్మలచంద్రికాపూరమట్లు
హృదయతాపము చల్లార్చి ముదముగూర్చు
త్వన్నిరంతరమధురభావనలె గాని
ఇతర మేమియు మదికి రానీయనోల్ల !

శివశంకర శాస్త్రి

ఆకాలపు నా యెంకి

దూరాన నారాజు కే రాయిడౌనో,
ఈరోజు నారాత లే రాలపాలో ?

సీమ సిటుకనగానె
సెదిరిపోతది మనసు
కాకమ్మనేత్తైన
కబురంప డారాజు !

దూరాన నారాజు కే రాయిడౌనో,
ఈరోజు నారాత లే రాలపాలో ?

కళ్ళ కేటో మబ్బు
గమ్మిన ట్టుంటాది
నిదరల్లె నావొల్లు
నీరసిస్తున్నాది,
దూరాన నారాజు కే రాయిడౌనో,
ఈరోజు నారాత లే రాలపాలో ?

ఆవు 'లంబా' యంట
అడిలిపోతుండాయి
గుండెల్లో వుండుండి
గుబులు బిగు తాతాది !
దూరాన నారాజు కే రాయిడౌనో,
ఈరోజు నారాత లే రాలపాలో ?

తులిసెమ్మ వొరిగింది,
తొలివూస పెరిగింది
మనసులోనాబొమ్మ
మసకమస కేసింది !
దూరాన నారాజు కే రాయిడౌనో,
ఈరోజు నారాత లేరాలపాలో ?

నండూరి

*

ప్రేయసీ, యేల వింటి నీపేరు నేను
ఆలకించినదాది నామాత్రములు
నేమి వింతయొ కాని మదీయహృదయ
దుగ్ధవార్థిని మథన ముద్భూత మయ్యె,

అధికమైనకోలందిని మథన మకట
ఉద్గమించెను కాలకూటోగ్రవిషము,
ప్రేయసీ, నిల్పితిని దాని బిగియబట్టి
కంఠకుహరమ్మునందు శంకరునిభాతి,

ఉత్సుకతతో నిరీక్షించుచున్నవాడ
భవ్యలక్ష్మీసమాగమప్రాప్తికొరకు
పూర్ణనిరతావ్యయసుధానుభూతికొరకు
ఎన్నటికి నాకు లభియించు నివి యెరుంగ!

శివశంకర శాస్త్రి

## వి ర హ తో ర ణ ము

వినరా ఏ విభావరీ
వేలా శాలల నీ మృదు
వసనాంచలముల గుసగుసలో,
        మసలు చరణ మంజీరము
        కొసరు జాలి పలుకరింతలో!
ఈ కుటీర ముఖద్వార
మిందే వ్రేలాడి సగము
వాడి, విరహతోరణమ్మునై
        వలవంత సడలి నేల జీ
        రాడి యెన్నినాళ్లు మనుదునో!
ఇపుడు వత్తువా నీ కొర
కెదురుచూచు నీ వియోగి
యెడద మంచుజడులు కురియును,
        మాపేమో, రే పెటకో
        వెడలి చనునో, నిదుర మునుగునో!
ఆరలేని నా కోరిక
కారుచూపు చొరగ చీలి
కాలి కుములు ఈ చీకటితో
        క్రాగి క్రాగి నీ కొరకై
        కరవులోననే నశింతునో!

నీ మనోజ్ఞ కాంచన కాం
చీమణి ఘంటాగళములు
ఏకాంతము కరగ మ్రోయగా
        విన నరచే బ్రతుకు దాల్చి
        యెడద మ్రోత కెంత యేడ్తునో!
ఈ వియోగనిరాశా క్షు
ణాక్షుణ ప్రతీక్ష చెదరి
ఎగసి ఎగసి పగిలిపోదునో!
        పగ లెరుగని ప్రవాసమున
        కిక వేకువరేకు విరియదో!

ఆకన మాలోకనముగ
లోకమెల్ల వీనుగ కా
లాంతమునకు కాచియుందునా!
        ఆసలేనిఆసకు ప్రా
        ణాంతమేని వేచియుందునా!
చివురింపదా చైత్ర శుభో
త్సవవిభాతకల్యాణము
ఈ దరిద్ర హేమంతమున ...

కృష్ణశాస్త్రి

## ఆ నా టి నా వో డు

ఆనాటి నావోడు సెందురూడా,
అలిగి రాలేదోయి సెందురూడా!
యెంకి, మన మిద్దరమె
యెవ్వ రో ద్దన్నాడు!
యీ నేలు యీతోట
లింక నీ వన్నాడు,
మాటాడుతుండంగ సెందురూడా!
మంచిదా పోయేవు సెందురూడా!

కలకాల మీదినమె
నిలుసు మన కన్నాడు!
గాలికైనా తాను
కవుగి లీ నన్నాడు,
నను నూసి నవ్వేవు సెందురూడా!
నాయమా నా ముద్దుసెందురూడా!

నాకాసి సూశాడు
నీకాసి సూశాడు,
మద్దె సెంద్రుడె మనకు
పెద్దమని సన్నాడు,
కన్నీరు నీ కేల సెందురూడా!
కనికారమే శాన సెందురూడా!

నండూరి

నేను మాయమ్మయొడిలోన నింతవాడ
నైనయపుడు నాలోన నీయఖిల మిమిడి
యుండెఁ గావలె నేటి కిట్టుబికివచ్చి
చిత్రచిత్రభావాకృతుల్ చెలువుమిగిలె!
పాడుటకుమున్ను కంఠగర్భమున నెఱుఁగ
రాక యవ్యక్తమైయున్న రాగమట్లు
నిభృతచిక్కణమూర్తులు నీవు నిసువు
లిన్ని సుఖములు దాగినా రెటుల దేవి!
అస్మదీయహృదబ్జనాళాంతరమున
బీజరూపమ్ముగా నుండి విశ్వమింత
ఇది బహిర్గతమగుదాక యెఱుఁగలేన
అంత నవ్యక్తశిశుమూర్తి నైతి నెట్లు?

విశ్వనాథ

## ప్ర ణ య యా త్ర

వినుచునుందును విన్నది విననియట్లు
కనుచునుందును కన్నది కననియట్లు
స్వప్నగాథలవలె ప్రపంచములవోలె
చిత్రములు దేవి, నాబహిశ్చేష్టితములు!

సంతతమ్మును విమలతేజః ప్రశాంత
మోహనమ్మైన నీ ప్రేమమూర్తిలోన
అవ్యయానందమధుర రేఖాంచలములు
దిద్దుకొనుచుందు!

నా య ని

## క ల లో న నా యెం కి

లేపకే నాయెంకి, లేపకే నిదర!
ఈపాటినుకము నే నింతవర కెరగనే!

కలలోన నాయెంకి
కతలు సెప్తున్నాది,
వులికులికి పడుకుంట
వూకొట్టుతున్నాను!

లేపకే నాయెంకి, లేపకే నిదర!
ఈపాటిసుకము నే నింతవర కెరగనే!

కతలోని మనిసల్లె
కాసింతలో మారి,
కనికట్టుపనులతో
కత నడుపుతున్నాది!
లేపకే నాయెంకి, లేపకే నిదర!
ఈపాటిసుకము నే నింతవర కెరగనే!

రెక్కలతో పైకెగిరి
సుక్కల్లె దిగుతాది,
కొత్తనవ్వుల కులుకు
కొత్తమెరుపులతళుకు,
లేపకే నాయెంకి, లేపకే నిదర!
ఈపాటిసుకము నే నింతవర కెరగనే!

తెలివి రానీయకే,
కల కరిగిపోతాది!
ఒక్కనేనే నీకు
పెక్కునీవులు నాకు!
లేపకే నాయెంకి, లేపకే నిదర!
ఈపాటిసుకము నే నింతవర కెరగనే!

నండూరి

*

వత్సలాఫాలమున నెలవంకగుఱుతు
కందళించి వికాసించి కళలుదేఱి
తరుణశారదరాకాసుధాకరాచ్ఛ
బింబము లనంతములు లెక్కపెట్టుకొనెదు!

ఈయమర్త్యాచ్ఛచంద్రిక లెన్నినాళ్లు
నాతనువు ముంచుకొను, నన్నినాళ్లు ఒక్క
యీశరత్తేమి, నాది సదాశివత్వ
పదవి!

నాయని

బాష్పదౌత్యము

జీవనగంగాహారితతటంబునఁ
జింతావటతరుమూలమునన్,
ఏల యధోముఖివై గడతెంచెద
విబ్బ్రాధి యౌవననిశలన్ ?

ఆవలిగట్టున స్వప్నపురంబున
నవ్యయనిర్వృతి వనులన్
డోలాఖేలనరతుఁడౌ ప్రియునిఁ గ
డుంగడు భావనసల్పెదవో?
నీ వయసెల్ల హృదీశునిచింతన
నిర్గలధూపముపగిదిన్
గాలెడి నబలా రేయింబవళులు
గందముఁ జిమ్ముచు నల్గడలన్;
ధావమానశరదంబుదశకలపు
దాత్మ్యము న మ్మిటు వేచెదవే?
చాలు నిరీక్షణ, చాలిఁకఁ జింతన,
చాలురహస్యవియోగహతుల్ !
జీవనసంధ్యాపరిణత బాష్పస
చేతననీరవదూతికలన్
గాలపయోనిధిఁ బర్ణపుటంబులఁ
గదలింపుము ప్రియుకడకున్ !
హా, విధివశ్యతఁ జేరుదు రవ్వలి
యంబరచుంబితటంబున్;
బాలతపస్విని! యెపు డే వేళనొ
వల్లభుఁ డొసఁగును దర్శనమున్,
శ్రావణనీరదమాలిక లిరువురి
శయ్యాడోలిక లై యూఁగన్ !

రామిరెడ్డి

కు పి త వి ధి

పూలమాలిక నల్లినందుకు
కరకుకత్తులై కానుకాయెను,
తేనెసుధలను చల్లినందుకు
తేటిపోటులకాటులాయెను,
విరహావ్యథలు! విరహావ్యథలు!
ఓర్వలేని విరహావ్యథలు!
అగ్నిమండి గుండెలోన
ఆర దేమి చేతునే!

మలయపవనుడు పారిపోయె
మాధవీ! మృదుసౌరభము గొని;
విలువలేని చలువకాన్క
లిచ్చినాడుగదమ్మ నీకు!
గరళమగునో కట్టకడకు
మురళిసన్నిభగాన మగునో!
వేచియుండుము వేగపడకా!
కాచియుండుము మాలతీ!

ఈసులేనీలోక మేదో
ఎరిగి తెలియుము మాలతీ!
వెరపెరుంగనిలోక మేదో
వెదకి తెలియుము మాలతీ!

విశ్వసుందరమ్మ

## పల్లకీ!

ప్రాణసఖుడె నాకోసమై పంపినాడు
పల్లకీ అన హృదయమ్ము జల్లుమనియె;
వీడనివియోగమున వేగు మ్రోడుమేను
తలిరుతోరణమై సుమదామ మాయె!

చెదరుచేతుల నెటో కయినేసుకొంటి
మొయిలువసనమ్ములో ప్రొద్దుపొడుపునగలో,
ఏదో కాలుచుపోయియో, ఏదో తేల్చు
భారమో యేమొ సైరింపనేరనైతి!

కొసరునడల తూగాడుచు కూరుచుంటి
పూలపల్లకిలో పూలమాల నేను!
'ఓ' యనగ, 'నోహూంహూం' యన బోయవాండ్రు,
దారి బడినిల్చి చూచె నూరూరు నాడు!

‘ఓ’ యనగ ‘నోహాంహో’ యన బోయవాండ్రు,
వీటివెలువల మేల్కొనె తోట తెరువు!
‘ఓ’ యనగ ‘నోహాంహో’ యన బోయవాండ్రు,
తోటపాలిమేర కాలువ తొనకె నిదుర!

ప్రణయవల్లకి పల్లకీ! ప్రసవభర వ
నంతవల్లకి పల్లకీ! చక్రచాప
వక్రరేఖ వల్లకీ! మధుస్వప్నశాఖ
వల్లకీ!

కృష్ణశాస్త్రి

## కోయిల

కొమ్మలో కోయిలా ‘కో’ యంటదే!
రాగతనమో యేమొ బాగు వో గెరుగదే!
కొమ్మలో కోయిలా ‘కో’ యంటదే!

ఎంకి దూరానుండి
ఏటిదరి నే నుంటి,
సావాస మింకెవరు
సంద డెవరో నంటి,
కొమ్మలో కోయిలా ‘కో’ యంటదే!
రాగతనమో యేమొ బాగు వో గెరుగదే!
కొమ్మలో కోయిలా ‘కో’ యంటదే!

పూలెరుగు నా కోత
నీలెరుగు నా మోత,
మనుగడల కెవరితో
మనసుకలిపే దంటి,
కొమ్మలోకోయిలా 'కో' యంటదే,
రాగతనమో యేమొ బాగు వో గెరుగదే!
కొమ్మలోకోయిలా 'కో' యంటదే!

యేటి కడుపున దాగి
తోట నిదరోయింది,
ఆలనా నాసాదకు
పాలనా యనుకొంటి,
కొమ్మలోకోయిలా 'కో' యంటదే!
రాగతనమో యేమొ బాగు వో గెరుగదే!
కొమ్మలోకోయిలా 'కో' యంటదే!

తరిమి తరిమేశాను,
తిరిగి 'కో కో' యంది
ఆడిందె ఆటగా
పాడిందె పాటగా!
కొమ్మలోకోయిలా 'కో' యంటదే!
రాగతనమో యేమొ బాగు వో గెరుగదే!
కొమ్మలోకోయిలా 'కో' యంటదే!

నండూరి

## కత్తిపడవ

కాగితమ్మున పసినాడు కట్టి కత్తి
పడవ పాఱుడునీటిలో విడిచినావు,
పాలబుగ్గలపై నవ్వు తేలిపోవ
చిన్నిక్రేగంటిచూపుల నన్ను జూచి !

ఏను పసిబాలకుడను నిన్నేమఱించి
తోడిచెలికాండ్రు నవ్వులు తూరుపెత్త
తడిసి ముడుతలుపడిన యాపడవ నెటులొ
తెచ్చి నాపూవుటెద ప్రతిష్ఠించుకొంటి !

అంత కొన్నాళ్ళ కీవు నే, నచట నిచట,
గాలితరగల నీ నవ్వు తేలిరాదు,
నీసుధాపాంగరేఖలు నిలిచిపోవ
క్రుంగిపోయిన నాపేదగుండె నిపుడు...

కాగితమ్మది యినుమునకన్న నినుము,
ఆచిరుతకత్తిపడవున కంతులేదు,
అచట ప్రేమస్రవంతి యవ్యాహతముగ
కదలుచుండుట జేసి, నా బ్రదుకు నిలుచు !

కడకు నెత్తురుచెమ్మైన క్రమ్మకుండ
పచ్చిగాయమ్ము లవి యమబాధ, పడవ
కదిపితినిపొమ్ము లతులు కత్తు లచట
దిగబడునయన్న భీతిలో దిగులు నాకు!

నాయని

## నేటి రేయి

మ్రోయింపకోయ్ మురళి, మ్రోయింపకోయ్ కృష్ణ!
తీయ తేనియబరువు మోయలే దీబ్రతుకు,
మ్రోయింపకోయ్ మురళి, మ్రోయింపకోయ్ కృష్ణ!

మురళిపాటకు రగిలి మరుగు నీవెన్నెలలు,
సొగయు నాయెద కేల తగనిసౌఖ్యజ్వాల?
మ్రోయింపకోయ్ మురళి, మ్రోయింపకోయ్ కృష్ణ!
తీయ తేనియబరువు మోయలే దీబ్రతుకు,
మ్రోయింపకోయ్ మురళి, మ్రోయింపకోయ్ కృష్ణ!

కాలు చల్లదనాలా కనలు తీయదనాలా,
వలపుపిల్లనగ్రోవి పిలుపులో సొలపులో?
మ్రోయింపకోయ్ మురళి, మ్రోయింపకోయ్ కృష్ణ!
తీయ తేనియబరువు మోయలే దీబ్రతుకు,
మ్రోయింపకోయ్ మురళి, మ్రోయింపకోయ్ కృష్ణ!

వలదోయి, అలయు నీ కలలలో నిదురింతు
భరమోయి నీప్రేమవరమే నేటిరేయి!
మ్రోయింపకోయ్ మురళి, మ్రోయింపకోయ్ కృష్ణ!
తీయతేనియబరువు మోయలే దీబ్రతుకు,
మ్రోయింపకోయ్ మురళి, మ్రోయింపకోయ్ కృష్ణ!

కృష్ణశాస్త్రి

## మురళీధ్వని

మురళి ముద్దిడు నీ మోవిమురువు చూచి
తమము తెర జీల్చి ప్రకృతి చైతన్యమూనె;
స్వరము వెలువడినంత గోపాలకృష్ణ,
పులకరించె బృందావనపుణ్యభూమి!
గోవులను వీడి యరుదెంచె గోపజనము,
కుడుచులేగల విడి వచ్చె గోగణంబు,
పరుగు పరుగున నీ పాదపదము జేర
ప్రియుని విడనాడి వస్తి గోపీమనోజ్ఞ!
యమునలో జేరు వారిలేశమువిధాన
రాగమున నేకమైన స్వరమ్మురీతి
తన్మయత చెంది కల సమస్తమ్ము విడిచి
లీనమైపోతి నీ దివ్యగానసుధను!

శ్రీ

దొంగ

నల్లవాడే,

గొల్ల

పిల్లవాడే,

చెలియ,

కల్లగాదే వాని

వల్లొ జిక్కితినే !

వచ్చినాడే,

తోట

చొచ్చినాడే,

సకియ,

చొచ్చి నాడా మనసు

ముచ్చిలించాడే !

ఆగినాడే,

పొదల

దాగినాడే,

మనసు

రాగబంధము వేసి

లాగుకొన్నాడే !

చూచినాడే,
మోము
దాచినాడే,
నాదు
దాచుకొన్నా వలపు
దోచుకున్నాడే !

చేరినాడే
చెంత,
చీరినాడే
చేర,
కోరి చేరా బోవ
పారిపోయాడే !

పాడినాడే,
చనుచు
ఆడినాడే,
మదిని
చేడె, ఆతనిపాట
పిలుస్తున్నాడే !

ఊదినాడే
మురళి,
చేదినాడే
వలపు,

నాదుమది తనరూపు
పాదుకొలిపాడే !

చూడలేనే,
మమత
వీడలేనే,
వాని
జోడు కూడనిడుసురు
పీడిపోసివే !

నల్లవాడే,
గొల్ల
పిల్లవాడే,
చెలియ,
కల్లగాదే వాని
వల్లొ జిక్కితినే !

బసవరాజు

రాధ

మాసినచీరతో పొగడవ్రాకుల రెమ్మలనీడ
దీర్ఘనిశ్శ్వాసముల న్నిగిడ్చెదవు,
జంకక నీచెలి కోసితేర నీ దోసెడు
మొల్లమొగ్గలను దూసి, దళమ్ములు

కుప్పవెట్ట దేలే, సుకుమారి ! యింత నిను కేటికి
నీ యెలజవ్వనంబునన్ !

ఈసుకుమారపున్నిశల కృష్ణు డొసంగిన
పుష్యరాగపుంబూసలదండ రాపుడుల పూను
కుచాగ్రము లుష్ణబాష్పపున్ రాసుల
కందువారెదు, విరాగ మ దేటికి ? నిండు
ప్రాయపున్ మోసులవేళ నిట్టియిడుముల్ వడ
నిన్ను విరించి చేసెనే !

మోసముచేసి యెచ్చటికోపోయిన
మాధవుగూర్చి యింతగా వేసటచెంది
పుష్పవనవీధికలన్ వెదుకంగనేల,
నీ వేసగిపూలవెన్నెలలు ప్రేమ కనర్హములో ?
పికాంగనాభ్యాసితరాగముం బ్రణయ
పాత్రముకాదో వచింపు మిత్తరిన్.

చెల్లరే, యీమధూపవనసీమల
నావులగాచువానికై పల్లెలనుండి
నాగరకపద్ధతులేమొ యెఱుంగనట్టి
యీ గొల్లపడంతులెల్లరును కోరిన కోరికిగాక,
నీవు నా నల్లనివానినే వలచినావట !
యెంతటి సిగ్గుచేటోకో !

కోడాలి

## అ న్వే ష ణ ము

"తలిరాకు జొంపముల సం
దులత్రోవల నేలవాలు తుహినకిరణకో
మలరేఖవా ! పువుదీవవా !
వెలఁదీ, యెవ్వతెవు నీపవిటపీవనిలోన్ !

కారుమొయిళ్లు కాటుకపొగల్ వెలిగ్రక్కు
తమాలవాటి నేదారియుఁ గానరాదు,
నెలఁతా ! యెటువోయెద వర్ధరాత్రి ?
విస్ఫారవిలోచనాంధతమసమ్ములఁ జిమ్ముచు,
వేడివేడి నిట్టూరుపులన్ నిశీథపవ
నో ర్మివితానము మేలుకొల్పుచున్"

"అది శరద్రాత్రి; శీతచంద్రాతపాంత
రాళ రమణీయరజతతల్పంబునందుఁ
జల్లఁగా నిద్రవోవు వ్రేపల్లెవాడ
సకలగోపాలగోపికాగణముతోడ.

సాముసడలిన పతి పరిష్వంగమందు
సుఖము దుఃఖము లేని సుషుప్తిలోన
స్వప్నవీథియథేష్టసంచారకలన
మేనుమఱచిన నన్నంత మేలుకొలిపె
శర్వరీశీతపవనహర్షముల మలసి
స్వాదుయమునోర్మిసంగీతఝురులఁ గలిసి
కౌముదీధౌత శుభ్రదిక్తటుల సొలసి
మురళికామందమందమాధురుల రుచులు.

ఎలఁదేటిచిఱుపాట సెలయేటికెరటాలఁ
బడిపోవు విరికన్నెవలపువోలె,
తీయని మల్లెపూదేనెసోనలపైని
తూగాడు తలిరాకుదోనెవోలె,
తొలిపొద్దుతెమ్మెరత్రోవలోఁ బయనమై
పరువెత్తు కోయిలపాటవోలె,
వెల్లువలై పారు వెలఁదివెన్నెలలోన
మునిఁగిపోయిన మబ్బుతునుకవోలె,
చిఱుతతొలకరివానగాఁ, జిన్నిసోనగఁ
బొంగి పొరలెడు కాల్వగా, నింగి కెగయు
కడలిగాఁ బిల్లగ్రోవిని వెడలు వింత
తీయఁదనముల లీనమైపోయె నెడద!

పరువు పరువునఁ బోవు నెదతో
పరువులెత్తితి, మఱచి మేనే,
మఱచి సర్వము, నన్ను నేనే
మఱచి నడిరేయిన్ !"

"ప్రాణనాయకు కౌఁగిలిపట్టు వదలి
యిల్లు వదలి యెన్నండు నీపల్లె వదలి
యడుగిడనిదాన వానాటియర్ధరాత్రి
విజనపథములఁబడి యెట్లు వెడలినావు ?"

"తావులతోడఁ దేనియలధారలఁ జిప్పిలు
వేణుగీతికారావముతోడ మందగతులన్
జను మారుతముల్ విశాలబృందావనవీథులందు
యమునానవభంగమృదంగవాద్యముల్
త్రోవ స్ఫురింపఁగా వలపు తొందరవెట్టఁగఁ
బోతి నొంటిమై !

సన్ననియెల్గెత్తి జాలిగా నెవరినో
యరయుమా, పిలుచుచున్నదియె యమున !
ప్రక్క నిర్జీవధావళ్యమ్ముతో నున్న
సికతాతలమ్ముఁ గాంచితివె, దాని!
తుదిమొదల్ లేదిదే త్రోవరుల్ త్రొక్కని
యీదారినే పరువెత్తినాను,

ఈమొండిచేతుల నెత్తి యీవనతరుల్
శూన్యదృక్కుల దిశల్ చూచు నయ్యో!
ఇచటనే... యిచట... అతఁ... డిచట, నేను...
ఇచట, నీజాజిపూబోదరింట నేను...
ఈ కడిమిచెట్టుక్రిందసుమ్మీ యతండు...
సరిగఁ గన్నులఁగట్టినసరణిఁ దోచు!

శారదశర్వరీమధురచంద్రిక
సూర్యసుతా స్రవంతికాచారువినీలవీచిక
ప్రశాంత నిశాపవనోర్మిమాలికాచాలిత
నీపశాఖిక కృశాంగిని గోపిక నేను, నాఁడు
బృందారమణీయసీమ వినినారము
మోహనవేణుగానమున్!

మలయపవనుకౌఁగిలిలోనె పులకరించి
హాయిగాఁ గంఠమెత్తు ప్రాయంపువంశి
విశ్వమోహను జిలిబిలిపెదవు లంటి
యవశమైపోయి యేమి చేయంగలేదు!

బాలగోపాలుఁబోలెడు పాటగానిఁ
గని విని యెఱుంగ మెన్నండు; కరములోని
మురళినేకాదు, నాలోని మోడుటెడఁద,
నీశిథిలజీవనమ్ము మ్రోయింపఁగలఁడు.

నందగోపకుమారు నానందమురళి
కా మనోహర సుషిరాపగాతరంగ
జాలములఁ దారకా రవి చంద్రతతులు
కరఁగి చిని చిన్నిగీతులై కలిసిపోవు !

చూచితివా లేదా చిన్నికృష్ణునిసొబంగు !
పెదవిచివురుసంజల నరవిచ్చు నవ్వు
వెన్నెల, చలించు తుమ్మెదబెళుకుచూపు,
లోలపవనచాలిత కుటిలాలకమ్ము,
తరళచూడాకలాపమ్ము, మురళిఁ గూడి
యల్లనల్లన గొంతెత్తి యమృతగాన
శీతలతుషారముల విరజిమ్ము వేళఁ
జిన్నికృష్ణునిసొబఁగుఁ జూచితివా లేదా !

లేవు శరత్తమస్వినులు, లేవు మనోజ్ఞసుధాంశు
మాలికల్, లేవు వినీల నిర్మలకళిందసుతా
నవనాట్యసంపదల్, లేవు మదీయగాత్రలవలిం
బులకాంకురకోరకావళుల్, లేవు
కుమారగోపమురళీమృదుగీతఝురీ
విలాసముల్ !

జిలిబిలిపట్టుతేకులవెన్కఁ దొట్రిలు
మల్లియయెద దాగు మధుపరవము,
కనుచూపు దాటు నామనిఁ బాయు కోయిల
గొంతులోఁ జిక్కు వసంతగీతి,
విభు వీడి శుష్కించువిరహిణి సెలయేటి
కడుపులో నడఁగిన కడలిమ్రోత,
తేనిక్కై వెదకెడు తిక్కచూపులలోనఁ
జారవడ్డ నిండుచందురుని పాట
యిట్లు నీదీనగోపికాహృదయమంది
రాంతరాళములోనఁ ద్రుల్లింతలాడు
వేణునాదంబు వినిపించు విశ్వమోహ
నాకృతిఁ గిశోరగాయకు నరయుచుంటి!

ఇది నాచరితము, విని, నీ
వదరెదు, తొట్రిలెదు, వడఁకు, దటునిటు కనులన్
జెదరెడుచూపుల నేదో
వెదకెదు, ఎవ్వతెవు నీపవిటపీవనిలోన్?

కృష్ణశాస్త్రి

## మ ని షి

మనిషి చేసిన రాయిరప్పకి
మహిమ కల దని సాగి మొక్కుతు
మనుషు లుంటే రాయి రప్పల
కన్న కనిష్టం
గాను చూస్తా వేల? బేలా,
దేవు డెకడో దాగె నంటూ
కొండ కోనలు వెతుకులాడే
వేలా?

కన్ను తెరిచిన కానబడడో,
మనిషిమాత్రుడియందు లేడో?
యెరిగి కోరిన కరిగి యీడో
ముక్తి!

గురజాడ

## కూలియన్నలకౌతుకము

మొగములను ముచ్చెమట లూడ్చుచు
మూపులను పెనుమోకు లీడ్చుచు
మడమలెత్తున మన్ను రేఁచుచు,
గుండ్ల పేరూ కులుకుపాటేమో ?
ఏమో !
పాలిండ్లఁబగడవుగుండ్లపేరేమో !

ఇనుపబరువుల 'నిస్సి' యనుచును
వెచ్చనన్నువువేళఁ గనుచును
మెట్టనడ కుట్టుసుఖు గొనుచును,
కాళ్ల కడియాల్ కలికి నుడి యేమో !
ఏమో !
కడియములనడి బిడియపడుటేమో !

నడలుఁనడికట్టాడియ నెట్టుచు
వీడుసిగముడి వ్రేళ్లఁ బెనచుచు
అలసటలూవో నడుగు నాపుచు,
వలపుఁ జిమ్మెడు పదముగలుపేమో ?
ఏమో ?
పదముకడ పొదరింటినిలుపేమో ?

ఎదుట కుర్రది యేద లేదు
మోహాపడుటకుప్రొద్దు కాదు,
మఱుఁగువెట్టగ మఱపురాదు
కూలియన్నల కుతుక మది యేమో?
ఏమో!
ఖాళి తలపని పెరిమ యది యేమో?

కవికొండల

మైనారిటీవెళ్లిన రోజున

తల్లికడుపును వెడలు టాదిగ
చల్లనాశలపులు తలంచుచు
వెళ్లబుచ్చితి నిన్నిదినములు
పిల్లవాడనుగా!

మేలిబంగరు శృంఖలంబులు,
పూలతోటయె బందిఖానా,
పాలకులు నామిత్రవర్యులు
మేలుకూర్చితిని!

నిండుటామని గంతులిడితిని,
మందుటెండలు తేః మొసగెను,
పండువెన్నెల మేను మఱచితి
నిండుహర్షమున!

సలిలధారల దృప్తిచెందితి,
అలసపవనుఁడు సుఖము నింపెను,
ప్రలయసూచన బోయె మదిలో
మలిన మది యెల్లన్ !

లోకసంస్కృతి కలదో లేదో
యే క్రమంబున మెలగుచుంటినో
లోకు లేమని తలచుచుండిరో
నాకు లే దెఱుక !

భేద మొందదు నాస్వభావము
ఈ దినారంభంబునుండియు,
ఈ దరిద్రపుజగముదృష్టిసి
భేదమైపోతిన్ !

నో ౧

## వార్త

ఉత్తరాలాసంచి నెత్తి పెట్టుకవచ్చు
కూలివానీచేతి సూదిబల్లెపు టులివు
మాటుమ్రోయానేల నాదు నెదలో !
దారిగలిసిన వాని పఱుగులో నానడక
తాఱుమాఱై త్వరన్ దలఁపనేల ?

ఉత్తరాలాబరువు నొవ్వఁజెప్పుట లేందె
తత్తఱింపఁగనేటి కూర్పుతిత్తి?
చిత్ర మిాఱవనము, చిన్నియుత్తర మేదో
ఎవనికేన్ గొనిపోవునేమొ! ఏమొ?

కవికొండల

## భవతి భిక్షాందేహి!

నోటినిండ భుజింపఁగ నోఁచినొనము
ఉదయగీతుల పాడ నోపెదము కాని,
కన్నతల్లులప్రేమమార్గమ్ముఁ గనము
లలితగతి వీణ వాయింపఁగలముగాని,
తొడిమ లెడసేయఁగా రాలిపడినపూల
వలపు లేవి! భిక్షాం దేహి భవతి! భవతి!

స్వాదుకృష్ణానదీజలస్నానములను
పులక లొలయఁగ వినయాంజలులు ఘటించి
నవ్యగీతాశుభాధ్యయనమ్ముఁ జేయు
సోదరకుమారకు లెదురునూచుచుంద్రు,
తడవునేయక మాతృవాత్సల్య మింత
తిరుగుబిడ్డల కి మ్మింక, మరలి యరుగ
వలయుఁ దల్లి! భిక్షాందేహి భవతి! భవతి!

అబ్బూరి

## చిన్ని మబ్బులు

కన్నె కాటుకకళ్లు
చిన్ని నాథుని చూచి
కదలులాడిన వేళ
కందళించిన వేళ
ఆకాశమధ్యాన అటనొక్క తెలిమబ్బు
మెరపులా మెరిసిందిలే!
వెలుగులో వొరిసిందిలే!

తొలి చిన్నిచూలాలు
కొలసిగ్గు ప్రేమతో
విభుని చూచినవేళ
విన్నబోయిన వేళ
బఱివు మిన్నులలోన ఒక నీలితెరమబ్బు
నంజలో తారిందిలే!
జాలుగా మారిందిలే!

తొలికాన్పు పసిపాప
సాకనేరని బాల
తెలవోయి పతిజూచి
కళవళించినవేళ

తూరుపుకోనలో తొంగిలించినమబ్బు
తెగ పరుగులెత్తిందిలే!
సొగసుల్లుపోయిందిలే!

విశ్వనాథ

*

వలపునిండార విరిసిన పారిజాత
కుసుమములు నేల రాలు వేకువలయందు
ప్రసవశయ్యాపథముల నీ పాదయుగళి
కదలెనో, నాదుహృదయమే కలతపడెనొ?

కాని, పలుమారు నా కందరానివస్తు
వేదియో దూరముననుండి వెలుగులెత్తు,
పరిమళపరీతమైననీప్రణయవార్త
భూనభోంతరాళమ్ములు పులకరింప!

బహుళమందారగంధలోభమున దిరుగు
మధుకరమువోలె హృదయ మున్మత్తమయ్యె,
పరవశమ్మైన భావప్రపంచమందు
బందినై యెన్నినాళ్లుండవలెనో యేమొ?

దీపికలులేనివాకిళ్లు తెఱచి నాదు
తలఁపు లొక్కొక్కచో నిన్ను దరియఁబోయి
తిరిగివచ్చుచునుండు, పందిళుల క్రింద
కేళిఁ దిరుగాడు పెండ్లిచుట్టాలరీతి!

అబ్బూరి

స్వాగతము

వెన్నెలతీవచాలునకు వెన్కగ నేలకు డిగ్గివచ్చి
యీచిన్నరిమబ్బు క్రొమ్మెఱుగుచేడియతో
విహరించుచుండె, మాపొన్నలు పూతవట్టు,
నిక పొంతపొలాలకు నీర మెక్కెడిన్,
మొన్నటిదాక వానలకు మోములు వాచిరి
మాదు కర్షకుల్.

నెఱియలువడ్డ మా పొలమునిండను తుంగలు
తుమ్మదుబ్బులున్ పెరిగెను, దుక్కికె
ద్దడుగుపెట్టగజాలని మాపొలాలలో నురుమద
శైవపాదకటకోజ్జ్వలనాదమనోహరంబుగా
నుఱిమిన, నీ కొసంగెద నుపాయనముల్
నవబాష్పబిందువుల్ !

కూరలపాదులెల్ల పురుగుల్ మొదలంటగ
నాకిపోయె, మాకోరడివెంబడిన్ తలలు
కొంచెముగా పయికెత్తు మొక్కలున్ తీరెను,
నీ నినాదమున తేరుకొనెన్ పసరాకువేసి
సింగారము లొల్కెడున్ నిగనిగల్
వెలయించుచునున్న వో ప్రభూ!

అందపువానచిన్కు పడెనన్నది చా లని
ప్రాతవి త్తనాలుం దగ దెచ్చి మాపెరటిలోవల
నాటిన కూరపాదులున్ పందిరి కెక్క్ నిమ్ము,
తొలివర్షపుచిన్కులు చిన్కి దొడ్డిలో
నందన మూడి వచ్చివడెనా! యనిపింపుము
సత్కృపానిధీ!

పొడి పొడియై తలల్ ముదిరిపోయిన
యెట్టని కారుజొన్నలో పడి తిని కొత్తలో
వసరుటుంగిడి తాకిన యావుదూడలున్
తడబడిపోయె, మా యెడద తల్లడిలెన్,
తొలివానచిన్కు పైబడి సుఖమయ్యె, నేటి
కనపాయత నొందెను మాదు సస్యముల్!

గొంటరి పీవు, మామదురుగోడను వ్రాలిన
రావితొట్టిలో పెంటియు తాను నొంటి
విలపించుచున్నది పావురాయి, నీవెంటనె
చూచుచున్ గడపె వేసవి యంతయు, నీవు వచ్చి
మాపంటలతోడిపాటుగ కృపామతి, దానికి
దప్పితీర్పవే!

ఒప్పులకుప్ప మాచిఱుంత
యూచినగొంతున వాన వానవల్లప్పలు
తిర్గుచున్ చదికిలంబడు, కన్నులు వ్యాప్తమై
కనున్ కప్పునువల్లె కుచ్చెలుల కాళ్ళకు
నృత్యము నేయ పెద్దనవ్వొప్పగ వచ్చి నాపదము
లూరక కౌగిట పూను గట్టిగా!

పొలములవట్టి నీరములు బోదెల నిండవు,
నాకుమళ్ళలో చెలమల నీరుతోడి యరచేతులు
బొబ్బలు పొక్కె, బోదెలోపలి జలమందు
పిచ్చుకలు పాపము ముక్కులు ముంచుచుండె,
నీవిలయము దాటిపోయె ననిపించెను
నీయురుముల్, కృపానిధీ!

నీకృపచేత రేపటికి నీరము లెక్కును
మాపొలాలకున్, తేకువ నాటులై
కలుపుతీయనిమళ్ళను నమ్మపూలు, కాజాకులు,
కాజపూలు, తఱుచై కలుపేరెడు మాలపిల్లలున్
శ్రీకలకంఠగీతికలచే పులకింపగచేతు
రో ప్రభూ!

ఒదిగినబోదెకాలువలు నుచ్చెను, మోటయు
తోడ, కంబుసంపదగల వంగచాలులకుమధ్యగ
వేసిన గోగుమొక్కలల్లదె కొన సాగి
యే నెలకో యందును కోతకు, కందపిల్లలున్
ప్రిదిలిననేలపై బయలుపెట్టును పొమ్ము
త లాకుపొట్లముల్ !

పిలపిల తేనెలై పికిలిపిట్టలయీలలు
నీకు స్వాగతమ్ము లొసగు, పైడిగంటగళమున్
శ్రుతిచేసి నుతించు వానకోయిల, కడుదీనమౌ
కనుల నెప్పుడు నీ వరుదెంతువంచు నీవలనుకై
చూచుబెగ్గురులు బంతులుతీరిచి
నిన్ను గొల్చెదున్ !

నీ వరుదెంతు వంచును ధ్వనించెను
చల్లనిగాలి పోకుచున్, నీవలిచిన్కు పడ్డయవనీస్థలి
కమ్మనితావి చిమ్మెదున్, నీవప్రశీతలాకృతివి,
నీ వొకరుండవె సేద్యగాండ్రకున్
కావలికాచుదైవమవు కష్టములన్
గడతేర్చువాడవున్ !

దొంతులు తెచ్చి కానికలతో నెదురౌదుము
బంతిపూలు, చేమంతులు, చంద్రకాంతములు,
మంకెనపూవులు, పోకబంతులున్, వింతల
గన్నెరుల్,హృదయవీథుల మాయెడ విశ్రమింపు
మా చింతలతోవులో విడిదిచేయుము
శ్రావణమాసవేళలన్ !
నీలాంభోధరకాంతిపుంజములు నిండెన్,
ప్రాక్ప్రతీచీదిశాలోలాభ్యంతరవీథికావళుల
నాలో గోపికాశ్రేణి లీలాలాస్యంబును సేయు,
నాదము శ్రవోలంకారమయ్యెన్, మయూరీ
లోలచ్ఛవిపింఛసంచితకళారింఛోళి
సంఛన్నమై !

విశ్వనాథ

## మంగళాచరణము

ప్రొద్దుపొడుపునోములు నోమఁ బూనినావొ
చిట్టిబొట్టు కుంకుమఁ బెట్టు చిన్నదాన,
ధవళకీర్తిదుకూల సుందరములైన
యూసలు పిఱుందులంటు సోయగ మదేమొ !
శ్రవణపాళికాజ్వారబంధురమ్ము లయిన
రణరణన్మంజుమంజీరరభస మేల ?

కడల నెల్ల నాకర్షించి కనులు గుట్టు
తెనుఁగుమీరిన గరువంపుఁదీరు లేల ?
క్రాలుగనులఁ గాటుకనిగారంపుఁబసల
మోహపెట్టుచునున్నావు ముగ్ధజనుల,
చిన్నతనపు సింగారంపుఁజెయిదిసిరుల
వలచి వలపించుచున్నావు పడుచువాండ్ర,
పరమవాత్సల్యదృష్టులు మరులు గొలుపఁ
బ్రేమకవితాంధ్యులై రెల్ల పెద్దవారు,
ఏమిటికి నీయుదయకేళి యిగురుఁబోడి !
గిలుకుటొడ్డాణ మింత బిగించితేల ?
కంఠమాలలు జీరాడఁ గట్టితేల ?
ఆరి యారని యార్ద్ర నీలాలకములు
మెడలఁ బొరలాడఁ బాయలు ముడువవేల ?
నగవుపూదండ లెట్టికాన్కలు కుమారి ?
ఎచటి కేఁగెదు ? నోము పేరేమి చెపుమ ?
ఎవ రధిష్ఠానదైవము ! వృత్త మెద్ది ?
సాంగపూజావిధాన మేభంగి జరుగు ?
తగు నుపాయన మేది ? తత్ఫలము లెవ్వి ?
సువ్రతోద్వాహపరిపూర్ణశుభము లేవో ?
తీయని తెనుంగుమాటలఁ దెలుపఁగలవో !
కన్నెవాడో తెనుఁగునాటిచిన్నదాన !

అభము శుభము నెఱుంగని యబలవయ్యు
నదరు బెదరు లే కీవ్రత మందికొంటి
నేర్పరివిఁ బోలె, కన్నెవు తీర్పఁగలవె?
సందియముమాన్ప రావమ్మ, చక్కనమ్మ!

రాయప్రోలు

## పెండ్లికూతురు

కనుగవ దల్లిగా రిడిన కాటుక రేకల
బ్రేమవల్లికల్ బెనచి, త్రపాప్రసూన
మధులేశములన్ మిళితంబులైన వీక్షణముల
నిన్నొరుల్ గనని చందమునన్ వరు గాంచు నీకు,
యౌవనమధుమాసయామినులు ప్రాప్తము
లయ్యెడుగాక, శీఘ్రమే!

త్వాదృశబాలికల్, తలుపుదగ్గర
బాటలువాడు పెద్దముత్తైదులు, భర్తపే
రడిగినప్పుడు తీగయొలుంగు ముగ్ధతన్
బేదవడంగ, 'వంతు మన పెండ్లికుమారుని' దన్న
నీదు లజ్జాదరహాసచంద్రికలు శాశ్వతమై
వెదజల్లుగావుతన్!

పగడపుమోవికెంపులకు బైటయి
దాగుడుమూతలాడు లేనగవు గులాబిపూ
సరమునన్ విరిమల్లెలు దాపినట్లు దోఁపగ
బతియుత్తరీయమధుపర్కము గేల గ్రహించి
వెంట జంటగ జను నమ్రభావము లనారతమున్
నిను బాయకుండుతన్ !

పునుగు జవాది తావులు గుబుల్కొను
నీ పసుపుంబయంటకొంగున ముడివై చికొంటిగద
కోమలి, నీమగ డింక నెట్లు చెప్పిన నటులే
వినంగలడు, పెండ్లము గీచినగీటు దాట
డంచును వదినల్ నగన్, జురుకుచూపుల
జూచెదు నీకు సౌఖ్యమా !

వేసంగిసందెల విరిమల్లెపూలు
పరచిన ముత్యాలపాలకీలోన
నూరేగునాటి నీ యుత్సాహదివ్య
మధురదృశ్యంబులు మరతుమే మేము,
చుక్కలరథములో నెక్కి వేంచేయు
ఒక చందమామ మా కున్నంతవరకు !

కౌ డా లి

## నా గు ల చ వి తి

నీపుట్టదరికి నాపాప లొచ్చేరు,
పాపపుణ్యమ్ములవాసనే లేని
బ్రహ్మస్వరూపులౌ పసికూనలోయి!
కోపించి బుస్సలు కొట్టబోకోయి!
నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రీ!

చీకటిలోన నీ శిరసు తొక్కేము,
కసిదీర మమ్మల్ని కాటెయ్యబోకు,
కోవపుట్టాలోని కోడెనాగన్న
పగలు సాధించి మాప్రాణాలు దీకు!
నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రీ!

అర్ధరాతిరివేళ అపరాత్రివేళ
పాపమే మెఱగని పసులు తిరిగేని,
ధరణికి జీవనాధారాలు సుమ్మ!
వాటిని రోషాన కాటేయబోకు!
నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము, తండ్రీ!

అటుకొండ యిటుకొండ ఆరెంటినడుమ
నాగుల్లకొండలో నాట్య మాడేటి
దివ్యసుందరనాగ! దేహీ యన్నాము,
కనిపెట్టి మమ్మెపుడు కాపాడవోయి!
నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

పగలనక రేయనక పనిపాటులందు
మునిగి తేలేటి నా మోహాల బరిణె
కంచెలూ కంపలూ గడిచేటి వేళ
కంపచాటుననుండి కొంప దీకోయి!
నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

బసవరాజు

## మాగనోము

బియ్యపుగింజలన్ చిగురు పేడినగందపు
పచ్చిబొట్టుతో తియ్యని చిన్ని నీనొసలితీరులు
కుంకుమ తీర్చి ముంగిలన్ తొయ్యాలి,
నోముచారికలతో పసపాడిన ముద్దరాలు
నీపయ్యెద వ్రాల నీవు నతి పట్టిన దీవన
లీయఁ జూచెదున్!

నీ తెలిపట్టుచీర మెయినీడలు పారి
ముసుంగుసంజ క్రొంబూతల తెల్లలే మొగిలుపోలిక
వాలిక గాలిఁ దూలిపో నేత బెడంగుకుచ్చెలలు
నీ చిఱుకాళుల ముద్దు తోఁచెనో,
లేతపా రాడువయ్యెఁ చలించిన
పచ్చని తాళి తోఁచెనో!

దూసిననాగమల్లికల దోసిళులన్
తొలిజాముప్రొద్దు తా మూసినకంటిమూత
తెరువుళ్లయినట్టివి మందహాసికన్యాసిత
ఫుల్లగల్లపరిణామము లచ్చపవళ్లు శారదశ్రీ
సముపేతముల్ పులకరించెను
నీ మెడగందపూతలన్!

కమ్మనిపాలబుగ్గవవుగా! పతికోసమ
యిన్నినోములన్ కిమ్మనకుండ నోచెదవు, కేవల
మాతని నీ యెడంద క్రొందమ్మిపువ్వుం
దుమారములు దమ్మిన చిక్కని తేనెపాలలో
చెమ్మలయూటలన్ మెదపి చేతువా
నెయ్యపుతియ్యముద్దగా!

ఓసి, మనోజ్ఞనీరదనవోదయకాల
వియద్విలంబమానాసితవారివాహనివ
హానతకైశిక! మూగనోములో కోసలు తేరు

కన్తుదల కూడిన భాగ్యపుబొట్టుజీరలో
మాసరమయ్యె నీ యెడదమాగిన నెయ్యపు
తియ్యదొంతరల్ !

పైదలిచాలులో వ్రతముపట్టిన
నీకును తా వొసంగుముత్తైదులకాళ్ళ
వంగఁబడి తాకక కన్నుల నద్దువేళ నీమీద
సరాగమాడ, పసిమీగడచూపులు, నవ్వుపూలు,
భావోదయమున్ పొనర్చియు, తలోదరి,
నీవ్రతరక్ష చేసెడున్ !

కొనలకు నూనె రాచి కొనగోళుల
దువ్విన, కొండె చుట్టిన, వదులైన క్రొంజడ
ఘటించిన యెర్రనిపోకబంతితో నిను నెదురైన
కుంకుమపునీటులు గుల్లైదు మోముకన్నె
నేమని నుతియింతు ప్రాతరమృతాకృతిఁ
గార్యఫలోన్ముఖత్వమున్ !

వినయమునేర్చుకోఁ జదువబెట్టిరి,
మైదువలైనవారిదర్శనసుకృతంబు నిత్యపరిసంగతి
తెచ్చిరి, యింతనుండి మాటనియమ
మభ్యసింపఁ గవటాకును ని న్నియమించి,
రీవు తెచ్చిన పతిశీలతాధికతచేఁ దెలుగుల్
పరిపూతు లౌటకున్ !

నీ నడయాడుత్రోవలు పునీతములైనవి,
నీ దృగంతరేఖానతవాయువీచిక
లనంతసుధాపరిషేచనక్రియాస్థానములైన
వోసి పసిదాన, భవన్నియమప్రభావ
సంధానముచేత నీ పతి సుధామయమూర్తి
సముజ్జ్వలించెడున్ !

విశ్వనాథ

మా తల్లి

తల్లిపాల్ద్రావకుండ బందాలఁ బడిన
వత్సములు లాగులాడెడుఁ బాలకోఱకు,
ఆలకొట్టాలపెండెము లవల నెట్టి
మెడలవేసిన పలుపులు విడువరమ్మ,
తల్లిపాలు ద్రావిన మహోత్సాహపూర్తిఁ
బెనఁగి చెల్లాటలాడెడు పెంపుమిగుల
నిరుగుపొరుగులేఁగల క్రీడ లరయరమ్మ !
బువ్వదుత్తనెత్తిని బెట్టి నవ్వుకనుల
అవికఁదోడుగని గొల్లకుఱ్ఱది యొకర్తు
పోవుచున్నది పొందైన ముద్దునడల,

కలికి యొడిసెల వలెవాటుగాఁగఁ దాల్చి
పిఱుఁదు లసియాడఁ జీరరాపిల్లతోడఁ
గాఁపుఁగూఁతురు పొలములు గాయ నేఁగు,
చిన్నిబంగారుపూసల చెండ్లవంటి
జొన్నకంకులు పండిన సొగసుచేల
ఎక్కడెక్కడనుండియో చక్కవచ్చి
వ్రాలుచున్నవి పిట్టలు రక్తి బెరయ,
లేచిరావమ్మ మాతల్లి లేచిరమ్మ!

రాయప్రోలు

## గంగిరెద్దు

ప్రభువుగారికీ దణ్ణం పెట్టూ
పాదం వచ్చీ భక్తిని పెట్టూ,
పట్టుశాలువలు కప్పెదరంటా
కానులు మువ్వలు కట్టెదరంటా
డూ డూ డూ డూ యెంకన్నా!

మోనముచేసును మునసబుగారు
కతుల కట్టును కరణంగారు
కలిమి కలిగినా కాపులు వీరు
డూ డూ డూ డూ యెంకన్నా!

కుంచెడుమాయ కోమటిమాట
పత్రికాయరా భేమ్మణధాటి
సలాము తెచ్చే సాయెబు భేటీ
డూ డూ డూ డూ యెంకన్నా!

చెన్నపట్టణం చేరువరాదు
కాశీపట్టం కానగపోదూ
కాపవరమే కదలాలేదూ
డూ డూ డూ డూ యెంకన్నా!

చెట్టు కదిలిన పుట్ట పొదలదూ
నీరు పోయినా నాచు కదలదూ
గుడి పాడయినా గూబ వదలదూ
గుడిపొలాల పూజారి వదలదూ
డూ డూ డూ డూ యెంకన్నా!

యేడుకొండలా యీశ్వరుడండీ
యెండికొండలా యెంకన్నండీ
భమిడికొమ్ములా బసవయ్యండీ
డూ డూ డూ డూ యెంకన్నా!

బా పి రా జు

## వాల్మీకి

వాల్మీకికవిచక్రవర్తి నీ వెవరు,
సరసకవితాలతాశాఖలం దుండి
యామనికోయిలయట్లు గూసెదవు ?
ఎచ్చోటఁ బుట్టితి, వేడ పెరిగితివి ?
యేతల్లిచనుఁబాల నింతమహిమంబుఁ
గాంచితో చెప్పుమ కవిసార్వభౌమ !
నింగిని భేదించు నీమహాసృష్టి
యెదుట నీచారిత్ర మెం దడఁగిపోయె ?
గంగానదీశీతగర్భంబునందు
నిదురించుచున్నదా నీ చరిత్రంబు ?
అభ్రంకషహిమాచలాంతరకటక
గంభీరగహ్వరాగాధశూన్యమున
మాఱుమ్రోసెడునె నీమహనీయవాణి ?
ఓయాదికవిరాజ ! ఓదివ్యవాగ్మి !
యెన్నియేండ్లును బూండ్లు నేఁగెనో కాని
మున్ను హిమాలయమోహనాటవుల
నీవు మీటిన కావ్యనిర్ణిద్రవీణ
నేఁటికి వినఁబడు నిఖిలదేశముల !

భావకిరణంబులు పడుగు పేకలుగ
నీ వల్లినట్టి రమణీయదృశ్యంబు,
బంగారుస్వప్నంబు, ప్రజల నెల్లపుడు
నానందరసవార్ధియందుఁ దేలించు !
నీచేయి సోకిన నిముసంబునందె
బంకమన్నైన రూపముఁదాల్చి నిలుచు !
ఈయింద్రజాలంబు నేడ నేర్చితివి,
యీశిల్పనైపుణ్య మెటు లలవడియె ?
ప్రకృతిభాండారంపుద్వారంబు దెఱచి
గుప్తరత్నంబులఁ గొల్లగొట్టితివి !
యాకాశమునఁ గల యన్నితారకలు
కడలిగర్భమునందు గల జీవమణులు
సరితూఁగలేవు నీసౌభాగ్యమునకు !
భావవారిధిఁ బూలపడవ నడిపించి
ముత్యాలరేవులో మునిఁగి యడుగంటి
పలురంగుమణులను వల లీడ్చి తెచ్చి,
నవ్యమా కావ్యమండన మొం డొనర్చి
విశ్వసాహిత్యంబు వెలిగించినావు !

*　　　*　　　*

రామిరెడ్డి

గుత్తునా యని జాతిముత్యాల్
గుచ్చినాఁడే మేలిసరముల,
ఇత్తునా యని తెలుఁగుఁదల్లికి
ఇచ్చినాఁడే భక్తితో!

నవవసంతము, నవ్యవసరము,
మావికొమ్మల గమ్మచివురులు,
పాటపాడెడి పరభృతంబును
ఎవ్వ రాపుదురో?

పొడుపుమలపై రంగవల్లిక
మింటినదుమఁ బ్రచండతేజము
సంజమబ్బులపైని కెంపులు
చూడకుంటిరిగా!

రంగవల్లిక మాయమయ్యెను
చండతేజము మాసిపోయెను
సందెకెంపులు సాగిపోయెను
వెదకుచున్నారా!

కారుచీఁకటి గ్రమ్మినప్పుడె
చదలమబ్బులు కప్పినప్పుడె
మిణుఁగురైనను మెఱయనప్పుడె
వెదకుచున్నారా!

చుక్కలన్నియు సొక్కి సోలెను,
గిరులు కదలెను, దిరుగఁ బాడెను
లోకమోహనమధురగానా
స్వాదమోదమున!

యుగయుగంబులనుండి మ్రోఁగెడు
విశ్వగానవియత్తరంగిణి
భంగముల నుప్పొంగు నాతని
గీతశీకరముల్!

పాటపాడిన పరభృతంబును
మూఁగవోయిన ముద్దుకోయిలఁ,
జిన్నిపికములు చిఱుతపాటలఁ
బిలుచుచున్నవియా!

కృష్ణశాస్త్రి

## రామలింగారెడ్డి

పిండీపిండని పాఁడియాఁబాఁదుఁగులన్
బింబింపఁ గాదంబినీకాండం, బుర్వర
పచ్చకోకలను సింగారింప నీవేళఁ బూదండల్
దక్కను ద్వారబంధముల సంధానించి,
ప్రమోదయాఖండస్వాగత మిత్తు రాంధ్రు
లనురాగస్ఫూర్తి రెడ్డ్యగ్రణీ!

ఆజిన్ మార్మోఁగమీఁక, దిగ్విజయకన్యా
కంచుకంబా కుసుంబా జెండా నెగఁగట్టి,
వాఙ్మయసరోమాధ్వీపిపాసారతిన్
మోజుల్ మీరఁగ మాయనుంగుఁ
దెనుఁగుంబూదోట బోషించి రేరాజుల్,
తత్ప్రతిభాంక రెడ్డికులధీర ప్రాచురీచ్ఛాయ
నీ తేజోరూపమునందు చూచెదము ప్రీతిన్
రామలింగాగ్రణీ!

తొడిమయుఁ బూవు నదుకుఁ బొందికలు నూవు
పదభావముల కొక్క పాన్పమర్చి,
విడవువన్నియ పెదవిమెఱుం గలఁదిన ట్ల
లంకారముల నర్థలక్ష్మి నేలి,

లతిక నికుంజవలయము వల్లినరీతిఁ
గథకుఁ దెంపులులేనిగమక మిచ్చి,
కలహంసకోలనియలలఁ బ్రోదిఁగొనుభంగి
నుడుల కొయారంపునడలు నేర్పి,
రసికు రుచిరోపగూహనప్రమద మొకట,
వీరు నిజభుజాస్ఫాలనోద్వేగ మొకట,
ప్రకృతి తనవశమైనట్లు ప్రతిభతోడ
భారత మ్మేలె నేకవిబ్రహ్మమాళి,

అతని తెనుంగుతీర్పులరహస్యములం
గ్రహియించి తత్ప్రభాయతజయలేఖినీముఖ
నిరంకుశపాలిత భారతీకళాన్వితరసరేఖ
రాగిలిన నేర్పరి వంచు త్వదీయభావలాలిత
విలసద్విపంచిఁ గదిలింతుము నేఁడు
గుతూహలంబునన్ !

చవిఁజూచితి స్వతంత్రచైతన్యభావనా
మాంసలాంగలకవిహంససూక్తి,
పాటించితివి స్వైరభావభోగరిరంస
నెసఁగు పరాసుల రసికలిప్స,
క్రీడించితివి ప్రౌఢి పేడెత్తు సూరన
సుకవివాగ్దోహదశోభనమున,
వెలయించితివి కండగలతెనుంగునఁ గావ్య
తత్త్వ మానందసూత్రములసరణి

నేడు నీకన్న నీయాధునికమహాంధ్ర
వాఙ్మయము నడిపింప నెవ్వఁడు సమర్థుఁ,
డలమి నీకంకణము ధరియించి ముందుఁ
ద్రోవఁ దీయుము రామలింగావతంస !

రాయప్రోలు

## బ్రహ్మర్షి

ఈ దివ్యర్షి పదమ్ము భారతమునందే పుట్టి,
యాధ్యాత్మికేచ్ఛాదారిద్ర్యమునన్ నశించు
ప్రియశిష్యశ్రేయ మాసించి, యా వేదానంత
పథమ్ములన్ గదలిరావే ! తాల్చికోనిమ్ము
నీపాదాంభోజరజోలవమ్ము, గురుదేవా,
మా శిరోవీథులన్ !

ఈ జడజీవితమ్ముఁ బలికించితివి, వీయఘ
పంకమందు నంభోజము మొల్వఁజేసితి,
వపూర్వము నీ దయ, యీనిశీథి నీరాజన
మెత్తినావు, విపులమ్మగు నీయెద నిండె నే
శరద్రాజితచంద్రకాంతు, లమృతమ్ములు,
స్వర్గలతాంతవాసనల్ !

నాయెదలోఁ ద్వదీయచరణమ్ములచిహ్నము
లెన్నడేనియున్ మాయవ, యేనిశీథపుఁ
దమస్సులు మూసినఁగాని, జీవయాత్రాయతవీథి
నొక్కఁడఁ బ్రయాణముసేయుదు నక్షయంపుఁ
బాథేయముఁగా గ్రహించి గురుదేవముఖస్రుత
గీతికాసుధల్ !

మాచిననాఁటిచిత్తము లమాయికకోమలముల్,
పదేపదే పూచిన వానిస్వప్నము లపూర్వము,
లిప్పటికేని నాఁటిసూఫీచరితామృతమ్ముఁ
గుఱిపించెడు మాగురుదేవుఁ డేలొకో తోఁచు
పరాయితో ఫగిడితో నెవరో యొక
పాదుశాహిగా !

"ఏ దురితాంధవహ్నుల దహించుకపోవు
జడుండ" నంచుఁ బ్రహ్లాదుఁడ వీవె, శ్రీశుక
మహర్షి వి నీవె, వచింపఁబోవ నేమాదురో
మమ్ముబోంట్లు వెఱపౌను; ముఖాముఖి
నోవినమ్రమూర్తీ, దరిశించినాఁడవుగదే
జగదీశుని, నెంతవాఁడవో !

అలనాఁటి ఋషివాటికలనుండి వరతెంచు
నామ్నాయపూతగంగామృతమ్ము,
అలనాఁటి బోధివృక్షాయతచ్ఛాయల
నెలవైన బాష్పశీతలజలమ్ము,
అలనాఁటి కఱిమ్రోడు సిలువగద్దియమీఁద
నురలిన రక్తకవోష్ణధార,
అల నాఁటియారబీయులయెడారులలోనఁ
గాఱిన విశ్వాసఘర్మవారి,
కలిసి నీలోన లోలోనఁ గదలిపాఱుఁ
బదనువాఱినదయ్యా నీహృదయసీమ,
తావకపవిత్రజీవితధామమైన
దయ్యా విశ్వవిశాలదేవాలయమ్ము!

ప్రతిఫల మ్మిసుమంత వలవక కర్మముల్
సేయు నీమెయి కురుక్షేత్రమగును,
ఆశాంతములకుఁ జరాచరమ్ములకును
దరలు నీయెడఁద బృందావనమగు,
వివిధధర్మజ్ఞానవేణీసమాశ్లేష
మైన నీమనను ప్రయాగ యగును,
పాతాళమును స్వర్గపద మొక్క ముడిలోన
నతుకు నీవే వారణాశివౌదు,

నీవు కన్పడ నెదురుగా నిలిచినట్లె
మ్రోలను పురాణభారతపుణ్యభూమి !
మాకు దినదినదివ్యయాత్రాకృతోత్స
వానుభూతి నొసంగు బ్రహ్మర్షి వీవు ! !

కృష్ణశాస్త్రి

## తిక్కన సోమయాజి

పూజాతిసాంద్రకర్పూరమ్ములందు
ప్రాజ్ఞదీపాథోలవమ్ములయందు
మడగు సన్ననిపాట
పొడుచు వెన్నెలతేట
కలవు తిక్కనపల్కు తెలుఁగుపల్కులకు !

లోలమృద్వీకాగుచ్ఛమాధురియు
నవపుష్యరాగసుందరపటిష్ఠతయు
అలరు మల్లియపువ్వు
నందు పిన్ననినవ్వు
కలవు తిక్కనపల్కు తెలుఁగుపల్కులకు !

కృష్ణవేణీతరంగిణినున్న ఝురియు
తుంగభద్రాసరిత్తున నూగు హేల
ధవళగోవ్రాతము
నవ నవనీతము
కలవు తిక్కనపల్కు తెలుఁగు పల్కులకు !

లజ్జామనోహరలావణ్యమూర్తి
తేజోరుణాక్షిసందీప్త పాంచాలి
కనుల క్రొమ్మెఱుపులు
కనుఁబొమ విఱుపులు
కలవు తిక్కనపల్కు తెలుఁగుపల్కులకు !

అబ్బూరి

## జ య భే రి

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను,

నేను సైతం
విశ్వవృష్టికి
అశ్రు వొక్కటి ధారపోశాను,

నేను సైతం
భువనఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను !

*  *

ఎండకాలం మండినప్పుడు
గబ్బిలంవలె
క్రాగిపోలేదా ?

వానకాలం ముసిరిరాగా
నిలువునిలువున
నీరు కాలేదా ?

శీతకాలం కోతపెట్టగ
కొరడుకట్టి
ఆకలేసీ కేకలేశానే!

*　　　　*

నే నోకన్నే నిల్చిపోతే,
చంద్రగాడ్పులు, వానమబ్బులు, మంచుసోనలు
భూమిమీద
భుగ్నమౌతాయి,

నింగినుండీ తొంగిచూసే
రంగురంగులచుక్క లన్నీ
రాలి నెత్తురు కక్కుకుంటూ
పేలిపోతాయి,

పగళ్లన్నీ పగిలిపోయీ
నిశీథాలూ విశీర్ణిలీ
మహాప్రళయం జగంనిండా
ప్రగల్భిస్తుంది!

*　　　　*

నే నోకన్నీ ధాత్రి నంతా
నిండిపోయీ,
నా కుహూరుతశీకరాలే

లోకమంతా జల్లులాడే
ఆ ముహూర్తా
లాగమిస్తాయి

*

నేనుసైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై వల్లవిస్తాను!

నేనుసైతం
విశ్వవీణకు
తంత్రినై మూర్ఛనలుపోతాను!

నేనుసైతం
భువనభువనపు
బావుటానై పైకి లేస్తాను!

శ్రీశ్రీ

## నేను

నానివాసమ్ము తొలుత గంధర్వలోక
మధురసుషమాసుధాగానమంజువాటి,
ఏ నొక వియోగగీతిక,

నేను నిదుర
వెన్నెలలదారి నొక రేయి వెడలిపోతి
నొక విపంచీవిరహాకంఠ మొరసి యెగసి.

ఏ నొక వియోగశాలినీ హృదయరాగ
వేదనారేఖ, నాకలివేగు నామె
యంగుళీకిసలయచంచలాంచలముల
విడివడి యనంతవిశ్వాన బడితి నాడు.

అదియె మొద లేను సకలదిశాంతరాళ
మెల్లెడల నెందులో పర్వులెత్తిపోవ!

ఆ సమయ మాదిగా నప్సరోంగనాను
రాగవీథుల, కిన్నరీరమ్యకంఠ
సీమలో, శ్రావణాంబుదాశ్లేషపాళి,
తారకాలోకపంక్తుల, మారుతోరు
పథముల, తిరుగాడుదు పవలు రేలు,
కన్నుమోడుపు మెయివాల్పుగాని లేక!

ఇది ముగియుటోని ఏ యర్థ మెరుగరాని
వేసటే లేని వెర్రియన్వేషణమ్ము!

ఈప్రవాసయాత్రారతి నిటులై నేను
కదలిపోవుదు నాశావకాశములను
ఒక్క నిట్టూర్పు వోలిక, ఒక్క మౌన
బాష్పకణమటు, ఒక గాఢ వాంఛవగిది!

కృష్ణశాస్త్రి

## అడవిపూవు

పొడుపుకెంజాయ లాక్రమించెడు నవీన
సృష్టిచైతన్యమున వికసించియున్న
ఓ యడవిపూవ, నీయెద నూగులాడు
నీరవరహస్యములను వర్ణింపఁగలవె?

ఏయొకరుఁడేని లేనిదవీయమైన
విపులకాననవాటీవివిక్తవీథి
మఱచిపోయినకోర్కులు మఱల మఱల
స్మృతికి రా హైమబాష్పనిస్రుతుల జార్తు!

* * *

"నేను నీవలె బూర్వజన్మానురాగ
కిన్నరీకంఠముల మృదుగీతిఁ బాడి
మోసులెత్తినయానందముల లయించి
మఱచిపోతిని లోకులమాట లెల్ల!

నా గడచిపోయియున్న జన్మములయందు
నేను నీవలె కవిని, విమాన మెక్కి
సప్తభువనమ్ములందున సంచరించి
మత్తిలితి నోయి మధురసోన్మాదవశత!

ఈ ప్రపంచములోన న న్నీసడించి
తరిమికొట్టనివా డొక్క నరుఁడు లేడు,
లేజిగురుటాకుఎద విదళించు పల్లు
బల్లెముల పోటుపొడవనివాడె లేడు!

హృదయమునయందు కార్చిచ్చు ఎదిగి యెదిగి
ఆకసమునంట మంటల లోక మెల్ల
విలయమున గాల్చు జ్వాలల వేగి వేగి
మనుజజన్మమునందు నే మాడిపోతి!

దాచుకొన్న దాగని తీవ్రదాహ మెల్ల
నాగళమునుండి ధర బడి రాగమైన,
అది గరళ మయ్యె లోకుల కపుడునుండి:
నాగళములోని శుష్కగానమ్ములాగె.

నేను కవినయి బ్రతికియుండినదినాల
స్వప్నములు గంటి: నొక వనచ్ఛాయలోన
నొక్క పువ్వునైన బాగుండునో యటంచు,
దానిఫలలబ్ధి నేటిజన్మాన గంటి.

నాహృదయసౌరభముల గంధవహారాజి
తాను గొనిపోవు దశదిశాంతములదాక
నా యెడదలోని శాంతశృంగారగీతి
స్వరములను దాటి మ్రోగు నిశ్శబ్దరీతి.

నా కిఁక ప్రపంచమందున్న యీకిరాత
హృదయముల నేమిపని, యుదయించి సంజ
కెంపుల బడి నవ్వుల కిలకిలమని
శాంతిగొందును సాంధ్యనిశాంతవీథి !

మా కుసుమలోకమందున మరణమన్న
బెదరువాటున గుండియ లదరబోవు !
మధురవాయూర్మిలో నిశామధ్యమందు
నాదమఱతు మనంతరాహస్యశయ్య !

ఓకవీ ! యీ వచించినయూహాలెల్ల
అల్లఁబోకు ప్రపంచాని కరిగి, దాని
పేరనిన మానసంపుటెడారిమధ్య
ప్రళయకాలాగ్నిపర్వతమ్ములు జ్వలించు.

నీవుగూడ నావలెనె యెదో విషాగ్ర
విపులనిశ్శ్వాసవాయువుల్ వెలికిఁ జార్తు,
నీకుఁగాబట్టి చెప్పితి, లోకమందు
దీని వెలిబెట్టబోకు ప్రార్థింతునోయి !"

పెనుమర్తి

## ప్ర తి ది న ము

ప్రతిదినంబును బాట నేఁ జన,
ఎందఱేఁ బ్రజ నన్నుఁ గనుగొని
రాకపోకల బలుకరింతురు,
వారికిని నా కెట్టి యెఱుకయొ ?
ప్రణయమార్గ మదే !
అదే !

నీరములపై నావ నెక్కిన,
గట్టుపైగల చెట్టు భ్రమఁగొని
నగముదారినె కలిసికొనియెడు,
ప్రణయలహరి యదే !
అదే !

నిండుటాకసమరసి పరుగిడ
సూర్యుఁ డాది వెలుంగు లెల్లను
తలకుమీఱుచు ననుగమించెదు,
వానికిని నా కెట్టి కట్టడో ?
ప్రణయభవన మదే !
అదే !

ఎంత చక్కనివారలైనను
సుంత వారలచూడ్కి నంటను,
ఎంత మోహనవృత్తమైనను
దానియెడఁ జుక్కానిఁ ద్రిప్పను,
ఎంతచోద్యపుఁగాంతి యొదవిన
నంత కెక్కువయైన దెంతును;
ప్రణయలోభిని నేన!
నేనే!

క వి కొం డ ల

## లీ లా జీ వి త ము

ఇసుక నేమొ వెర్రిగ నీవు వ్రాయుచుండ
స్ఫటికమార్గాల నీయేరు జారి, యెట్లు
నీ రహో మోహజపము ధ్వనించునో!
నీ పెదవి కీప్రసవ మెట్లు వ్రాలునో! శ
శాంక రేఖ నీ సోయగ మ్మరసి తనను
లహరిలో చూచుకొని యెట్లు లజ్జవడునొ!
కామినీ! ఈమనోజ్ఞశృంగారభృంగి
కెంత సులభమో ఈజీవితైకపథము,
గాలికెరటాల దూరదూరాల పూల
కెటకొ లీలగా హాయిగా నెగసిపోవు!

ప్రకృతి కింతగా బ్రతుకు సులభమౌ, అయిన
కవికి, సార్థక ప్రేమసంకాశి కెంత
లీలయో నాకు...

రామచంద్ర అప్పారావు

## పడవ

ఆపలేనే యెంకి యీ పడవయిసురు !
పాడలేనే యెంకి పదము లీ రొదలో !
        పడవ సల్లగ నడిపి
        పదము సదు వంటావు !
        కన్నుమంటా యేరు
        గాలి నెగబోసింది !
ఆపలేనే యెంకి యీ పడవయిసురు !
పాడలేనే యెంకి పదము లీ రొదలో !

        వోరుగాలే పాట
        దారి కడతావుంది !
        చేటి కురికే పాట
        నోట గొడతావుంది !
ఆపలేనే యెంకి యీ పడవయిసురు !
పాడలేనే యెంకి పదము లీ రొదలో !

తల మలుపుకొని పాట
తరిలింది కామోను!
దేముడల్లే లోనె
తిరుగుతున్నా దేటా!
ఆపలేనే యెంకి యీ పడవయిసురు!
పాడలేనే యెంకి పదము లీ రొదలో!

యెన్నెలంటే పాట
కెంత మను సవుతాదొ!
పాట సాగేతలికి
పయన మే మవుతాదొ!
ఆపలేనే యెంకి యీ పడవయిసురు!
పాడలేనే యెంకి పదము లీ రొదలో!

నండూరి

వ్యర్థయత్నములు

ప్రేమతో నా తులసిమొక్కను
పెంచితిని గంగోదకంబుల,
పసుపుకుంకుమతోడ భక్తిని
పూజ లొనరిస్తి;

ఉదయసాయంకాలముల క
ర్పూరదీపం బారతిచ్చితి,
హృదయతాపము తీర లక్ష్మీ
స్తవ మొనర్చితిని;

పక్కనే పొంచున్న లోకవు
మాని సొక్కడు పెదవి విరిచెను,
'ఎందుకో యీవ్యర్థయత్నము
లెందుకో ?' అనియెన్.

ప్రతిమ నొక్కటి మలచినా నది
ప్రతిఫలించిన దండ మంతా,
తనివి తీరగ విగ్రహాంబు న
లంకరించితిని;

మంచినగలూ మంచిగంధము
మంచిమంచిరకాలపువ్వులు
ప్రతిమ కుంచితి, హృదిని నిల్పితి,
తపము చేసితి ;

పక్కనే పొంచున్న లోకవు
మాని సొక్కడు పెదవి విరిచెను,
'ఎందుకో ఈవ్యర్థయత్నము
లెందుకో ?' అనియెన్.

క్రొత్తక్రొత్తరకాలవిద్యలు
క్రొత్తఆటలు క్రొత్తపాటలు
ముద్దుతల్లికి నేర్పుచుంటిని
మోద మలరంగన్;

చిన్ని పాదము లెత్తి నాట్యము
చిన్ని పెదవులు కదిపి గీతము
చిన్ని చేతుల నెత్తి తాళము
తల్లి నేర్చినది;

ప్రక్కనే పొంచున్న లోకవు
మాని సాక్షుడు పెదవి విరిచెను,
'ఎందుకో యీవ్యర్థయత్నము
లెందుకో?' అనియెన్.

హృదయభారము తీరు నంచును
మధురభావము లేర్చి కూర్చితి,
అడవిపువ్వులు గుచ్చి దండగ
అరుత దాల్చితిని;

అనుభవించిన కష్టసుఖముల
నఖిలమును మథియించి, 'సారము
తీసికొనుడో రండు! రం!' డని
తిరుగజొచ్చితిని?

పక్కనే పొంచున్న లోకపు
మానిసొక్కడు పెదవి విరిచెను,
'ఎందుకో యీ వ్యర్థయత్నము
లెందుకో?' అనియెన్.

పక్కమానిసిపలుకు లన్నీ
పడెను నా చెవులందు; విడిచితి
సర్వ మయ్యెడ; మౌనముద్రను
దాల్చి కూర్చుంటిన్.

శిరము వంచితి, కనులు మూసితి
మౌనముద్ర వహించియుంటిని,
పక్కమానిసి పలికె మళ్లీ
ప్రస్ఫుటముగాగన్:

'ఎందుకో యీ మౌన మూనుట
ఎందుకో యీ మాంద్య మంతా,
పోయి సాంఘిక సేవ చేస్తే
పుణ్య ముండునుగా!'

దీక్షితులు

## దెబ్బతిన్న లేడి

ఆయటవీస్థలిన్ నునుదృణాంకురము ల్దిని
కొండవాగులన్ దీయనినీరుగ్రోలి
పువ్వుతీగలనీడల విశ్రమించు నే నేయపకారి
నైతినని యీ నిశితాంబక మేసినావు,
మీబోయల కేగతిన్ దెలియబోలును
మామక సౌకుమార్యముల్ ?

నేయియు పాయసమ్ము దిననేర్చిన
పెద్దల పాదసేవలన్ జేయగరాదె,
నీకు గల చెట్టతనం బొక కొంత మాను;
స్వర్గీయులతానికుంజముల కిన్నెరసానులు
పోవు దారులన్ బోయెద నింక నాకు సెలవుం
దయజేసి క్రుధం ద్యజింపుమీ!

కాలము తప్పె, మాతబిసికన్నెక లక్కట
మద్వియోగమున్ దాళక నాకునై
యెదురుదారులు సూతురు, బోయకాంత !
యిట్లేల వృథా గుమారిలెదు ?
నీ వయినం జని , వార లందరున్ బేలతనాన
కంట తడివెట్టకయుండగ నూరడింపుమీ !

పేరిమి బూలువెట్టి తినిపించి, మరందము వోసి,
సంజలన్ జేరువ దీసి, యాడి, యరచేతుల బెంచిన
తాపసాంగనల్ లేరిట, నాదు పాపము ఫలించిన
యీయవసానపున్ సమాచారము
నంత్య బాష్పకణజాలముతో నయినన్
నచింపగన్ !

కొ డా లి

## ఆశ-నిరాశ

పెరటిలోనున్న యేడాకులరఁటిచెంతఁ
బెద్ద బావిజలంబులఁ బెంచికొన్న
మావిమోకకుఁ గనవయ్యెఁ గావిచిగురు,
కావిచిగురున కాసించి గళము నెత్తి
కండుఁగోయిల పాడె రాగంబు లొలయఁ,

జివురువెట్టనికొమ్మలఁ జిన్నిపూలు
తావు లింపార వికసించె ; దానఁ జేసి
మేలుకొలుపులఁ బాడుచు నాలి తేటిఁ
యొక్క రీతిని చిందులు ద్రొక్కఁదొడఁగె ;

కాంచుచుండగ నాకస్మికంబుగాఁగ
నెట్టిపాటుననొ మతేమొ కాని
చిగురు నశియించెఁ, బూవులు చిందిపోయెఁ,
జిన్నికోటుల యంతలోఁ జిన్నవోయెఁ,
దుమ్మెదకుగూడ నేమియుఁ దోఁచదాయె,
విషమవిశ్వంబునకు నిది వింతపనియె!

* *

వేంకటపార్వతీశ్వరులు

## గఱిక

దారి కోవల క్రేవఁ దనరారు గఱిక!
యెంతమొ త్తందన మెంతటిప్రోది
యెంతక్రొ త్తందన మిగురొత్త నీవు
మొన్నగాఁ గురిసిన ముత్యాలజడికి
మురిపాలగుబురువై పెరుగుచున్నావె?

దైవసృష్టిని నీకుఁ దా వొండు గలదు!
నేనును నీపైన నెన రూనియుందు!
ఏను నీ వైతినో యెవరికిం దెలియు
మున్ను గతించిన పుట్టువులందు!
ఈవు నే నైదువో యెవ రెఱుంగుదురు
రాఁబోవుజన్మాల రాకపోకలకు!

గుసగుస చెప్పెదు, గునిసియాడదవు
నీలోన వెలిగెడు నిర్మలజ్యోతి
వెలికొత్తఁ బోరాటపెట్టుచున్నదియొ!

నీ యందచందంబు నీ సంతసంబు
నందుఁ బాల్గొన నాదు డెందము పొంగు!
పంచవన్నెముసుంగువలిపంబు క్రింద
నొకవేళ నిరువుర మొకరమే యేమొ!

రామిరెడ్డి

## ఆశయము

కదలినట్టడగు పొడము
ముత్తియమ! నీదు శాంతిన్
బడయఁగను మునుఁగవలెనా?
వల లెన్నొ పన్నవలెనా?

ఈ నాదుతీరమందే
భంగముల వెలికిఁ బడెడు
గుల్లలను గూర్చుకొనుచు
నే నేల యాడరాదో!

ఆకసము నట్టి పొడుచు
చుక్కరో! నీదు కాంతిన్
చేఁబట్ట నెగురవలెనా?
తెక్క లూనంగవలెనా?

నే నేల నిలువరాదో
యీనాఁడుపాలమునడుమ
క్రింది కీ వెపుడు పడదో
యపుడె ని న్నరసికొనుచు?

సంతుష్టిలేదు మదికిన్
సంతసములేదు తుదికిన్,
ముత్తెసరి కెలుఁగఁ వలెను
చుక్కజిగి కెగయువలెను.

కవికొండల

## నీవు-నేను

సుఖము కాలమునందు వ్రాసుకొని యెవరు
పుట్టిరో వారికి వసంతము సుమనోజ్ఞ
మైన గానిమ్ము, నాకు నీ వన్న, మేను
జలదరించున ఓయి ఆషాఢజలద !

నిను మదీయగిరాంవీథి నిలిపి శైవ
సాంధ్యతాండవనూపురస్వనము లొలుక
జేసితిని, నీవు మింటికి, క్షితికి నేను,
కవుల మైతిమి హృదయదుఃఖములు పాడ !

నీవు జగమునఁ జీకట్లు నిండఁజేయు,
వెలుగుచొరరాని యింటిమూలలకుఁ బ్రాకి
ముసుగుదుప్పటిలో కన్ను మూతవెట్టి
పొదలు పెనుచీకటిని శాంతి వెదకికొందు !

విశ్వనాథ

## ద్రాక్షావీథి

నేడు నా ద్రాక్షపందిలినీడలందు
స్వాదురసభారవశమున వ్రాలిపోయె
గెలలు గెలలుగ జారిన ఫలచయమ్ము
రాజరాజేశ్వరీ, వేగిరమున రమ్ము !

చిరదినమ్ములనుండి పెంచిన మదీయ
ద్రాక్షవీథీనికుంజమధ్యమున నిల్చి
జన్మజన్మాంతరముపరిశ్రమము నెల్ల
సఫలమొనరించిపోదువు సాగిరమ్ము !

చల్లనిసమీరములకు కంపిల్లుచున్న
మధురఫలగుచ్ఛములలో నిమదిర నోడ్చి
భావ ముప్పొంగ మణిమయస్వర్ణపాత్ర
లందు నిండార నింపెద నందికొనుము !

మొక్కనాటినసుదినము మొదలు నేటి
వరకు నీ వెన్న డుజ్జ్వలవాహనమ్ము
నందు నాసీనవై వత్తువా యటంచు
వేచికొనియుంటి, నింక నా వేళ వచ్చె !

ఫలగుళుచ్ఛము లన్నిటి బాసి, రిత్త
వోయినను పోవనిమ్ము, నా పూర్వవాటి
ప్రథితధనధాన్యబహుళభారమ్ముకన్న
నీవలనకల్గు లేమి శోభావహమ్ము !

తెచ్చుకొన్నదిగా దీయతీవకఠిన
వాంఛ ; జంగమస్థావరవర్గ మెల్ల
కోరుకొనుచుండె నిదె గుసగుసలతోడ !

ఆ మహాశక్తికై వినయాంజలులను
భూతసామ్రాజ్యమెల్ల కేల్మోడ్చి యొసగు,
ఎంత గుహ్యమొకద యీ యనంతపథము,
ఎంతయజ్ఞేయమో యెట్లు తెఱుగవచ్చు !

ఆ బ్యా రి:

# ఎడారి

తలిరుప్రాయమ్మునకె కోరికలు కృశించి
ప్రౌఢువలెనున్న జీవితమ్మునె వరించి
తనివిపోని విషాదగాంధర్వగీతు
లల్లుకొని యీ యెడారుల కరుగుచుంటి!

మలయపవనంపుకొదమల కులికిపోయి,
వెచ్చని యెడారివడగాడ్పు నిచ్చగించి,
ఎండమావుల చల్లని కొండవాగు
తీరములయట్ల దప్పిక తీర్చుకొంటి!

సంజచీఁకట్లు వచ్చి నిశ్శ్వాసవాయు
వీజనమ్ములు వేసి, యుర్వీతలాంత
రాళసుఖదుఃఖశూన్యపర్యంకమందు
తొట్టిలోపల నన్ను జోకొట్టిపోవు!

మామకక్షుద్రదేహనిర్మాణమందుఁ
దవిలివచ్చిన పంచభూతములుగూడ
నీయెడారిలో న న్నావరించుకొనుచు
కంటి కొక తెప్పలాగునఁ గాచుకొనును!

పెనుమర్తి

## ము ం దు గ తి

యెనకజల్మంలోన
యెవరమో నంటి,
సిగ్గొచ్చి నవ్వింది
సిలక నాయెంకి !

ముందు మన కేజల్మ
ముందోలె యంటి,
తెల్లతెలబోయింది
పిల్ల నా యెంకి !

ఎన్నాళ్లు మన కోలె
ఈసుకము లంటి
కంట నీ రెట్టింది
జంట నా యెంకి !

నం డూ రి

## నా స్థితి

ఈకెలన శరత్పూర్ణిమావృతశశాంక
లలితరోచిర్వితాన, మాకెలన ఘోర
ఘనతరాంధకారచ్ఛటాక్రాంతభూమి,
అందు సగ, మిందు సగ ముంటి, నవురనేను!

ఈశరత్పూర్ణిమాచంద్రికాసుధా మ
రీచిలో నున్న నేను స్ఫారీభవన్న
వీనశంపాలతాకృతి పూనియుంటి!

ఈసగము నాకు నాకె కన్పించఁబోదు;
ఉగ్రరాహుచంద్రార్ధబింబగ్రసనము
పోలె నున్నది నా స్థితి!

విశ్వనాథ

## నెమిలికన్ను

ధగధగమెరిసేకాంతిని చల్లే
కళ్లు నెమిలి కెవ రిచ్చారో,
పురి విప్పుతు అది నాట్యమాడగా
తాండవకృష్ణుడు జ్ఞప్తికి రాడా!

మేఘాలందం నీలాలందం,
కాంతలకాటుకకన్నుల అందం,
అందా లన్నీ జీవం దాలిచి
నీలో నాట్యం చేసేనే !

జ్ఞాపకముంటే చెప్పరాదటే
కృష్ణునిబాల్యక్రీడలు మాతో ?
కృష్ణుని వేణికి నీవా అందం
నీకే అందం ఆ వేణా ?

చెప్పరాదటే, చిన్నికృష్ణునీ
కూకటిముడిలో తాండవమాడిన
నాట్యవైభవము నీదే అయితే,
కృష్ణగాథలను కర్ణామృతముగ !
ఆనా డాముర ళాలించితివట
గోపాలోన్నతశిరమున నిలిచి,
మురళీమోహనదివ్యగీతముల
ప్రతిబింబములా నీలో తళుకులు ?
నిన్ను బాలకులు నిత్యము కోరుతు
నీతో ఆటలు ఆడేవేళల,
వారు కృష్ణు లను భావము పుట్టును
నిజ మంటావా కాదా చెప్పవె !

దీక్షితులు

ఆ కొండ

మంచులో మునిగింది
మాయమైపోయింది
ఆకాశమున గలసెనో
ఆకొండ
అక్కడే పడియుండెనో.!

రైలులోపల నేను
రాబోవుతున్నాను
నను జూసి వెనుదిరిగెనో!
ఆకొండ
నైజమే అటులుండెనో !

వడివడిగ లేచింది
తడబడుతు నడిచింది
మరుగుపడి నను జూడ
పరుగిడుతు వచ్చింది !
పాడలుతు నిలుచుండెనో
ఆకొండ
అక్కడే పడియుండెనో !

జరజరా నడిచింది
గిరగిరా తిరిగింది
ఒలు తిరిగి తాను పడెనో
ఆకొండ
తల తిరిగి బారుమనెనో !

పరుగు పరుగున నాతో
పయనమై యాకొండ,
సరగున్న రాళ్ళోతె
దారి కడ్డము నిల్చి
సరివితోటలు దాటెనే,
ఆకొండ
తలయెత్తి నను జూచెనే !

ఏల జూచెద వంటి
ఏమి కావలె నంటి,
ఎంత పిలిచిన పల్కదే
ఆకొండ
పంత మేమో చెప్పదే !

డబ్బుతే! డబ్బుతే !
డబ్బుతే అనుపలుకు
విడువకను బల్కైటి

వడినడక రైలుతో
తను కూడ చనుదెంచెనే,
ఆకొండ
తడయకను పయనించెనే !

ఇంతలో ఆకొండ
సొంతరూపము దాచి
వింతరూపము దాల్చెనే !
ఆకొండ
పంతమున వడిపోయెనే !

చలియున్న జడవదే,
పులియున్న వెరవదే,
మలయానిలుని దాచునే
ఆకొండ
మంచుకొం డనిపించునే !

మంచుకొం డై తేను
మనకొరకు తా నేల
మరచిపోయీా చూచునే
ఇది నాకు
మది దోచకను పోయెనే !

గిరికన్య శ్రీ గౌరి
వరతనయులము మేము
గురి తప్పిపోయినాదా,
ఆకొండ
గుణము తా మారినాదా ?

కొనియాడలేదన్న
కోపమున తా బోయి
కొండపాదుగున కూలెనే,
ఆకొండ
గుండె రాయిగ మారెనే!

ఒరులు పో శక్యమా ?
పరులు దే శక్యమా!
నను విడిచి యాకొండ
నల్లరాయై పోయె,
యెంతచూచిన చూడదే,
ఆకొండ
ఎంత పిలిచిన పల్కదే!

బంగారమ్మ

## జైలులో చందమామ

చింత శల్యావశిష్టయై చిక్కి చివికి
నవసినమ్మృగాక్షి స్విన్నాననమ్ము దోచు,
కృష్ణపక్షమ్ము! నన్నీ వాకింత మా గ
వాక్షముల తొంగిచూచెదు పక్షమునను,

రాతిగుండెలు గలిగిన రాచభటుల
కర్కశాఘాతముల మేను కందిపోయె,
శీతలహిమాంబుకణముల చిల్కరించు
అమృతకిరణాల స్పృశియింపుమయ్య మమ్ము! *

అకట, మరియింత కృశియించినట్టి మేను
సాంధ్యపవనమ్ములు స్పృశించి చాలనాళ్ళు
గడచె! జ్యోత్స్నాప్రసాదశీకరపరంప
రాభిషేకమ్ము చేయింపుమయ్య మాకు!

తెల్లమబ్బులకెరటాల తేలిపోవు
నట్టి భవదంతరిక్షప్రయాణము గన
ఇనుపతలుపులనడుమ వసించు మాకు,
నల్ల మూహోతరంగాల నూగుచుండె;

నవ్యతారాపథమ్ముల నడచు నిన్ను
నేకిరీటాధిపతులు బంధింపగలరు?
కష్టతరదీర్ఘయామినుల్ గడచి వేగ
బంధనవిముక్తులను జేయవలయు మమ్ము!

బంధనాలయబాహ్యప్రపంచవార్త
లితరములు మాకు రాకున్న నేమి? సురవ
ధూకపోలకర్పూరమధురపరిమళ
పులకితరహస్యముల నెల్ల దెలిపిపొమ్ము!

ముకుళితములైన కలువపూవులదళాలు
నీకరస్పర్శ పుల్లరించినవిధాన,
ఎన్నడో మూగవడిన నాహృదయవీణ
తీగ లొకసారి కదలి నదింపదొడగె!

అంబుదమ్ముల నీకృపాపాఙ్గదృష్టి
పోల్చి రత్నాకరుడు పొంగి బోర్లపడును,
అట్టి నీ వేడ, స్వాదుభోజ్యముల కేని
నోచుకొనని బంధితునిసంతోష మేడ!

శ్రుతిని నీ కెట్టిమూర్ధాభిషిక్తుడైన
నూలు పోగొక్క టిచ్చి సంతుష్టి జెందు,
హర్షముక్తాశ్రుల సువర్ణహారములను
గూర్చి నే నిప్పు డర్పించుకొంటి నీకు!

గా టా లి

## చైత్రము

వచ్చె చైత్రమాసము!
వాసంతవిలాసము!

చల్లగాలి వీచె వీచె
మెల్లమెల్ల జల్లు లేచె
పిల్లలతల పూత విచ్చె
వచ్చె చైత్రమాసము!
వాసంతవిలాసము!

గున్నమావి క్రొన్ననతో
సన్నజాజిమన్ననతో
ఎన్నరానిచిన్నెలతో
వచ్చె చైత్రమాసము!
వాసంతవిలాసము!

చెల్లెల! ఇద్దర మొకటై
మొల్లలమై మల్లెలమై
ఎల్లవేళ లాటలపై
పుచ్చెద మీమాసము!
వాసంతవిలాసము!

రెక్కలు కట్టుకు మేఘము
లెక్కడ, యెంతటిసౌఖ్య, మి
కెక్కడి దక్కడ దుఃఖము!
చుక్కలింట వాసము,
చుక్కలె సావాసము!

ఏడువన్నెలాకాశము
ఆడునుగా మనకోసము!
పాడునుగా మనకోసము!
వచ్చె చైత్రమాసము!
వాసంత విలాసము!

విశ్వేశ్వరరావు

## కప్పతల్లి పెళ్లి

కప్పతల్లిపెళ్లి నేడూ, చూడరే,
కావెళ్ల నీళ్లొంపినాడు!

వరుణదేవుడు పంపినాడూ, ఓ చెలీ
వాడలన్నీ నింపినాడు!

గగనతలమునుంచి, నేడు, వీవనలు
చెట్లచే వేయించినాడు!

స్వర్గాధినాథుడు నేడూ!      రథమెక్కి,
పయనమై పోతువున్నాడు!

భర్త్యాలులేకనే వాడు,      పెళ్లికి
బాజాలు వేయించినాడు!

బండరాళ్లపైని వాడు,      చక్రములు
బడబడా దొర్లించినాడు!

బాణసంచా వెలితి లేదే,      పెళ్లికీ
బహుబాగుగా చేసినారె!

కళ్లుచెదిరే మెరుపులమ్మా,      చూడు
వళ్లు పరవశమౌను సుమ్మా!

కప్పమ్మపెళ్లికో యంచూ,      మేళములు
గొప్పగ తెప్పించినారె!

చెప్పశక్యముగాదు వేరే,      బోదురూ
కప్పలామేళములు రారె!

కప్పమ్మ గడపతొక్కినదీ,      శుభమన్న
సూచనలు చూరు చెప్పినది!

కప్పు లెగిరే వానలమ్మా,      పొలములూ
కనకమే పండుతాయమ్మా!

బంగారమ్మ

## వర్షాగమము

రసికహృదయము లోలలాడే
　　మనువుదినములు నురలివచ్చెను,
మిసిమిమబ్బులు వ్రేలు మేలిమి
　　మునుగుతో నాకసము విచ్చెను!

తరలి రా, ఆషాఢలక్ష్మీ
　　మెరపుతీవలుతోలకు రథమున,
మురిపెమున దిక్కాంత లలరగ
　　తరలిరా, మేఘములపథమున!

పదికెలంకుల నూడ్చి వల్లీ
　　మదవతులు కానుకల నుంచిరి,
మొదటిచినుకులతోడ మెఱసే!
　　పొదువుతో మోములను వంచిరి!

వేకువలలో శంఖ మొత్తుచు
　　లోకముల నిక మేలుకొల్పుము,
శ్రీకరములగు తఱిపివానల
　　శీకరము వాకిళ్ల నిల్పుము!

మంగళస్నానమ్ము లారిచి
చెంగలించెడు నీటికాలువ
పొంగిపోయె; నొసంగు పృథివీ
ప్రాంగణములకు పచ్చశాలువ!

అడవికోనలలోన నీకై
యెదురువేచిన నెమిలికన్నెల
కడుపుకోతల మాన్పి, దాహము
లుడిపి పఱపుము చల్లవెన్నెల!

ఉరుము లురిమెడుగర్జనమ్ముల
మెరుపుతీవల మేలవింపుము,
మురిసియాడెడువానచినుకుల
సరసగానము లాలకింపుము!

అబ్బూరి

## కార్తీకపూర్ణిమ

పత్తుల్లు పలుకకే పడియుండినాయి,
వృక్షాలు చూచుచూ పూరకున్నాయి,
తనవెంటపడుతున్న
తరుణిని జూడడిదేమి!
పోతువున్నాడు తాను,
అడుగడుగో పొంగులోకాలు గనను!

గాలి ఉయ్యాలలై కదులుతుండెడిమబ్బు
కనుల కడ్డమురాగ, కాలైన తడబడక,
పోవుతున్నాడు తాను!
తన గర్వపొంకములు దెలుపుతూను!

వాద్యములు వినబడవో, చోద్యములుకనబడవో
నిముసంబు నిలువ డేసీడ నిలుచునోగాని,
పోతువున్నాడు తాను!
గర్వంపుపొంగు బోకారిపోను!

పక్షికలకలములే పరిభవం బని యెంచి,
తెల్లబోయిన మోము తెలియకుండుటకునై,
పోతువున్నాడు తాను!
తను వెల్ల తారుమారగుటచేను!

బంగారమ్మ

## ప్రతీక్ష

ఉదయభానుడు పంచిపోయిన
హృదయసౌవర్ణ జ్వాలన్మణు
లొదిగి యొదిగి యనంతకాలవు
టుదరమున మణగెన్!

ఉదయబాలవిహంగమంబుల
మృదులకైశోరశ్రుతులపై
గుదులు గుదులుగ కాలచోరుడు
వదలు బాణమ్ముల్ !

ప్రాతరరుణ నవసువర్ణ
జ్యోతులూగే తూర్పుదిక్కున
లో తెరుంగని కాళరాత్రులు
రాతులై నిలచెన్ !

పెనుమర్తి

## అంధకారము

కారుచీకటి పేరుకొనియెను,
కడలి, మ్రోతల మారుమ్రోగెను,
దారుణంబగు నంధకారము,
దారి తెలియదుగా !

అచ్చటచ్చట మిణుగురైనను
జొచ్చి వెదకిన లేదు కనగా,
హెచ్చుమోదముతోడ నేగెద
వేమి కనుగొనగా ?

భయముగొల్పెడు కారుసంద్రము
బాగుగా గనుగొందువా, యట?
పార మెరుగని ఆయెడారిని
భయము పుట్టునుగా!

చే తెరుంగవు, పా తెరుంగవు,
చెప్పినను వినరాదొకో, యట
కారుచీకటి ఘోరమనియెను
కడలిమ్రోతలతో!

విశ్వసుందరమ్మ

తమస్సు

కను మూసి లేచాను, వెనుదిరిగి చూశాను,
కనలేదు ఆజంట, వినలేదు ఆజాడ,
గుండె గుబగుబలాడెను,
నాగొంతు
ఎండి, గుట కడదాయెను!

పిలిచాను పిలిచాను, అలసిపోయాను,
అలసిపోయినగుండె అల్లై ముడి విడిపోవ
ఆకాశమున కెగిరితి,
అక్కడా
అంధకారమె చూసితి!

కేక వినబడదాయె, చూపు కనబడదాయె,
అంధకారములోన అట్టె రెక్కలు ముడిచి
అవనిపై నే బడితిని
అక్కడా
అంధకారమె గంటిని !

బంగారమ్మ

## ఒక రాత్రి

గగనమంతా నిండి
పొగలాగు క్రమ్మి
బహుళపంచమిజ్యోత్స్న
భయపెట్టుతోంది !

ఆకాసపు ఎడారి
అంతటా, అకట !
ఈ రేయి రేగింది
ఇసుకతుపాను !

గాలిలో కనరాని
గడుసు దయ్యాలు,
భూదివమ్ములమధ్య
ఈదుతున్నాయి !

నోరెత్తి హోరెత్తి
నాగులను కడలి,
కరికళేబరములా
కదలదు కొండ,

ఆకాశపుటెడారి
లో, కాళ్లు తెగిన
ఒంటరిబంటిలా
గుంది జాబిల్లి,

విశ్వ మంతా నిండి,
వెలిబూదివోలె,
బహుళపంచమిజ్యోత్స్న
భయపెట్టుతోంది!

శ్రీ శ్రీ

## దీపావళి నాడు

నిశీథిని:

జగతి యీనాఁటియీమహోత్సవమునందు
మునిఁగి యానందమునఁ బొంగిపోవుచుండ,
ఇటు రగులుకొల్పి రెవరు నీ హృదయమందు
నణఁచుకొనియున్న ఘోరదుఃఖాగ్ని నివుడు?

శే షు :

కాఱుకొన్న యమానచీఁకటులనడుమ
నే నొకండనె ఈశూన్యగృహమునందు
అదురువడిపోయి మరణవాద్యమ్ములట్లు
గుండియలు కొట్టుకొన నేడ్చుకొనుచునుంటి !

ఇంతగ దహించుకొనిపోవు నీయెడంద
బాష్పములు జారిపడి చల్లఁబడునో యనుచు
మూసికొనిపోయె నా నేత్రములు దమంత,
రాత్రియే ఇంక బహిరంతరముల నాకు !

విస్మృతోదంతములు శూన్యవీథులందు
నావలెనె మౌనముగ వెళ్లిపోవుచున్న
ఓనిశీథిని ! నీ గభీరోదరమున
దొరికె నీ దురదృష్టవంతునకుఁ జోటు !

చి ష్ణ ట :

బాణనంచుల ఫెళఫెళార్భటులు విరిసి
దశదిశాంతరములఁ బ్రతిధ్వనుల నీన,
పేదవడియున్న మౌనజీవితపుటాశ
లిపుడు మ్రోఁగించుకొనుచుంటివేల నీవు ?

నేను :

నన్ను నిరసించువారియానందమందు
నాకు భాగమ్ము వలదొక్కనాఁటికైన,
చీఁకటులఁ జీల్చికొనివచ్చు నీ కరాళ
గానరవములనే నా సుఖమ్ము కలదు!

దినములు పరస్పరప్రతిధ్వనులుకాఁగ
ఇరువదైదేండ్లు నా బ్రతుకిట్టె గడచె,
ఈరహోదుఃఖవీథులం దే నెఱుంగ
సఖులయుడుగులజాడ లీసరికిగూడ!

ఎడతెఱిపిలేనికన్నీటిజడులఁ దడిసి
పంకిలమ్మైనజీవనప్రాంగణమున
శాంతిదేవతాచరణలాక్షారసారు
ణాంక లవలేశముల వెతుకాడుకొందు!

గొంతు విప్పక లోలోనఁ గుమిలి కుమిలి,
యెంతయేడ్చినఁ బగిలిపో దీయెడంద;
ఆకొనినయాశ లెప్పటికప్పు డవిరియు
కలయఁద్రిప్పును స్వప్నసాగరతటాల!

మృత్యుగర్జాప్రవాహగంభీరమైన
విధి నిదురవోవు ప్రేమజీవితములోన
సంఘటిలిన ప్రవాసదుస్స్వప్నవ్యథల
మడతలను సర్దుకొనుచుందు మాయకుండ!

తెగిపడినపూలదండ లెత్తుగ నమర్చి,
అంధకారమ్ము సందిట నదుముకొనుచు,
నెవరికోఅకో పదేపదే యెదురుచూచు
నాయెడ కొనర్తుఁ గృత్రిమానందభిక్ష!

మ్రొక్కినకొలందిఁ గాలితోఁ ద్రొక్కుచున్న
యీకలినలోక మెల్ల బహిష్కృతమ్ము;
రండు, చిమ్మటలార! ఈ రాత్రివేళ
నావలెనె పాడుకొను మీరె నాకు సఖులు!

వేదుల

## అంధభిక్షువు

అతఁడు, రైలులో నేఁ బోయినప్పుడెల్ల
నెక్కడో ఒక్కచోటఁ దా నెక్కు - వాని
నతనికూతురు నడిపించు ననుసరించు.

అతఁడు దాశరథీశతకాంతరస్థ
మైన యాపద్యమే పఠించు ననవరతము.

అతని యాగొంతు కట్లనే - అతఁడు పూర్వ
జన్మమందు నేనూతిలోననో చచ్చిపోవు
చెంతపిలిచిన వినువారలేని లేక,

ఆ పిలుపు ప్రాణకంఠమధ్యములయందు
సన్నవడి సన్నవడి నేటిజన్మ నతని
కనుచు వెదకుచు వచ్చి చేరినది కాక -

అతని కన్నులా బొత్తిలే - ఆసమయము
నందు తన్ను రక్షింప నేర్పైన·వత్తు
రేమొ యని చూచి చూచి యట్లే నిలబడి
అతనిప్రాణాలు కనుగూళ్లయందు నిలిచి
మరలఁ గనేఁగాక నేటిజన్మమున నతని.

అతనిపాడినయంతసే పల్ల - నట్టి
యతనికన్నులు చూచినయప్పు డెల్ల,
నూతిలో మున్గునాతని తీతు నంచు
వేగిరముపుట్టు నాదుహృద్వీథియందు;

అంతలో పాట నాపి, తా నచట నచట
కాను లడిగి, కూతురు ముందుగా వినిర్గ
మించు నాతడు -
నే నందు మిగిలిపోదు !

విశ్వనాథ

ఒకటే కథ

వెదకి వేసారి నా వెఱ్ఱిబ్రతు కెపుడేని
తుదిరేయి కనుమూయునా,
బేలనై
నిదురబరువులఁ గ్రుంగునా,
మరపుమనకలదారి తెరచికొని కల యేదో
విరిసికొని పరతెంచును,
కాఱు రా
తిరికొనల మెఱపించును!

కలఁగి తొట్రిలుచు నాకలితొందరల సోలు
కరము లట్టే చాతునో,
నామందు
కనుల నట్టే తెరతునో,
అంతలో, నింతలో, నడుగుజాడయె లేక
వింతకల కరఁగి చనును,
నాకు నా
వంతకథయే మిగులును!

వనరు చేడ్వఁగలేను, చచ్చి చావఁగలేను
కనలేని వెలుఁగుకొఱకై
ఎన్నఁడును
కనరానిదానికొఱకై !

ఒక క్రొత్తబరువుతో, ఒక క్రొత్తయాసతో
ఒకఁడనే పడిపోదును,
శూన్యమున
ఒకఁడనే కృశియింతును !

కృష్ణశాస్త్రి

## ఆవృత్తి

ఆ ప్రశాంతనిశాజరఠాంతమందు
కలఁతనిద్దురలో కలల్ గాంచుచున్న
గౌతమీనది నా మనోగతవిషాద
తమము నంతయు తనలోన దాచుకొనియె;

ఆ నదీసైకతముల నాయడుగుజాడ
చెరిపివేయగ వెనువెంట నరుగుదెంచు
గాలితరగల చల్లనికడుపులోన
కన్నుమూసెను నా యూర్పుగాడ్పులెల్ల ;

చెడ్డదో మంచిదో మహాసృష్టియందు
జరుగు విషయంబులను దటస్థముగ నాయ
నంతగగనమునందుండి యరయుచుండు
తారలె, మహశ్రుకణముల నేరుకొనిరొ;

నేనె మిగిలితి నీగౌతమీనదీ ప
విత్రగర్భంబులో ప్రాతవెట్టుచున్న
యుగయుగాంతరవిశ్వమహోగ్రదుఃఖ
జీవగీతాల కావృత్తి చెప్పుకొనగ!

శేదు ●

## ప్ర వా స ము

ఎన్ని యెన్ని నిశ్వాసము లెగసినవిరో
ఈబ్రతుకె రూపుమాసిపోయినది గాని,
ఇంతవిశ్వమ్ములో జాలి నింతనీడ
ఒదవగాలేద యొక్క నిట్టూరుపునకు!

కంట గురిసిన కార్చిచ్చుమంటయేళ్ళ
కాలి నుసియై నశించె వాంఛాలవాలె,
ఏ కెరుంగుదురని ఏ యెడారిదార్ల
నింకెనో చుక్కతడి జాడ యేని లేక!

కరుణపట్టున కీ బిచ్చగానిచేయి
చాచికొనినాడ మృత్యుఘోషమ్మె మరచి,
వట్టిబయలున నొక మోడుచెట్టువోలె
ఎత్తినది కర మెత్తినట్లే కృశించె!

కనులు రెండును బండిచక్రమ్ములయ్యె
చనవుచూపున కెరుకనవ్వునకు వెదకి,
ఎందులకొ వెర్రిమదివోలె నిపుడు తిరుగు
చూపులే లేక అజ్ఞాతశూన్యసీమ!

స్వాగతాశ్లేషమున విడజాలు నెదల
నల్ల ద్రావితి మున్న దోసిళ్లకొలది,
వలపుటాకలి స్రుక్కు నా బ్రతుకుమీద
ఇనుపపాదాల నిడి లోక మిపుడు నడుచు!

ఆశయమ్ముల, ఆనందలేశముల, అ
లంతియాసల, జీవితమంత ఇట్లె
యేడ్చివైచితి, నినువారె యేరు లేక,
యేడ్పుసందడి నాలోననే చొరంగ!

వడవడ వడంకిపోదు జీవనపుగొనల
నెన్నడే నాసకళ తలయెత్తెనేని,
ఉభయసంధ్యాంచలముల నెదో వెలుంగు
కలుగ కలవరపోవు ఘూకమ్మువోలె!

మింట వెలుగు చుక్క గన్న, మిణుగు రన్న
నేను సహియింపలే, నవ్వి యిరులు చెరుచు;
నాకు ప్రాణమే మెఱపులే లేకయున్న
భాద్రపదమాసమున నమావాస్యరాత్రి !

రేయికడుపున చీకటిచాయ వోలె,
తమసుబెడద దివాంధగీతము విధాన,
ఘూకరావాన వలవంతరేక రీతి,
నా విషాదమ్ములో దాగినాడ నేనె !

కృష్ణశాస్త్రి

ఏమొ !

పొదుగు నొవ్వంగ బాధించు ముద్దులేఁగ
నొడలు నాకెడి గోసాధ్వియో ర్పదెంతో,
బాధ సళుపరించినఁగాని స్వాదువయిన
ప్రేమమాధుర్యము రుచింపదేమొ పుత్ర !

మాయపొరలు వీడిన సుకుమారశిశువు
నోరుదెఱచి యేడ్చెడిని యెందులకొగాని,
అంపకపుఁబెండ్లికూఁతుఁ గన్నారఁ జూచి
నిలుపలే దేమిటికిఁ దల్లి నిండుటేడ్పు !

పడకటిలుఁ జూచి యేడ్చు జవ్వని యొకర్తు
చనినదెసఁ జూచి యేడ్చు జనని యొకర్తు,
తనసొగసుఁ జూచి యేడ్చు సుందరి యొకర్తు
ఏడుపుఁ బ్రియమ్ముగా వచియింతరేమొ !

* * *

రాయప్రోలు

## సమాలోచనము

ఇది నిశాంతతమఃక్రాంత, మిది దరిద్ర,
మీ నిశాంతమ్ము శూన్య, మిం దెన్నడో ర
హ శ్శిథిలసుప్తి గలవరమంది, లేచి,
గుబులుగొను, లేతనెత్తావిగుసగుస లెవో!

అంత నీ యంధమందిరమందు, నొక్క
రెప్పపాటు వేకువ, ఒక్క రెప్పపాటె,
ఉన్మిషితజీవనాగమనోత్సవమ్ము,
ఉదితగీతాప్రవేశముహూర్తవేళ!

అప్పుడే గృహనేత్రవాతాయనముల
కొలుకులందు, లే వెలుంగు తళుకు జివురు,
లరుణమసృణతోరణపంక్తు, లల్లు నేమొ,
ఆడునేమొ, వాడిన మోము లట్టె వాల్చు!

తెరచికొన్న ద్వారము జొచ్చి, విరిసికొన్న
వాకిలిం జేరి, మంగళవాద్యపాళి
గద్గదిక వోవ సవరించి గళము, పాడు
నేమొ, నిర్జీవనిశ్శబ్ద మిట్టె మూగు!

మరల గ్రుడ్డిరాతిరి పడు, మరల నోరు
కాని శ్రుతులేని లేని చీకటులు మరల
మరల పాడిల్లు...

కృష్ణశాస్త్రి

## సుప్తాస్థికలు

అవి ధరాగర్భమున
మానవాస్థికాపరంపరలు!
సుప్త నిశ్శబ్దసంపుటములు.
అట నొకే దీర్ఘయామిని!
ఆ నిశా శ్మశానశయ్యకు
ప్రాతఃప్రసక్తి లేదు;

ఆ అగమ్యతమోరహస్యాంగణాన
తాండవించును
మృత్యుశైత్యల్య మొకటె!

అవి నిశాంతహేమంతహృదంతరంత
రనుభవాళి
ఘనీభవించిన సమాధులు!

ఆ మనుష్యాస్థికలు,
నిద్రలో మునింగి
సంచరించును భైరవస్వప్నవీథి!

అవి చలించును,
తమ చర్మకవచ మెపుడో
బ్రదికినదినాల తలపోత బరువుచేత!

నా కనుంగవ
కన్నీళులై కరంగు
అవి ఒనర్చెడు నీరవాహ్వాన మెరిగి!
ఇంత శోషిల్లు నేలో నాహృదయపుటము,
వణుకు నేటికో
నా అస్థిపంజరమ్ము!

శ్రీ శ్రీ

## చ లి పి డు గు

ప్రళయాంతాభీలనభో
దళన ఘళఘళారవముల
చలిపిడుగా! గర్జింపకు,
నిలిచి నాదుమనవి వినుము:

బంగారపుబొమ్మ నాదు
మంగళప్రదమ్మ యొంటి
రుద్రభూమి గటికనేల
నిద్రించెడు నొడలు మరచి,

చూపబోకు మచట నీ ప్ర
తాపమెల్ల పిడుగా! నా
కన్నతల్లి యడిలి లేచి
కర్కటిల్లి యేడ్వగలదు!

కడుపుమంట గనలి పొక్కు
కన్నతండ్రినైన నాదు
పలువరింతమాటలకును
నలుక బూనకయ్య మదిని!

ప్రళయాంతాభీలనభో
దళన ఘెళఘెళారవముల
చలిపిడుగా! గర్జింపకు,
నిలిచి నాదుమనవి వినుము!

బసవరాజు

## దురదృష్టము

చూచితి నెంతో దేశము
సుఖము, శాంతి, దొరకునో యని;
మునిగితి నెన్నో నదులను
మోక్షము చేపట్టుద మని;

ఎక్కితి నెన్నో కొండల
నీశ్వరు దర్శింతా మని;
మ్రొక్కితి నెన్నో వేల్పుల
కొక్కవందు పర మిమ్మని;

నోచితి నెన్నో నోములు
కాచి బ్రోచు నని పార్వతి;
కడకు దేవిదయచేతను
కంటిమి రత్నములు రెండు;

బతుకు కలంకారములో
వాని దాచ చేతగాక
ఎచటనో పోగొట్టుకొంటె
మెంతటి దురదృష్టముననో ?

సౌదామిని

## తల్లి

తల్లి, అసహాయవై నీవు ధరణిమీద
పడితి వెప్పుడు నాదుగర్భంబు చీల్చి,
ప్రకృతియంతయు నూత్నశోభల వెలింగె,
ప్రాణనాధుడు నా నిజప్రాణ మయ్యె!

ఎప్పు డేడ్చితి వీవు నోరెత్తి, యెడద
తత్క్షణంబ కృపాక్షీరధార లుబికె,
చిన్నినవ్వొప్ప నీమూర్తి చిందులాడి
హృదయము కలంచె, ఎరిగితి ప్రేమబాధ!

చిగుఱుపెదవుల ముద్దులుచిల్క, నెపుడు
‘తల్లి!’ యని పిల్చి నన్నీవు దరిసినావొ,
అపుడు శ్రుతమయ్యె సృష్టిరహస్యమెల్ల,
‘తల్లి!’ యని మారుపిల్చి నిస్తబ్ధనైతి !

ఆత్మయే గాక నాదు దేహమ్ముకూడ
కొల్లగొట్టి మాధుర్యంపుకుప్పవగుచు
తల్లి, నిశ్చింత నను వీడి తరలిపోతె,
'తల్లి!' యను నాదుఆర్తనాదమె మిగిల్చి !

సౌ ౧

## మాతృగీతములు

ఎవ్వఁ డాక్రూరకర్ముఁ డెవఁడు, నీల
జలదనిర్ముక్తశైశిరశర్వరీప్ర
శాంత మలవాటుపడిన నిశాంతమందు
అకట, నట్టింటిదీపమ్ము నార్పినాడు !

ఎవ్వఁ డానిరసాత్మకుం డెవఁడు, సాంధ్య
రాగమంజులరేఖావిరాజమాన
మంగళాకాశసీమంతరంగమందు
కాటుఁజీఁకట్లరాసులు గ్రక్కినాఁడు !

ఎవ్వఁ డానిర్దయాస్వాంతుఁ డెవఁడు, నన్నుఁ
గంటకనిగూఢవిపినమార్గములఁ, దల్లి
లేనిబిడ్డను గావించి, మానసంపు
టాసలన్నియు నడుగంటఁ గోసినాఁడు!

౨

నేను జడబుద్ధినై నుంత నీదు పూజ
కై వలయు వస్తువుల్ సమాయత్తపఱుప
మఱచితినయన్ను, నా కిట్టి మఱువరాని
శిక్ష ఘటియింప నీ కెట్లు చేతులాడె?

ఎంతకాలమ్ము పట్టినదే? త్వదీయ
పూజకై ద్రవ్యసంతతుల్ ప్రోగుసేయు
టింకను సమాప్తి లేదు తల్లీ! యిఁకొక్క
వత్సరమ్మైన నీ వోర్పుఁబట్టలేదు!

ఇంక నాజీవితమ్ము నీ స్మృతికిఁ జిక్క
బడిన యొకశాసనమ్మయి వరలు నటవె!
చిన్ని నీ విగ్రహము ప్రతిష్ఠితము నాదు
నంతరంగమ్ము నీకు దేవాలయమ్ము!

## 3

నీవు మడిగట్టుకొనిపోయినావు పండ్లు
పుష్పములు బట్టుకొని దేవపూజ కేటకో;
నేను నీకొంగుఁ బట్టుక నీదువెంటఁ
బోవుటకు లేక కన్నీటిబొట్లు రాల్తు!

నీవు పోయిన దెచటనో దేవళంబు,
లలితపూజావిధానసంలగ్నహృదయ,
వావినిశ్చలధ్యానసమాధియందు
మఱచిపోదువో యేమొ నామాటఁ దల్లి!

నేను నీ కన్నబిడ్డను, నిశితమైన
నా కడుపుమంటఁ జల్లార్పు, లోకనాథ
పాదకంజమరందమ్ము చేఁదు కడుగు
ప్రత్యహమ్మును నీ చనుఁబా లొసంగి!

నాయని

## పుష్య పూర్ణిమ

పున్నమ యేగుదెంచె, పరిపూర్ణసుధాకరబింబ
మల్లదే చెన్నలరారెడిన్ గగనసీమను,
చల్లనిపండువెన్నెలల్ కన్నులపండువై కడల
గ్రమ్మె, సమస్తము మోదభోగ్యమైయున్నది
కాని, నాహృదయ మొక్కటె క్రాగెడి
దుఃఖవహ్నికిన్ !

హ్లాద మొసంగుగాదె యఖిలావనికిం గడు
జ్యోత్స్న, యందులో మోదము మీరగా
భువనమోహనమై తనరారు పూర్ణిమన్ !
నా దురదృష్టభారమున నైజమె పో
తలక్రిందులౌటచే ఖేదము మేదురం బగుచు
కేవలమున్ హృదయంబు నేర్చెడిన్ !

పుట్టిన దామె యో విమలపూర్ణిమ,
నీ హృదయంబునందు! చేపట్టిన దస్మదీయ
మృదుపాణిని, మత్కరపల్లవంబునం దిట్టె
గతించిపోయె హృదయేశ్వరిదివ్యవయోవిలాస,
మిప్పట్టున ఘోరమై మిగిలె ప్రాణవిశోషక
దుఃఖకీలియే !

ఆయమ యెట్టిదో యెఱుఁగ వక్కట!
రొక్క నిమేషమేనియుం బాయక నన్ను
ఛాయవలె, బాహుయుగమ్ము సమాశ్రయింపదే!
నీ యుదరంబునందున జనించిన దానిని
నీ కుమారికన్ న్యాయమె వీడి నీ విటులు
నాకు గనంబడ పుష్యపూర్ణిమా!

ఎంతయు సంతసించు హృదయేశ్వరి
పున్నమరాత్రులందు, మత్కాంతి విలాససంపద
నఖండితమై తనరారుచుండు నాస్వాంతము,
చూచుచుండగనె స్వప్నవిధంబున
మారిపోయెనే యంతయు భాగ్యదేవికుపి
తారుణ దారుణ వీక్షణంబునన్!

వచ్చుచునుండు ముందు
ననివార్యవిధంబున పూర్ణిమానిశల్,
ముచ్చటమీర లోకము ప్రమోదమునొందు
యథావిధంబుగన్, అచ్చపుమోదసారమగు
నామె గతించుటచేత చంద్రికల్ చిచ్చులమాడ్కి
నాహృదయసీమ దహించుచునుండునే కదా!

శివశంకరశాస్త్రి

## ప్రేమయాత్ర

కమలినీప్రేమభిక్షాటనమున కవుడె
ప్రాకివచ్చుచునుండె దివాకరుండు;
హృదయమున వెల్గు ప్రేమచిహ్నితసహస్ర
భావభానువు లలము నాశావధులను!

యుగయుగమ్ములుగా తమ మ్మొదిగి యొదిగి
తిగ్మరోచిస్సహస్రమూర్తిని గమించు,
వాని భేదింప దశదిశావళులు దాటి
తనయనంతమహోజ్యోతి ధారవోయు!

కమలినీప్రేమబంధము విదిర్చి
మఱలమఱల తమోంధబంధురపిశాచ
నృత్యములు, కాలజీమూతనిబిడమృత్యు
హాసములు, ఘోరలోకలోకాంచలములు...

యుగయుగమ్ములుగా తమ మ్మొదిగి యొదిగి
తిగ్మరోచిస్సహస్రమూర్తిని గమించు...
వాని భేదింప దశదిశావళుల దాటి
తనయనంతమహోజ్యోతి ధారవోయు!

పెనుమర్తి

## అశాంతి

కనికరము లేని దుఃఖవేదనల సెగల
పొగల వెలిజిమ్ము వలపుటూర్పుల భరమ్ము
మోసికొని నేనె నాలోన మూల్గుకొనుచు
గాలివోలె సమస్తావకాశములను
నెడ తెఱపిలేక తిరుగాడి బడలినాను;

దారుణపుజీవితంపు టెడారిలోన
తీరనిపిపాస నేదారి తెన్ను లేక
నేనె నా దుఃఖబాష్పశోణితలహరుల
నేవిసుగు వేసటలు లేక త్రావినాను;

కడుపు గాల్చెడు మండుటాకటను రేగి,
కోర్కె లొండొంటిని గ్రసించుకొనెడుకొలఁది
ఒడ లెరుంగక కాలమృత్యువును నేనె
కొంచెముగ కొంచెముగ కబళించినాను;

కాని, ప్రోఢైననా యెదలోని బరువు
దీర, నా బ్రతుకూపిరి దేరుకొనగ,
కనికరపుచూపు, చిఱునవ్వుతునుక యైన,
కటికికఱవయ్యె, పాడులోకాన నాకు;

ఏకడల మిన్నుమను చుక్కయేని లేని
యీనభము క్రుంగి కూలిపోయెడివిధాన
కారుమబ్బులె కాదు, చీకటులెగాదు,
క్రమ్ముకొననిమ్ము, కరడులు గట్టనిమ్ము;
వలపుతీపియెఱుంగని వట్టి రాతి
గుండెలోకమ్ము నిప్పులు గురియనిమ్ము,
హృదయ మున్నంతవరకు, నా ప్రేమ కాంతు
బ్రదికియున్నంతవర, కేడ్చి, బ్రదుకుచుందు!
ఏ వెలుగు నన్ను తనదరి కీడ్చుకొనునో!
ఏతలపు దారిసూపునో!

శే దు .

## ఉన్మత్తపథికుడు

నావలెనె యతం డున్మత్తభావశాలి,
ఆగిపోలేడు రేగునూహాల నొకింత!
ఎట్టి నిశినే నదరిపోవు నెగసిపడును!
ఎన్ని చుక్కలపాటు లెన్నెన్ని మెరపులు!

ఇంత చిరుగీతి యెద వేగిరించు నేని
పాడుకొనును తాండవనృత్య మాడుకొనును;
మస్తక మ్మారగా వంచి, మన్ను మిన్ను
వేయి కే లాడగా వ్రాసివేసికొనును!

ఏ నెరుంగుదు, నావలెనే యతండు
పాటపదములకై నిత్యపథికు డయ్యె;
ఏ నెరుంగుదు, నావలెనే యతండు
ప్రతిపదమ్మున శీతలస్వాదుమధుతు
షారముల పార్శ్వముల విరజల్లు చేగు!

కృష్ణశాస్త్రి

## స్వామి!

స్వామి! పరిగాఢశర్వరీచ్ఛవి, దరిద్ర
తానిధానము, తేజోవిహీన, మనవ
రతపరిస్రుతబాష్పధారామిలితము,
నన్ను నీ వుండుమన్నాంగణంబు తండ్రి!

ఈమహాంధకారంబున నెపుడో యొక్క
సారి మొరసితి, వానాడు సామి! నాకు
టీర మానందవాయుప్రచారశతస
హస్ర కుసుమపరిమళవ్యాపృతంబు!

దానితో సరి, మరల నాంధ్యమ్ము క్రమ్మె,
తొలి చివర లేని యీచీకటులును, నేను,
ఒక్కరొకరఁ దప్పళించుకొంచుండినాము,
నిన్ను, నీ నాటిమెఱుపు మన్నించుకొంచు!

విశ్వనాథ

## ఆ శా గా న ము

ఏసడి లేక యీప్రకృతియెల్ల
గభీరనిశానిబద్ధమై నీసుకుమారహస్తముల
నిద్దురవోయెడు మౌనవేళ, నీవే సరిజేసి
యీశిథిలవీణను పాడుమటంచునాపయిన్
ద్రోసెదవేల, తీగ తెగునో, శ్రుతి దప్పునో,
పల్కదో, ప్రభూ!

మావులగుంపులందు, మధుమాసములన్
వికసించు కోకిలారావము వోలె,
రాగమధురమ్ముగ వీణ నదింపఁ జాల;
నన్ బోవగనిమ్ము, ప్రేమరసపూరితవిశ్వవిలీనగాన
మీవే వినిపింతువేని సుఖయించెద నే
నది యాలకించుచున్!

ఏవిధినైన పాడుమనియే వచియింతువయేని
ప్రేమమై నీవె రచించి నాకు గరుణించిన
వీప్రణయార్ద్రగీతికల్ గావున,
నావిశుష్కితగళమ్మున నీ కరుణారసామృత
శ్రీవిభవమ్ము నింపి మధురింపుము
నే శ్రుతిగల్పి పాడెదన్!

**శే దు ల**

## న ట రా జ!

అవధరింతువు ప్రతిదివసాంతమందు
నిత్యనూతనతాండవనృత్యకేళి,
ఓయి నటరాజ, తలల్కైన నోపలేక
భువనములు దుర్భరానందమున నడంగ!

అప్పు డూహాంచలమ్ముల నతిశయించి
పొరలు నమృతరసంపుమాధురులలోన
గొట్టుకొనిపోవు, స్వామి, నా క్షుద్రజీవి
తమ్ముగూడ, దారియె లేక, తనివిపోక!

అంత నే వెర్రినైపోదునయ్య; నిన్ను
బోలి పాడబోవుదు; నిన్నుబోలి నాట్య
మాడబోవుదు, లజ్జ బోనాడి; కాక
యింతదాహమ్ము దహియింప నెటులు మనుదు!

ఏవిధాన సౌందర్యరసైకజీవి
నిలువనేరుతు నిట నొక్కనిముసమేని,
మామకీనజీవితశూన్యమార్గముల త్వ
దీయపాదమంజీరముల్ మ్రోయకున్న!

ఆటతో పాటతో నేర్చినట్లు దేవ
ఏనుకూడ నీవలె నటియింపనిమ్ము
ఎడతెగనియీయాత్ర నెట్లో సాగించువరకు!
ఎట్లో నీ దర్శనమ్ము సాధించువరకు!

కృష్ణశాస్త్రి

## ఉత్కంఠ

అనుపమ ప్రణయాతిథేయమ్ముతోడ
పారదెరచితి హృదయకవాట మిపుడె,
నీ గృహమె నీవె కైసేయ నేగుదెమ్ము,
మొయిలు చీకట్లు క్రమ్మకమున్నె నాథ!

వలపులొలికెడుపూవులు వాడిపోయె,
కనకపీఠిక హారతి కునుకుచుండె,
తమ్మిరేకులసురటిపొంకమ్ము తొరగె,
ఒంటి నిక నెంతసే పిటులోర్తు స్వామి?

ఏమిదోషంబు దలచి న న్నీవియోగ
శోకమున ముంచి బాధింపజూచె దీవు?
చెప్పరాదొకో; ఇటకు రా నొప్పవేని
వెదకికొనివత్తు నేనె నీ పదము జేర!

కలసి త్రోత్రోపులాడెడు కారుమొయిలు
రాయిడి మునింగి, భీకరమాయె రేయి,
దివ్యతేజస్వి, నీ వరు దేరకునికి!
అనదనై పడియుంటి శూన్యాలయమున!

వేదుల

ఏకాంతసేవ

రజనీముఖంబున రాగంబు మెఱసెఁ
గలువపుట్టింటిలోఁ గలకల విరిసె
దివ్యసౌధంబులో దీపాలు వెలిగె
గర్భాలయంబులో గంటలు మ్రోగెఁ
బ్రాకృతీమణి పట్టె బంగారుగొడుగు
విశ్వసుందరి వీచె విరిచామరంబు
భవదఖండానందభవనాంగణమునఁ
బడిగాపు బడియుండెఁ బ్రకృతిగణంబు
ఆఁకలైన నెఱుంగవైతి వేమయ్య!
ఆరగింపఁగ వేళయయ్యె రావయ్య!

## ౨

విరిదండ మెడలోన వేయుటేకాని
కన్నార నీమూర్తిఁ గాంచనేలేదు,
ప్రణమిల్లి యడుగులఁ బడుటయేకాని
చేతులారఁగ సేవఁ జేయనేలేదు,

నినుఁ గాంచి ముగ్ధనై నిల్చుటేకాని
ప్రేమదీరఁగఁ బల్కరింపనేలేదు,
ఏమేమొ మనసులో నెంచుటేకాని
తిన్నగా నాకోర్కిఁ దెలుపనేలేదు,

బోధంబులో సుప్తి పొడచూపఁబోలు
కనులలోఁ జూపులోఁ గావిరుల్ గ్రమ్మె,
శుభ్రాభ్రపదములో సుడి బుట్టఁబోలు
భక్తిలోఁ బూజలో భ్రాంతులు వొడమె,

నాదంబులోఁ గంపనము బుట్టఁబోలు
తలఁపులోఁ బలుకులోఁ దడబాటు గదిరె,
వెలుఁగులోఁ జీఁకటి విరిసెఁ గాఁబోలు
మనసులోఁ దెలివిలోఁ మఱపులు దోఁచె,

ఆనంద మందు లేే యపచార మనుచు
నవశనై యుండు లేే యపరాధ మనుచు
మది నెంచి యీరీతి మాయలు సేయ
భావ్యమై తోఁచెనే ప్రాణేశ నీకు!

వేంకటపార్వతీశ్వరులు

## ముక్తావళి

పూవులరోజులున్ గడచిపోయె
విషాదహిమావృతాంధకారావిలమయ్యె
నీప్రకృతి యంతయు, ఆకులపాటు నొంది
పూదీవెలు నాదులేయెడదతీరున మ్రోడయిపోయె,
నాటియాజ్ఞావిధి స్వామి, నాకిపుడు జ్ఞప్తికివచ్చి
భయమ్ము గొల్పెడిన్!

ఈమధుమాసశోభ గతియింపకపూర్వమె
పూలతోటలో కోమలపుష్పముల్ వెదకి కోసి
యమర్చిన ప్రేమదామమున్ నా మెడలోన
వేయుమనినా, వపు డొక్క నుమమ్మునైన
నా స్వామి, భవత్పదార్పణము సల్పగలేనయితిన్
విమూఢతన్!

నావలె శుష్కజీవనమునన్ దురపిల్లెదు
ఈపవిత్ర గోదావరి పేదవడ్డ వినదమ్ములతో
శ్రుతి గల్పి ప్రేమరాగావహదుఃఖగీతు లివు
డల్లుచు గ్రుచ్చుచునుంటి నొక్క ముక్తావళినిన్
పవిత్ర నయనాంబుకణోజ్జ్వల
మౌక్తికమ్ములన్ !

ఈ సుకుమారమాల ధరియింపుము
నీ హృదయమ్మునందె స్వామీ! సుముఖమ్ములై
పరిణమించు పవిత్ర వసంతమాససంధ్యా
సమయాంతరమ్ముల రవంతి భవన్మధురార్ద్ర
దీర్ఘ నిశ్వాసపరిమళానిలపు స్పర్శను
ప్రేమ ననుగ్రహించుచున్ !

వేదుల

మనవి

చుక్కలుతిరిగే హిమాద్రిపై ఆ
వాసముచేసే గౌరీశా!
విన్నావయ్యా నా మనవొక్కటి,
విన్నవించనా గౌరీశా!

త్వచ్ఛిరగంగాశీకరసేచిత
పుణ్యభూమిలో పుట్టాను,
త్వత్పాదారుణకమలమరందము
తనివితీరగా తాగాను!

సృష్టిమరుగునా తళుకు తళుక్కున
మెరిసేకాంతులు చూస్తుంటి;
కాలము దాటి, దిక్కులు దాటి,
కదిలే తేజము కనుగొంటి!

కళ్లు తెరవగా కానవచ్చినవి
కాలుసేతులకు సంకెళ్లు,
మాటలాడుటకు పెదవి విప్పగా
తాళము పడ్డది నా నోరు!

నీ పాదాలకు నిత్యసేవ నే
నెట్లు చేతునో సెలవిమ్మా?
నీ నామాంకితదివ్యగీతములు
ఎట్లు పాడుదును సెలవిమ్మా?

యక్షులు పాడే హిమాద్రిమీద
కొలువుండే ఓ గౌరీశా!
విన్నావయ్యా నా మన, విప్పుడు
పాలించెదవా గౌరీశా?

దీక్షితులు

## శివరాత్రి ప్రభ

కాలకంఠుని నాగసర్పము
కుబుస మూడ్చి పడగ బుస్సంది,
రెండునాల్కలు......
గండుమీసాలట్లు దూసింది
చెవులు మోసింది;.........
నాగసార మూదేది యెవరోయి,
రాగ మొలికించేది యెవరోయి?
కాటునల్లని కాళరాత్రి!

నొసట గొసరిన మూడో కన్ను
నివురులూదినకొలిమిఁ దెగడి
నెగడి ద్రిప్పింది,......
పొగలు గప్పింది;......
కమ్మ రయితే యినుము కరగ,
సోమ రయితే చలిని కాగ,
ఎవరు వచ్చేరోయి?
ఎవరు మెచ్చేరోయి?
కాటునల్లని కాళరాత్రి!

అర్ధభాగపుమహాంకాళీ
కర్ధమది కాలేదో ?
ఎమో ? ... ...
పునుకులా గలగలలు వింటూ
కునుకు గన్నాదో ?......
నాథునీ వ ద్దనదు నాట్యము,
నాదు నీ క ద్దనదు:......
అరరే ఆడిపోతున్నాయి !

వాడి ముమ్మొనవాలు...
హుతభుక్,......
అజకపాలం,......
డొక్కు డుబడుక్......
నాల్గుసేతులనాడు లాతున్నాయి !
అశ్శరభ ! శరభ !
పందెమూ వేసేది యెవరోయి ?
కుందనము గానేది యెవరోయి ?
కాటుసల్లని కాళరాత్రి !

చంద్రమకుటము,......
జటాజూటము,... ...
సాంద్రనీలపుఁజడలపావట

సురిగిపోతున్నాయి!

చక్కనీ మువ్వన్నె చర్మము

అక్కళించినపొట్టపైని

ఆంటియుండీ అంటకున్నాదోయి,

'ఆకలా' అని యనే దెవరు?

'షోకులా' అని యనే దెవరు?

కాఱునల్లని కాళరాత్రి!

మోకరింపులు గావు,

అది మఱి......

బూకరింపుల నిలువు గాదు;

ఆకడకుబడు నొక్క యంజ

యీకడకుబడు నొక్క యంజ

ఏకముగ జేయుచును

నడు మొక......

రేఖగాఁ దా వంచి గొంచు

సందియం లే కెంచువా రెవరు,

చిందు అని తో తెంచువా రెవరు?

కాఱునల్లని కాళరాత్రి!

అహంకారము లేదు లోలో
మహాణ్ణటనము మొగము చాటదు,
మహాదేవా! యభయమిడు మన
అభినయానకు హస్తమే లేదూ!
రభనమునఁ దన ముందు వెనుకల
ప్రభల గలిపించు;
ప్రభలలో ప్రభ నిలుప నెవరోయి?
ప్రభలలో ప్రభ గలుప నెవరోయి?
కాఱునల్లని కాళరాత్రి!

కవికొండల

## వటపత్రశాయి

ఒంటిగా నుయ్యాల లూగితివా
నా ముద్దుకృష్ణా!
జంటగా నను పిల్వదగదోయీ!
కంటికంతా జలమయమ్మై
మింటివరకూ యేకరాశై

జంటదొరకని మహాప్రళయపు
టింటిలో వటపత్రడోలిక
ఒంటిగా నుయ్యాల లూగితివా
నా ముద్దుకృష్ణా!
జంటగా నను పిల్వదగదోయీ!

జగము లన్నీ కాలయోనిలో
మొగము లెరగక నిదురబోవగ
నగుమొగముగల ముద్దుబాలుడ
వగుచు జోలల బాడుకొంటూ
ఒంటిగా నుయ్యాల లూగితివా
నా ముద్దుకృష్ణా!
జంటగా నను పిల్వదగదోయీ!

బసవరాజు

## నీ ర థ ము

ఓ ప్రభూ! నీరథమ్ము దీక్షా ప్రణీత
విధురవేగమ్ము పరువులు వెట్టుచుండ,
నా శరీరమ్ము దాని క్రిందఁ బడి నలిగి
నలిగి పోయినయది రక్తనదము లింక,

దివ్యతేజోవిరాజత్త్వదీయరథము
ఈ గతుకు డేమి? యనియైన నాగలేదు;
నా విరోధించిన హాఠాన్నినాదమునకు
వెనుదిరిగియైన మఱి చూచుకొనగలేదు !

నా దురక్తంబు నీ రథచోదకుండు
కడిగివేయును రేపు చక్రములనుండి,
అచటి బహుజనరక్తచిహ్నములయందు
నాది యి దని గుర్తేమి కన్పడును సామి?

వి శ్వ నా థ

## పూ జా ప్ర సూ న ము లు

రాలనిపూలు కోసికొని రమ్మని పంపితి
వీవె యీయుషఃకాలమునందు పెద్దయొడిగట్టి
ననున్; పవమానవీచికాజాలములందు నే
వలపుజాడల గట్టుచు వచ్చులోన
ఈ పూలవనమ్ముగుమ్మమును మూసిరి,
పిల్చిన పల్క రెవ్వరున్ !

ఈ పథమందు వచ్చు జనులెల్ల
రెగాదిగ నన్నుజూచి లో లోపల నవ్వుచుండ
నెటులో నిలుచుంటిని వేగుచీకటిన్
మావులువడ్డ లేతపొగమంచుతెరల్ పులకించిపో
ఉషః శ్రీపవనమ్ములెక్కి విహరించెదు
పూవులతావు లానుచున్ !

ఆ రవికాంతి నీలజలదావళిపై బడ
చిత్రవర్ణశోభారమణీయతల్ దివిని వ్రాలిన పోలిక
ఈప్రభాతగంభీరసుగంధశీతలసమీరము
నామెయి సోకినంత విప్పారెను
నావిషణ్ణహృదయాన
అపూర్వవిముగ్ధభావముల్ !

వేసవిరేల వేణువనవీథులయం
దలసప్రచారముల్ చేసిన కమ్మతెమ్మెరల
చిందులలో స్ఫురియించు గానవిన్యాసమువోలె,
మెల్లమెల నాచెవి సోకెను
నీ నిరంతరవ్యాసితవిశ్వఘోషణరహస్యము
దూరమునుండి పిల్వగన్ !

కాలము వెళ్లబుచ్చి విధికాళులపై
తలమోపుకంటె నే నేల స్వతంత్రధర్మము
వహింపగ రాదని తోటపెన్గడిన్ కేల స్పృశింప
వింటి నొక కేకను 'మాలికగ్రుచ్చ నెంచు
ప్రేమాలను లీవనిం జొర ననర్హాలు
వారల కంద పీవువుల్!'

**వేదుల**

## గురజాడ అప్పారావు

వైతాళికులనే మేలుకొలిపినవాడు. మార్గదర్శి. మేధావి. ఈయన గీతాలలో గౌరవాశయాలు, నూతనస్వచ్ఛత, స్వేచ్ఛ, ప్రత్యేకత ఉన్నవి. కవిత్వమును కళగా గ్రహించకపోలేము. కాని, సంఘ సంస్కారమునకు కొంత సాధనగా ఉపయోగించినాడు. కవిత్వాన్ని, కళను, తన ఆశయాలను నచ్చచెప్పడమునకు వినియోగించినాడు. చక్కని వాడుకభాషను ప్రవేశబెట్టి, సులభశైలిని పదాలు పాడి, ముత్యాలసరము కూర్చి భాషకు శాశ్వతమైన ఉపకారము చేసినాడు. కవిత్వం పండితుల ప్రత్యేకనిధి కాకుండా అందరికీ పంచిబెట్టు మార్గాన్ని నిరూపించినాడు. ముందురాగలవారికి 'మేగ్నాకార్టా' magnacarta సంపాదించినాడు.

జననం 1865 మరణం 1915

కృతులు : 1 ముత్యాలసరములు-చిన్నకథ 2 నీలగిరిపాటలు 3 సుభద్రాపరిణయం [ప్రబంధం-అముద్రితం]

## రాయప్రోలు సుబ్బారావు

అన్నిట తెలుగువాడు; అభిమానములో, భావములలో; పోడి మిలో, పొంకడలలో. తీయని మెత్తని పదాలను సున్నితంగా స్రావ ణంతో ఏరి నాజూకుగా పొదగగల గొప్ప, నడకలలో కులుకు విన్నాణ

ములు ఒప్పించగలశక్తి, ఈయనసొమ్ము. రవీంద్రుని సాన్నిధ్యమూ, వైష్ణవగీతాలలోని రక్తిమా ఈయనకు ఒకవింత సంస్కారాన్ని కూర్చినవి. 1913 నాటి ఆంధ్రోద్యమము ఈయన దృష్టికి ఆంధ్రతేజస్సును సాక్షాత్కరింపించినది. ఒకనాటి ఆంధ్రౌన్నత్యమును అపూర్వకవితా దృష్టితో చూడగలిగినాడు; ఆ నాటి మహాత్కార్యాలకు తనజాతిని పురికొల్ప తన కవిత్వాన్ని, కళనూ, ఆవేశాన్ని ఉపయోగించి నెల్లూరిసభలో దేశీయుల హృదయాలను కలచి, భక్తితో, బాధతో, ఆందోళనతో కారుతూఉన్న కన్నీటిజాలువెలుగులో పూర్వపుటాంధ్రౌన్నత్యమునూ, భావిశోభనూ, దర్శింపించగలిగినాడు.

జననం 1892

కృతులు : 1 కవితాంజలి [తృణకంకణము, స్నేహలతాదేవి, స్వప్నకుమారము గల సంపుటి] 2 జడకుచ్చులు
3 మధుశాల, [ఉమార్ ఖయ్యాం అనువాదం]

## బసవరాజు అప్పారావు

నగ్నంగా, నిజంగా ఉంటుంది ఈయనకవిత్వం. జిలుగూ తళుకూ ఉండదు. ఉండడానికి వీలులేదు. ప్రతిభావమూ గుండెచీల్చుకుని దూకుడుగా వొస్తుంది. అందుచేతనే ఈయనపాటలలో తొలిచరణాలే గుండెపట్టుకుంటవి. అనుభవాలే పాడుకుంటాడు, తనకోసమే ముఖ్యంగా అనిపిస్తుంది. జీవితంలో ఏదెబ్బతగిలినా, ఏసుఖంకలిగినా వెంటనే కవిగా పలుకుతాడు. మహాచురుకైన హృదయం. ఫక్కీ

గురజాడ అప్పారావు గారిది. కాని, కవిత్వం పూర్తిగా కళగా ఎంచుతాడు.

జననం 1894 మరణం 1933

కృతి : బసవరాజు అప్పారావు గీతములు

## సౌదామిని

[బసవరాజు రాజ్యలక్ష్మమ్మ]

కడుసున్నితము, మహాగభీరము; ఈ యమపలుకు, హృదయము. గుండెలువణికే విశ్వమంతప్రేమా, ఆ గాంభీర్యాన్నంతా అణచుకుని ఓర్చి ఎదురుచూసే మహత్తరశక్తి, ఈమె గీతాలలో పొంచి కని పించుతవి. నిరాడంబరమునకు స్వచ్ఛతకు ఈమె గీతాలు గొప్పవి. ఒక్కొక్క గీతం ఒక్కొక్క హృదయస్పందనం.

జననం 1904

## అబ్బూరి రామకృష్ణారావు

పదగుంభనలో 'కీట్స్' కవి వంటివాడు. కవిత్వంమొత్తంలో గొప్ప 'హుందా' గోచరిస్తుంది. ఉత్తమసంస్కృతకావ్యాలలోని పూర్ణతా, గౌరవమూ, లావణ్యమూ ఈయనపద్యాలలో ప్రతిబింబిస్తవి. నన్నయనాటి అక్కరలకు మార్పులుతెచ్చి కొత్తనడకలు నడిపించ డమేకాకుండా, స్వకపోలకల్పితాలైన నూతన చందస్సులుకూడా

కల్పించాడు. ఈయన పద్యాలలో ఒక్క పలుకుపట్టిచూసినా ఉత్తమ సంస్కారి అని తెలుస్తుంది.

జననం 1896

కృతులు : 1 ఊహాగానము - అపూర్వప్రేమ 2 మల్లికాంబ 3 నదీసుందరి

## వెంకటపార్వతీశ్వరులు

వీరు ఒకవిధంగా యుగసంధిలోనివారు. భక్తిపట్టున మహాపర వశులు. వీరివాణి కొండయేరువలె మంజుగానంతో అతిత్వరితంగా ప్రవహిస్తుంది. వైష్ణవగీతాలలోని ప్రేమోన్మాదం వీరి భావోద్రేకాన్ని ఎక్కువగా రగిల్చినది. భాషమూర్పులో, పలుకు విధానంలో నూతనత్వాన్ని కల్పించినారు.

ఓలేటి పార్వతీశం - జననం 1882

బాలాంత్రపు వెంకటరావు - జననం 1881

కృతులు : 1 కావ్యకుసుమావళి ౧-౨ 2 ఏకాంతసేవ 3 రత్నహారము

## దువ్వూరి రామిరెడ్డి

స్వచ్ఛంద ఆశయాలు, స్వేచ్ఛానురక్తి, నిర్మలజాతీయత ఈయనకు ఆవేశాన్ని ఇచ్చేవి. ఆంగ్లఫారసీవాఙ్మయాల మంచిపలుకుబడి గ్రహించినవాడు. నూతనభావాలనుసహితం తెలుగు జాతీయతను

అనుసరించి నిర్దుష్టముగా స్పష్టముగా పలికినాడు. పూర్వపద్ధతుల మీదను అభిమానము మెండయినా, అభిసారికవంటి కొత్తపోకడలు కల్పించినాడు. ఈయన కర్షకకవి. నగరవిజ్ఞానము చవిజూచినా జీవితము పొలముగట్టునకే మరలించినాడు. వాల్మీకి కళాసంపత్తిని అనుభవించగలడు, గరికపోచ కదలికతో హృదయం శ్రుతి కలిపి విశ్వవ్యాప్తజీవితరహస్యం గ్రహించగలడు.

జననం 1895

కృతులు : 1 కృషీవలుడు 2 జలదాంగన 3 నలజారమ్మ అగ్నిప్రవేశము 4 నక్షత్రమాల 5 నైవేద్యము 6 వనకుమారి 7 పానశాల

## తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి

పండితుడు, వ్యుత్పన్నుడు, హృదయంగలవాడు. ప్రేమించినాడు, బాధపడినాడు. జీవించినవాడు. పూర్వపుసంస్కారమంతా బలాన్ని కూరుస్తూఉండగా రాదగిన నూతనత్వాన్ని ఆహ్వానించినాడు. నూతనపంథాతొక్కిన కవులలో చాలమందికి బలమూ 'హుషారు' నిచ్చి నూతనకవిత్వయుగస్థాపన చేసినాడు. ఈనాటి ఇతరకవులవలె ఒకప్రియురాలికి ఒకగీతం కాకుండా ప్రేమించిన హృదయేశ్వరిపై ఒక నిండుకావ్యం అల్లుకొన్నాడు. ఈయనవాణి పాతపోకడలతో నూతనఅలంకారాలకు పొందికకుదిర్చి గంభీరంగా కనిపిస్తుంది.

జననం 1892

కృతులు : 1 హృదయేశ్వరి 2 ఆవేదన

## విశ్వనాథ సత్యనారాయణ

పండితుడు, కవి; పద్యాలలో ఎన్నిపోకడలైనా పోగల శక్తి మంతుడు. ఏవిషయాన్నైనా కవిత్వదృష్టితో చూడగల కళాశీలి. ఈయనరచనలో ఎక్కువగా కనబడేవి బలమూ, జీవమూ. రాయప్రోలు సుబ్బారావుగారినివలె ఈయనకూ ఆంధ్రాభిమానము పూరించినది. నేడు పాడుపడిఉన్న వేగి,ముఖలింగమువంటి క్షేత్రాలు కాలాన్నిదాటి ప్రసరించే ఈయనచూపునకు ఎదురువచ్చి ఒకనాటి తమశోభతో దర్శనమిచ్చి ఆవేశపూరితుణ్ణి చేసినవి. ఈయన ఆంధ్రుడు, ఆంధ్రత్వంలో మహాగర్వి. కవిత్వపోకడలలో, ప్రాచీనప్రయోగాలలో గడసరి.

జననం 1893

కృతులు, 1 ఆంధ్రప్రశస్తి 2 కిన్నెరసానిపాటలు – కోకిలమ్మపెళ్ళి 3 గిరికుమారుని ప్రేమగీతాలు [అముద్రితం]

## చింతా దీక్షితులు

ఎంత ఆకాశపథాన్ని విహరించే భావాన్ని అయినా భూమికి దింపి సంఘానికి తెలుగుదారి చూపేటట్టు కవిత్వపథానికి పట్టించు తాడు. శిష్టవ్యావహారికము క్రమగా పటుందాగా వాడినాడు. పద్యాలలోకూడా దానికి గౌరవాన్ని సంపాదించినాడు. గురజాడ అప్పారావుగారిని, వారి ఆశయాలనూ అభిమానంతో చూసుకునే వాడు. భాషగౌరవాన్నిబట్టి, ఉత్తమ ఆదర్శాలను బట్టీ ఈయనను పోల్చుకోవచ్చును. కథకచక్రవర్తి ఈయన.

జననం : 1891

కృతులు : 1 ఏకాదశి [కథలు] 2 శబరి [నాటకం]

## నోరి నరసింహశాస్త్రి

చిన్నవయస్సులోనే అళలుకొల్పి పలికినవాడు. ఆంగ్లకవుల పద్ధతులను అనేకవిషయాలు గీతాలు చేసుకున్నాడు. చురుకైన మెదడు. కళమెలకువల నెరిగినవాడు. అళలుకొల్పి నెరవేర్చక వదలినాడు. సోమనాథవిజయం, క్షేమాభిక్షునివంటినాటకాలు ఈయన కళాకౌశలాన్ని ప్రకటిస్తవి.

జననం 1900

కృతులు : 1 గీతమాలిక 2 భాగవతావతరణము [పద్యనాటిక] 3 సోమనాథవిజయం [నాటకం]

## కొడవటిగంటి వెంకటసుబ్బయ్య

సాహితీసమితి తొలిరోజులలోనివాడు. ఆరోజులలో ఈయన కవిత్వానికి చాలా పలుకుబడి ఉండేది. ఈయనపద్యాలలో మృదుత్వమూ, హాయీ ఉన్నవి. ఈయన 'భిక్షువు' 'సెలయేరు' ఎప్పటికీ రుచించేవే. ఆధ్యాత్మికమైన అన్వేషణకై కుటుంబాన్ని మిత్రులను విడిచి ఏహిమాలయాలకో వెళ్లిపోయాడు. కవిత్వంకన్నా ఎక్కువైన దానినీ, కుటుంబంకన్నా మిత్రులకన్నా చేరువైనదానినీ దేనిని సాధించాడో, ఈనాటికీ అజ్ఞాతంగానే ఉన్నాడు.

జననం 1897

కృతి: సంధ్యారాగము

## నాయని సుబ్బారావు

పద్యాలు జీవితాన్ని చీల్చుకుని వస్తవి. అందుచేతనే అంతబాధ కరంగా ఉంటవి. గుండెలకు తగిలేటట్లు చెబుతాడు, యత్నం లేకుండా. పద్యనిర్మాణమునకు పాటుబడినట్లు కనిపించదు. అదే ఈయనకళ, గొప్పది. కవిత్వం ఈయనను వరించినది - వలపులో, విరహంలో, వేదనలో, మాతృప్రేమలో. ఈయనకవిత్వానికి హృదయం గీటురాయి. ప్రియురాలిఎడబాటు పిచ్చివానిని చేసినది, తల్లి మరణం ఘోరమనిపించినది. ఆనందంలో స్వర్గవీథులలో విహారం చేయించుతాడు. బాధలో హృదయం చీల్చుతాడు. బ్రతుకులో కవిత్వం ఏరుకుంటాడు. ప్రతిపాదం జీవించే పలుకుతాడు. ఈయన గీతాలు ఉజ్జ్వలములూ, ఉన్నతములూ.

జననం 1899

కృతులు : 1 సౌభద్రునిప్రణయయాత్ర    2 ఫలశ్రుతి
3 మాతృగీతములు

## వేదుల సత్యనారాయణశాస్త్రి

కవిత్వపులోతు తెలిసినవాడు; అనగా భావాన్ని భాషనూ ఒక్క శ్రుతికి పెనచగలవాడు. భాష లొంగినపనిముట్టు. ఎంతక్లిష్టమైనభావాన్నైనా చక్కగా చెప్పి పద్యం సుఖంగా నడిపించగలడు. వృత్తాలు నడిపించడం ఈయనసొమ్ము. జీవితం దుర్భరంగా తోచినప్పుడు అనుకుములుతూఉన్న వేదననంతా పాడుకుని ఓదార్పుచెందినాడు. అందుచేతను 'షెల్లీ' పలికినట్లు ఈయన అతితీయని. కవిత్వం ఏ తీరని

వేదననో కలవరపెడుతుంది. ఈయన 'పూర్ణిమ', 'దీపావళి నాడు' వంటిపద్యాలు తరుచు లభించవు. హరీంద్రనాథుని అంతటి కవి 'దీపావళినాడు'వంటి పద్యానికి గర్విస్తాను అన్నాడు. ఈయన పద్యనిర్మాణంలో పూర్వులశిల్పంకూడా కొత్తవొయ్యారాలు కులుకుతుంది. ఈయన ఏభావాన్ని రేకెత్తించినా దానిలో అధునాతన తేజస్సు గోచరమవుతుంది. కాళిదాసు కావ్యాలలోని పరువమూ బరువూ ఈయన పద్యాలలో కనిపిస్తుంది.

జననం 1900

## దేవులపల్లి కృష్ణశాస్త్రి

శిల్పి, గాయకుడు - కవిత్వంలోకూడా. సన్నపోగారు చెక్కడంలో 'మ్యూరల్ డెకరేషన్'లో మహానిపుణుడు. 'కీట్స్' 'షెల్లీల' పద్ధతిని పదాల కూర్పులో నూతనసృష్టిగావించుతున్నాడు. ఇది తెనుగుకవిత్వభాషకు ఈయన ప్రత్యేకఈవి. ఊహాతీతమైన దేనికో అర్రులుచాచే ఆశాజీవి. ఆశయాలలో,అనుభవాలలో కొత్తందనము, విశేషప్రత్యేకత ఉన్నవాడు. ప్రేమకై విదాహం పొందాడు, విరహంలో వేగిపోయాడు. ఈ అనుభవాలను శాశ్వతశిల్పాలుగా నిర్మించాడు. దుఃఖించాడు ప్రేయసిమరణానికి; కాని దుఃఖం మారినది అవ్యక్త వేదనగా. చివరకు దుఃఖాన్నే వరించ మొదలుపెట్టాడు. ప్రేమించాడు వ్యక్తులనేమో! కౌని, ప్రేమతెరిచిన గవాక్షాలగుండా హృదయం పరుగువారినది, వింతమిణుగురులకు, తళుకుమెరుపులకు; వీడని ఒక వేదనతో, దొరకని ఒక తేజస్సునకై. పాటలలో ఈయనను దరిజేరగలవారు లేరు. బ్రాహ్మమతం కోరిన

స్వేచ్ఛకు పొంగినవాడు, అంతకు ఎక్కువైన స్వేచ్ఛకై పాడినాడు. వైషయికగీతాలలోని హృదయపక్వత మెదడునకు పట్టించుకున్నాడు. కళాసంపత్తి ఎక్కువ. కవిత్వంకోసం బ్రతుకుతాడు. రుచిగలవాడు.

జననం 1897

కృతులు : 1 కృష్ణపక్షం 2 ప్రవాసము - ఊర్వశి 3 కన్నీరు
4 శ్రావణి 5 కార్తీకి 5 మహతి [అముద్రితం]

## నండూరి సుబ్బారావు

తనకు సాక్షాత్కరించిన కవితను అందుకోవడంలో బంధాలను తెంచివేశాడు, నియమాలను తోసిపారవేశాడు, మహాసాహసంతో. ఈయనగీతాలు గుండెలలోనుంచి సూటిగా, వెచ్చగా ప్రవహిస్తవి. ఈయనసంస్కారము స్వచ్ఛమైన భూసారమునుంచి ఉత్తేజమందినది. మహాసున్నితమైన హృదయంతో భావిస్తాడు. 'చూపుతో మాటాడి', 'ఊపిరితో తెనిగించే' నిపుణుడు. భావమున, భాషలో, అన్నిట సాహసంతో ఎర్రబావుటా ఎత్తినాడు. ఈతిరుగుబాటు కొందరకు 'గాలిదుమార'మైంది, కొందరకు నవయుగప్రాభాత వాయుప్రసరణమైంది.

జననం 1895

కృతి : ఎంకిపాటలు

## కవికొండల వెంకటరావు

ఆంగ్లకవిప్రపంచంలో 'వర్డ్స్‌వర్త్ వలె' అడుగడుగున ప్రకృతి ఉపాసకుడు. అలుచిప్పమొదలు శివరాత్రిప్రభవరకూ సృష్టిలో సమస్తమూ ఈయనకు ఏదోఒక క్రొత్తఊహను స్ఫురింపజేస్తవి. రచనలలోనూ, ఊహాలలోనూ వైవిధ్యము ఎక్కువ. భాష పట్టింపు లేదు; భావాన్నిబట్టి, మానవికస్థితినిబట్టి, పద్యం ఇష్టం వచ్చినట్టు స్వతంత్రించి పరిగెడుతుంది. ఏవస్తువైనా ఈయనకు అమితఉత్సాహాన్ని, ఆవేశాన్ని కలిగిస్తుంది. ఊహాలలో మిక్కిలి ప్రత్యేకతగల వాడు. మొత్తంమీద భావమున వినూత్నత, విధానమున అతి స్వతంత్రత గల సాహసుడు.

జననం 1892

కృతులు: 1 నెలబాలుడు 2 ప్రకృతిచందనము 3 మాతృదేశసంకీర్తన 4 జనపదములు 5 విలాసినిపైనతేయము[అముద్రితం]

## అడవి బాపిరాజు

కవిత్వమేకాదు, చిత్రలేఖనమేకాదు, అభినయమేకాదు సులభంగా ఈయనకు అలవడని కళ లేదు. కళలు ఈయనను వరించినవి. అందు చేతనే ఈయనచిత్తరువులు కవిత్వభాషలో లిఖించినట్టు ఉంటవి; అచిత్తరువులలోనిరేకలు నాట్యవిన్యాసంతో కదలులాడుతవి. జానపదుల జీవితాలూ, వారిపదాలూ ఈయనను కలతపెట్టి కళాపుష్టిని కలిగిస్తవి. ఉత్కృష్టఆదర్శాలు, స్వతంత్రమైన ఊహాలు.

జననం 1895

కృతి: తొలకరి

## శ్రీరంగం శ్రీనివాసరావు [శ్రీ శ్రీ]

ఈయన పలికేవిధానంలో, భావించేపద్ధతిలో విశేషతఉన్నది. 'స్పెన్సిరియన్' విధానం మొదలు 'సిర్రియలిజం' వరకూ ఆంగ్లకవిత్వ పోకడలను అవగాహనచేసుకున్నాడు. అందుచేతనే వింతపోకడలు పోగలడు. అందరానిభావానికే లంగరువేయడానికి ఈయన చేసే యత్నం 'ఒకరాత్రి' లో గోచరిస్తుంది. గాలిలోకదలికలకు వింత ఆకారాలను కలిపించుకుంటుంది ఈయన భావన. చురుకైనవాడు.

జననం 1910

కృతులు : 1 ప్రభవ 2 మహాప్రస్థానం [అముద్రితం]

## రామచంద్రఅప్పారావు

ఈయనపుట్టుకను అందుకున్నది బంగారుతూగుటుయ్యేల; ఈయన పసినాటి తొలిచూపులకు పులకరించినవి కాంచనఘంటికానినాదములు, ఆశ్రితుల అభిమానసేవలు. కాని, వియ్యమందినది హృదయం విశ్వవేదనతో; కన్నులు పరిచయం అలవరుచుకున్నవి కలతగను విషాదచ్ఛాయలతో. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి అంతటి ఆయన, ఈయన పాలబుగ్గలపలికినకావ్యం 'తరణమునకు' మెచ్చుకుంటూ, 'ఈ

కాలమునన్ గవిత్వమనగాఁ, బెడత్రోవలఁద్రొక్కుచున్న గ
య్యాళికిఁ దుల్యమై చెడుట యారయుచుంటిమి, వారిత్రోవలన్
గాలిడఁబోకుమయ్య! యది గాలికి దూలికి, బోవు'

అని జాగరూకత పలికినప్పటికీ నిజమైన కవిత్వానికి అకర్షణగల రసపిపాసువు ఈయనహృదయం 'షెల్లీ' 'కీట్స్' లవైపే మరలింది.

ఈయన 'సౌందర్యోపాసన' లోని తీవ్రత ఈనాటి నూతనకవిత్వానికి కూడా నూతనం.

జననం 1909

కృతులు : 1 తరణము 2 సిరిరత్నాలు 3 వసంతగీత 4 సౌందర్యోపాసన

## పెనుమర్తి వెంకటరత్నం

దేశాభిమానం, భాషాభిమానం ఎక్కువగాగల యువకుడు. ఈయనకవితలో మెత్తన, మెలకువ, గోచరిస్తవి. పాపం, తొందరలో ముగిసిపోయింది ఈయనజీవితం. ఈకొసలో ఈయనపలికిన వాక్కులనుబట్టి గ్రహిస్తే, ఏమబ్బులమలుపులలోనో దృష్టికిఅనిన ఆశయాలకు తెరచాపనుఎత్తిన సాహసపునావికునివలె కనిపిస్తాడు. ఈయన ఆసించినయాత్రకు శరీరం కలిసిరాలేదు.

జననం 1907 - మరణం 1930

కృతులు : 1 సితసుధ 2 రత్నార్పణము [రెండూ అముద్రితాలే]

## కొడాలి ఆంజనేయులు

నాజూకుగా ఊహిస్తాడు, మెత్తనిమాటలపొందికలో జాగ్రత్తగా వ్యక్తపరుస్తాడు భావాన్ని. ఈయన 'పెండ్లికూతురు'లో కట్టిన బొమ్మలు తెలుగువారికన్నులకు చిరపరిచితాలు, అయినప్పటికీ

ఈయన చెప్పిన విధానాన్నిబట్టి ఎక్కువ రుచివంతాలు అయినవి. శైలిలో ఒక చక్కదనం ఈయన ప్రత్యేకత.

జననం 1898

## చావలి బంగారమ్మ

తెనుగుపుట్టింటి నుడికారము ఈమె గీతాలలోని ప్రత్యేక కమ్మదనము. సంస్కృత ఇంగ్లీషు శోటరికముల ఊపిరాడని తెనుగునకు ఈయమ పలుకురాక అలనాటి తీయని తెనుగుప్రాణవాయువు కాగలదు. తెనుగుకడుపునపుట్టి చేపదేరిన నుడికారము ఈమె భాష పోకడలలోనూ, తాటాకుబొమ్మలకు ప్రాణముపోసి కన్నబిడ్డనుగా చంకను ఎత్తగలిగిన పసినాటి తెలుగుభావన ఈమె ఊహావీధిలోనూ... ఊహాప్రపంచాన ఎంతగారడీ ఉన్నదో ఆనందించవలెనంటే 'ఆకొండ' లోని చోద్యమునుబట్టి గ్రహించవచ్చును. పుట్టుకతోనే కవిత్వము, పాండిత్యప్రకర్షతో దీనికి సంబంధములేదు అనుటకు ఈమె తార్కాణ.

జననం 1897

## మల్లవరపు విశ్వేశ్వరరావు

భావన చిత్రగతులను విహారిస్తుంది, అనుగుణంగా గీతం నడకలుకూడా. ఏ మబ్బులలోనికో ఎగరవలెనన్న ఆశ ఈయనగీతాలకు మూలం. ఏ నియమాలకూ లొంగనితనం ఈయన తిరుగుబాటు.

జననం 1904

## తల్లాప్రగడ విశ్వసుందరమ్మ

అందరానిఊహాలకు ఆనించే వ్యక్తి, ఈమె. అందుచేతను భావప్రపంచంసరిహద్దులదరికిమాత్రం తీసుకుపోతవి ఈమె గీతాలు. ఈవిడ ప్రతిగీతంలోనూ అవ్యక్తంగానైనా ఒకవేదన, గుండె చురుక్కుమన్న కోయిలకేకవలె ధ్వనిస్తుంది.

జననం 1900

## సూచిక :


| | |
|---|---|
| అంధకారము | 204 |
| అంధభిక్షువు | 210 |
| అడవిపిల్ల | 45 |
| అడవిపూవు | 171 |
| అన్వేషణము | 128 |
| అపుడు నిల్చితి ... | 52 |
| అప్రాప్తమనోహారిణి | 76 |
| అభిసారిక | 80 |
| అయ్యారో ... | 102 |
| అశాంతి | 229 |
| ఆంధ్రపౌరుషము | 8 |
| ఆకసమున మబ్బు... | 98 |
| ఆకాలపు నాయెంకి | 106 |
| ఆకొండ | 192 |
| ఆతిథ్యము | 25 |
| ఆనాటి నావోడు | 111 |
| ఆమనినిషా | 58 |
| ఆమెకన్నులు | 57 |
| ఆమెపాట | 64 |
| ఆరాధన | 72 |

| | |
|---|---|
| ఆవృత్తి | 213 |
| ఆశ - నిరాశ | 182 |
| ఆశయము | 184 |
| ఆశాగానము | 233 |
| ఆసురకృత్యము | 86 |
| ఈ నడికిరేయి... | 99 |
| ఈశ్వరీ! | 91 |
| ఉత్కంఠ | 235 |
| ఉన్మత్తపథికుడు | 231 |
| ఊరకే చలియించు ... | 97 |
| ఎడారి | 188 |
| ఎవరు ? | 27 |
| ఎవరులేని ... | 103 |
| ఏకాంతసేవ | 236 |
| ఏనాడు ? | 81 |
| ఏమో ! | 216 |
| ఒకటే కథ | 212 |
| ఒకరాత్రి | 206 |
| ఓయీ ! | 43 |
| ఓసఖీ ! | 50 |
| కత్తిపడవ | 121 |
| కప్పతల్లిపెళ్ళి | 199 |
| కలతనిదర | 95 |
| కలలోన నారొంకి | 113 |
| కాంక్ష | 18 |

| | |
|---|---|
| కాపుపాట | 42 |
| కార్తిక పూర్ణిమ | 101 |
| కార్తికపూర్ణిమ | 202 |
| కుపితవిధి | 117 |
| కూలియన్నల కుతుకము | 135 |
| కొండతిరిగీ... | 56 |
| కోకిల | 46 |
| కోయిల | 100 |
| కోయిల | 119 |
| గంగిరెద్దు | 154 |
| గతిక | 183 |
| చలిగడగడ ... | 95 |
| చలిపిడుగు | 220 |
| చిన్ని మబ్బులు | 139 |
| చెలియా! ... | 97 |
| చైత్రము | 198 |
| జన్మభూమి | 1 |
| జయభేరి | 167 |
| జైలులో చందమామ | 196 |
| తమస్సు | 205 |
| తల్లి | 222 |
| తాజ్ మహల్ | 88 |
| తిక్కనసోమయాజి | 165 |
| ద్రాక్షావీథి | 186 |
| దీపం | 66 |

| | |
|---|---|
| దీపావళివాడు | 207 |
| దురదృష్టము | 221 |
| దెబ్బతిన్నలేడి | 181 |
| దేశభక్తి | 2 |
| దొంగ | 124 |
| నటరాజ ! | 234 |
| నమిలిమింగిన నారొంకి | 92 |
| నాగులచవితి | 149 |
| నాటిరేయి | 90 |
| నా విరులదోఁట | 75 |
| నా స్థితి | 190 |
| నా హృదయవన ... | 87 |
| నిత్యక్రీడ | 65 |
| నిన్ను దలపోయుచునె ... | 94 |
| నీవు నేను | 185 |
| నెమలికన్ను | 190 |
| నేటిరేయి | 122 |
| నేను | 169 |
| నేను మాయమ్మ... | 112 |
| నైవేద్యము | 11 |
| పడవ | 176 |
| పడవ పగిలిన | 104 |
| పరాజయము | 72 |
| పల్లకి | 118 |
| పిలుపు | 40 |

| | |
|---|---|
| పిలుపు | 85 |
| పుష్యపూర్ణిమ | 226 |
| పూజాప్రసూనములు | 246 |
| పూర్ణిమ | 77 |
| పూలబాసలు | 38 |
| పృథివీప్రశంస | 20 |
| పెండ్లికూతురు | 147 |
| పెన్నిధి | 29 |
| ప్రణయయాత్ర | 113 |
| ప్రణయశాంతి | 55 |
| ప్రణయినీగీతం | 104 |
| ప్రతిదినము | 174 |
| ప్రతీక్ష | 203 |
| ప్రబోధము | 9 |
| ప్రవాసము | 214 |
| ప్రళయము | 70 |
| ప్రియనిరీక్షణము | 89 |
| ప్రియుడా! | 44 |
| ప్రేమకోఅకు | 31 |
| ప్రేమతత్త్వము | 30 |
| ప్రేమయాత్ర | 228 |
| ప్రేయసీ! ... | 108 |
| ఫలశ్రుతి | 74 |
| బ్రహ్మర్షి | 162 |
| బాష్ప దౌత్యము | 115 |

| | |
|---|---|
| భవతి భిక్షాందేహి | 138 |
| భవిష్యద్దర్శనము | 22 |
| మంగళాచరణము | 145 |
| మనవి | 239 |
| మనిషి | 134 |
| మహాకవి | 158 |
| మాతల్లి | 153 |
| మాతృగీతములు | 223 |
| ముందుగతి | 59 |
| ముందుగతి | 189 |
| ముక్తావళి | 238 |
| మురళీధ్వని | 123 |
| మూగనోము | 150 |
| మైనారిటీ వెళ్ళినరోజున | 136 |
| యాత్ర | 67 |
| రంభ | 35 |
| రక్తవిహారము | 69 |
| రాధ | 61 |
| రాధ | 126 |
| రామలింగారెడ్డి | 160 |
| లీలాజీవితము | 175 |
| వటపత్రశాయి | 244 |
| వత్సలాఫాలమున ... | 115 |
| వర్షాగమము | 201 |
| వలపునిండార ... | 140 |

| | |
|---|---|
| వార్త | 137 |
| వాల్జడ | 62 |
| వాల్మీకి | 156 |
| విరహాతోరణము | 109 |
| విరహావీథి | 79 |
| వేఁగిక్షేత్రము | 12 |
| వ్యర్థయత్నములు | 177 |
| శివరాత్రి ప్రభ | 241 |
| శుక్రవారము | 51 |
| శ్రవణములుసోకినంత ... | 105 |
| సంచలనశీలమైన ... | 71 |
| సన్న్యాసి | 33 |
| సమాలోచనము | 217 |
| సాధుగీతి | 26 |
| సుకృ— | 83 |
| సుషాంసికలు | 218 |
| స్నేహబంధము | 54 |
| స్నేహరుచి | 49 |
| స్వాగతము | 141 |
| స్వాతంత్ర్యరథము | 5 |
| స్వామి ! | 232 |

గురజాడ

దేశభక్తి 2
పెన్నిధి 29
మనిషి 134

రాయప్రోలు

జన్మభూమి 1
ప్రబోధము 9
విరహవీథి 79
పిలుపు 85
చెలియా ! 97
ఎవరు లేని... 103
మంగళాచరణము 145
మా తల్లి 153
రామలింగారెడ్డి 160
ఏమొ ! 216

బసవరాజు

ప్రేమతత్త్వము 30
కోకిల 46
తాజ్ మహాల్ 88

| | |
|---|---|
| కోయిల | 100 |
| దొంగ | 124 |
| నాగులచవితి | 149 |
| చలిపిడుగు | 220 |
| వటపత్రశాయి | 244 |


## సౌదామిని


| | |
|---|---|
| ప్రియనిరీక్షణము | 89 |
| చలిగడగడ... | 95 |
| ఆకసమున మబ్బు... | 98 |
| ప్రణయినీగీతము | 104 |
| దురదృష్టము | 221 |


## అబ్బూరి


| | |
|---|---|
| పృథివీప్రశంస | 20 |
| సాధుగీతి | 26 |
| కాపుపాట | 42 |
| ప్రణయశాంతి | 55 |
| అప్రాప్తమనోహారికి | 76 |
| భవతి భిక్షాం దేహి | 138 |
| వలపు నిండార... | 140 |
| తిక్కనసోమయాజి | 165 |
| ద్రాక్షావీథి | 186 |
| వర్షాగమము | 201 |

## వేంకటపార్వతీశ్వరులు


| | |
|---|---|
| ప్రేమకౌఅకు | 31 |
| ఆశ - నిరాశ | 182 |
| ఏకాంతసేవ ౧ | 236 |
| ఏకాంతసేవ ౨ | 237 |


## రామిరెడ్డి


| | |
|---|---|
| స్వాతంత్ర్యరథము | 5 |
| నైవేద్యము | 11 |
| భవిష్యద్దర్శనము | 22 |
| అమనినిషా | 58 |
| అభిసారిక | 80 |
| బాష్పదౌత్యము | 115 |
| వాల్మీకి | 156 |
| గణిక | 183 |


## శివశంకరశాస్త్రి


| | |
|---|---|
| అపుడు నిల్చితి... | 52 |
| సంచలనశీలమైన... | 71 |
| నా హృదయవన... | 87 |
| అయ్యరో... | 102 |
| శ్రవణములఁ సోకినంత... | 105 |
| ప్రేయసీ... | 108 |
| పుష్యపూర్ణిమ | 226 |

## విశ్వనాథ


| | |
|---|---|
| ఆంధ్రపౌరుషము | 8 |
| వేంగిక్షేత్రము | 12 |
| రంభ | 35 |
| నేను మాయమ్మ... | 112 |
| చిన్నిమబ్బులు | 139 |
| స్వాగతము | 141 |
| మాగనోము | 150 |
| నీవు - నేను | 185 |
| నా సితి | 190 |
| అంధభిక్షువు | 210 |
| స్వామి | 232 |
| నీ రథము | 245 |


## దీక్షితులు


| | |
|---|---|
| వ్యర్థయత్నములు | 177 |
| నెమిలికన్ను | 190 |
| మనవి | 239 |


## నోరి


| | |
|---|---|
| పరాజయము | 72 |
| మురళీధ్వని | 123 |

మైనారిటీ వెళ్లిన రోజున 136
తల్లి 222

## వెంకటసుబ్బయ్య

ఆతిథ్యము 25

## నాయని

శుక్రవారము 51
నిత్యక్రీడ 65
ప్రళయము 70
ఫలశ్రుతి 74
అసురకృత్యము 86
కార్తికపూర్ణిమ 101
పడవపగిలిన ! 104
ప్రణయయాత్ర 113
వత్సలాఘాలమున 115
కత్తిపడవ 121
మాతృగీతములు ౧ 223
మాతృగీతములు ౨ 224
మాతృగీతములు 3 225

## వేదుల


| | |
|---|---|
| శాంతి | 18 |
| రాధ | 61 |
| యాత్ర | 67 |
| ఆరాధన | 72 |
| పూర్ణిమ | 77 |
| దీపావళినాడు | 207 |
| ఆవృత్తి | 213 |
| అశాంతి | 229 |
| ఆశాగానము | 233 |
| ఉత్కంఠ | 235 |
| ముక్తావళి | 238 |
| పూజాప్రసూనములు | 246 |


## కృష్ణశాస్త్రి


| | |
|---|---|
| ఎవరు ? | 27 |
| ఆమె కన్నులు | 57 |
| ఆమెపాట | 64 |
| నా విరులతోట | 75 |
| నాటిరేయి | 90 |
| ఊరకే చలియించు | 97 |
| ఈ నడికిరేయి | 99 |
| విరహాతోరణము | 109 |

| | |
|---|---|
| పల్లకీ! | 118 |
| నేటిరేయి | 122 |
| అన్వేషణము | 128 |
| మహాకవి | 158 |
| బ్రహారి | 162 |
| నేను | 169 |
| ఒకశే కథ | 212 |
| ప్రవాసము | 214 |
| సమాలోచనము | 217 |
| ఊన తపథికుడు | 231 |
| నటరాజ! | 234 |


## నండూరి

| | |
|---|---|
| పూలబాసలు | 38 |
| కొండతిరిగీ... | 56 |
| ముందుగతి | 59 |
| దీపం | 66 |
| ముక్క | 83 |
| నమిలిమింగిననాయెంకి | 92 |
| కలతనిదర | 95 |
| ఆకాలపు నాయెంకి | 106 |
| ఆనాటి నావోడు | 111 |
| కలలోన నాయెంకి | 113 |
| కోయిల | 119 |

పడవ 176
ముందుగతి 189

కవికొండల

ఓ సఖీ! 50
నిన్నే దలపోయుచునె 94
మాలియన్నల కుతుకము 135
వార్త 137
ప్రతిదినము 174
ఆశయము 184
శివరాత్రిప్రభ 241

బాపిరాజు

పిలుపు 40
గంగిరెద్దు 154

శ్రీ శ్రీ

జయభేరి 167
ఒకరాత్రి 206
మహాప్రస్థానికలు 218

## రామచంద్ర అప్పారావు


| | |
|---|---|
| ఓయీ! | 43 |
| స్నేహబంధము | 54 |
| వాల్జడ | 62 |
| రక్తవిహారము | 69 |
| ఈశ్వరీ! | 91 |
| లీలాజీవితము | 175 |


## పెనుమర్తి


| | |
|---|---|
| అడవిపూవు | 171 |
| ఎడారి | 188 |
| ప్రతీక్ష | 203 |
| ప్రేమయాత్ర | 228 |


## కొడాలి


| | |
|---|---|
| సన్న్యాసి | 33 |
| అడవిపిల్ల | 45 |
| రాధ | 126 |
| పెండ్లికూతురు | 147 |
| దెబ్బతిన్న లేడి | 181 |
| జైలులో చందమామ | 196 |

## బంగారమ్మ


| | |
|---|---|
| ఆకొండ | 192 |
| కప్పతల్లి పెళ్లి | 199 |
| కార్తికపూర్ణిమ | 202 |
| తమస్సు | 205 |


## విశ్వేశ్వరరావు


| | |
|---|---|
| ఏనాడు | 81 |
| చైత్రము | 198 |


## విశ్వసుందరమ్మ


| | |
|---|---|
| ప్రియుడా ! | 44 |
| స్నేహారుచి | 94 |
| కుపితవిధి | 117 |
| అంధకారము | 204 |

ఆంధ్ర గ్రంథాలయ ముద్రాశాల
బెజవాడ